ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

అక్రిడేషన్ లు కలపు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్త వారికీ మీడియా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

గురువారం, 05 నవంబర్ 2016 | Thursday 05 November 2026 | హైదరాబాద్
సంపుటి: 28 సంచిక: 196 | Vol.No 28 Issue No .196 | Hyderabad
పేజీలు: 12+12 | వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in



హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా

తీర్చిదిద్దుతాం..

- యాదవుల అండ ఉంటే అది సాధ్యం

- ఎన్టీఆర్ స్టేడియం యాదవమయం.. వేలాదిగా తరలివచ్చిన సదర్ సంబరం
- సదర్‌కు రాష్ట్ర ఉత్సవ హోదా.. రూ. 5 కోట్ల నిధులు విడుదల

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, హైదరాబాద్, నవంబర్ 04:

హైదరాబాద్ నగరం మంగళవారం యాదవమయమైంది. ఎన్టీఆర్ స్టేడియం వేదికగా జరిగిన శ్రీకృష్ణ సదర్ సమ్మేళన్‌కు వేలాది మంది యాదవ సోదరులు తరలివచ్చారు. డప్పుల మోత, కోలాటం, సాంప్రదాయ వస్త్రధారణతో స్టేడియం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి యాదవ సోదర సోదరీమణులందరికీ హైదరాబాద్ సదర్ ఉత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



హైదరాబాద్ అభివృద్ధిలో యాదవులే వెన్నెముక హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా, దేశంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ సంకల్పమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవనం, మెట్రో రైలు విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో నగర రూపురేఖలే మారిపోతాయని చెప్పారు. ఈ అభివృద్ధి ప్రయాణంలో యాదవుల సంపూర్ణ సహకారం ఉండాలని కోరారు. హైదరాబాద్ నగరాభివృద్ధిలో యాదవ సోదరుల కృషి అనిర్వచనీయమని ముఖ్యమంత్రి కొనియాడారు. దేశంలో ఎక్కడి నుంచి ఏ పని కోసం నగరానికి వచ్చిన వారినైనా యాదవులు ఆదరించి అక్కున చేర్చుకున్నారని, నగరంలో శాంతి 02



హైదరాబాద్‌లో

క్రీడా పండగ..

ఎల్బీ స్టేడియంలో సరికొత్త టెన్నిస్ కాంప్లెక్స్ ప్రారంభం!

మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఘన ప్రారంభం

తెలంగాణను దేశంలోనే నంబర్ 1 స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం : మంత్రి పొన్నం ప్రభాకర్ 02

ఖేలో ఇండియాకు తెలంగాణ సిద్ధం.. దేశం మొత్తం మన ఆతిథ్యాన్ని చూసి ప్రశంసించాలి

చిల్లర కోసం వాగ్వాదం..

కండక్టర్ ప్రాణం తీసింది!

- మహిళా కండక్టర్ ప్రవళిక మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి
- ప్రవళిక కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ అండగా ఉంటుంది



తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, నవంబర్ 04:

ఒక చిన్న చిల్లర వివాదం ఒక నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. ప్రయాణికురాలితో జరిగిన వాగ్వాదంలో బస్సు నుంచి కిందకు తోసివేయబడి, బస్సు టైర్ల కింద పడి తీవ్రంగా గాయపడిన మణుగూరు డిపో మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక చికిత్స పొందుతూ మృతి చెందారు.

అసలేం జరిగింది?



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు వద్ద ఈ దారుణ ఘటన చోటు చేసుకుంది. అశ్వాపురం మండలం మిట్టగూడెంకు చెందిన మౌనిక అనే మహిళ తన కొడుకుతో కలిసి భద్రాచలం వెళ్లే బస్సు ఎక్కింది. కొడుకుకు టికెట్ 02



త్వరలో బీజేపీలోకి బీఆర్ఎస్ కీలకమైన నేత?

తెలంగాణ రాజకీయాల్లో సంచలనం!

- అధినాయకత్వంతో విభేదాలు.. పార్టీకి గుడ్‌బై చెప్పబోతున్నారా?
- ఇది కేవలం ప్రచారమేనా... లేక నిజంగా తెర వెనుక ఏదో జరుగుతుందా?
- ఢిల్లీలో బీజేపీ పెద్దలతో రహస్య భేటీలు.. త్వరలోనే కీలక ప్రకటన?

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, నవంబర్ 04:

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అందరి నోటా ఒకటే మాట.. బీఆర్ఎస్‌లోని ఒక కీలకమైన నేత బీజేపీలోకి వెళ్తున్నారా? గత కొన్ని రోజులుగా రాజకీయ వర్గాల్లో, సోషల్ మీడియాలో, టీ కొట్ల దగ్గరా, రాజకీయ చర్చల్లోనూ ఇదే హాట్ టాపిక్‌గా మారింది. మాజీ మంత్రిగా ఉన్న ఆ కీలక నేత పార్టీ మారబోతున్నారనే ప్రచారం ఇప్పుడు సంచలనంగా మారింది. అంతర్గత పరిణామాలు, ఆ నేత తాజా వ్యవహారశైలి, ఆయన మాటల్లోని మార్పు.. ఇవన్నీ ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. నిజంగా ఆ కీలక నేత పార్టీ మారితే తెలంగాణ రాజకీయ ముఖచిత్రమే పూర్తిగా మారిపోతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 02

భూ వివాదాలకు

శాశ్వత పరిష్కారమే లక్ష్యం

- రాష్ట్రవ్యాప్తంగా రైతుల సమక్షంలోనే సమగ్ర భూ సర్వే
- వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని సర్వే చేయాలని లక్ష్యం,
- క్షేత్రస్థాయి సమస్యలను అధికారుల సమక్షంలోనే పరిష్కరిస్తాం,
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నవంబర్ 4 (విజన్ ఆంధ్ర బ్యూరో):

వచ్చే ఏడాదిలోగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అంగుళం భూమిని సమగ్రంగా సర్వే చేసి, భూ యజమానులకు పూర్తి భద్రతతో కూడిన వివాదరహిత భూములను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. భూమి ఉన్న ప్రతి రైతుకు ఆధార్ కార్డు తరహాలో వారి భూమికి సంబంధించిన సమగ్ర, భద్రతతో కూడిన రికార్డులు, పాస్‌బుక్కులు అందించాలన్నది ప్రభుత్వ సంకల్పమని మంత్రి గారు తెలిపారు. బుధవారం నాడు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించి భూ సర్వే, రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డి. శ్రీధర్ బాబు తో కలిసి మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టరేట్లో సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ,ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని చట్టంలో నిర్దేశించిన విధంగా తొలుత రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాల్లో మొదటి విడతగా వేగవంతంగా చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. గతంలో హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించామని, ఈసారి నేరుగా జిల్లాలకు వచ్చి స్థానిక ప్రజాప్రతినిధులు, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులతో సమావేశమై సమస్యలను సమీక్షిస్తున్నట్లు చెప్పారు.మండల స్థాయి అధికారుల జాబితా నుంచి యాదృచ్ఛికంగా అధికారులను ఎంపిక చేసి, ఆయా మండలాల్లో సర్వేకు 02



> రాష్ట్రంలో ప్రధానంగా రైతుల ప్రయోజనాల కోసమే భూముల రీసర్వే చేపడుతున్నామని, రైతుల భూ సమస్యల పరిష్కారానికి వారి సమక్షంలోనే రీసర్వే జరగాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. రీసర్వే జరిగే గ్రామాల్లో ప్రతిరోజు తహశీల్దార్లు పర్యటించాలని , ఆర్డీవో, అదనపు కలెక్టర్లు, కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించడమేగాక కనీసం వారానికోరోజు రీసర్వే జరిగే గ్రామాలకు వెళ్లాలని స్పష్టం చేశారు.





దేశంలోనే ఎక్కువ మంది డాక్టర్లను తయారు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ

- మహేశ్వరం మెడికల్ కాలేజీ విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం.. అసెంబ్లీలో లేవనెత్తుతాం
- వసతులు లేవు.. కరెంట్, వాటర్ బిల్లులు కూడా కట్టలేని దుస్థితి.. ఇదేనా ప్రభుత్వ పాలన?

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, మహేశ్వరం, నవంబర్ 04:
దేశంలోనే ఎక్కువ మంది డాక్టర్లను తయారు చేస్తున్న 02




ఏపీపీఎస్సీ

గ్రూప్-1 స్కామ్..

ఏపీ, తెలంగాణలో ఈడీ మెరుపుదాడులు

- మాజీ ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులు నివాసంలోనూ సోదాలు 02
- మనీ లాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు



కరవు కష్టాల నుంచి

రైతన్నను గట్టెక్కించండి

- కేంద్ర బృందానికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి

- కరవు పరిస్థితులపై కేంద్ర బృందంతో సీఎం చంద్రబాబు సమావేశం
- రాష్ట్రానికి ప్రత్యేక సాయం అందించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి
- వీబీ జీ రామ్ జీ పథకం పనిదినాలు 200కి పెంచాలని కోరిన సీఎం
- కరవు బాధితులకు డ్రాట్ కార్డులు, జేజేఎం విస్తరణకు సహకరించాలని వినతి
- పంటల బీమా పరిహారం త్వరగా చెల్లించేలా చూడాలని సూచన



అమరావతి, నవంబర్ 4 : ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయ రంగం కుదేలైన నేపథ్యంలో, రైతులను, ప్రజలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. రాష్ట్రంలో కరవు తీవ్రతను అంచనా వేసేందుకు పర్యటించిన కేంద్ర అంతర మంత్రిత్వ శాఖల బృందం (ఐఎంసీటీ) బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం చేపడుతున్న ఉపశమన చర్యలను సీఎం వారికి సమగ్రంగా వివరించారు. రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులను కేంద్ర బృందానికి వివరిస్తూ, “ఒకవైపు తీరప్రాంతం తుఫాన్లతో నష్టపోతుంటే, మరోవైపు 10

ఒక క్లిక్ చాలు..

జీవితమే తలకిందులు!

సైబర్ మోసాలపై ఎస్పీ జానకి హెచ్చరిక

- మహబూబ్‌నగర్‌లో 2300 మంది విద్యార్థినులకు సైబర్ అవగాహన
- ప్రేమ పేరుతో ట్రాప్, మార్ఫింగ్‌తో బ్లాక్‌మెయిల్.. అప్రమత్తంగా ఉండాలని సూచన
- మోసపోతే భయపడొద్దు.. వెంటనే 1930కు కాల్ చేయండి



తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, నవంబర్ 04: ఆన్‌లైన్‌లో తెలియకుండా చేసే ఒక చిన్న పొరపాటు జీవితాన్నే తలకిందులు చేస్తుంది. సోషల్ మీడియాలో అపరిచితులతో పరిచయం, ఒక ఫోటో షేర్ చేయడం, ఒక లింక్ క్లిక్ చేయడం.. ఇవన్నీ సైబర్ నేరగాళ్లకు ఆహ్వానం పలుకుతున్నట్లే. ఈ విషయాన్ని యువతులు ముఖ్యంగా గుర్తించాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ శ్రీమతి డి. జానకి, ఐపీఎస్ స్పష్టం చేశారు. సైబర్ జాగృక్త దివస్ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (TGCSB) మరియు 02



పోలవరం-బనకచర్ల లింక్‌పై

రేవంత్ సర్కార్ ద్వంద్వ వైఖరి

చంద్రబాబుకు రేవంత్ రెడ్డి గురుదక్షిణ ఇస్తున్నారన్న కవిత

నదీ జలాల వినియోగంపై ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని విమర్శ 02

పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని గుర్తించాలని సూచన

త్వరలో బీజేపీలోకి బీఆర్ఎస్ కీలకమైన నేత?

అధినాయకత్వం నిర్ణయమే కారణమా?

బీఆర్ఎస్‌లో ఇప్పుడు అంతా కొత్త నాయకత్వం చుట్టూనే నడుస్తోంది. పార్టీ భవిష్యత్తు, కీలక నిర్ణయాలు అన్నీ ఆ నాయకత్వం చుట్టూనే తిరుగుతున్నాయి. ఆ నాయకత్వంలోనే పనిచేయాలని అధినేత తేల్చి చెప్పడంతో ఆ కీలక నేత తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. పార్టీని నిలబెట్టడానికి, గెలిపించడానికి ఎంతో కష్టపడిన తనకు ఇప్పుడు తగిన ప్రాధాన్యత, గుర్తింపు దక్కడం లేదని ఆ నేత భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. తన నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా తనకున్న పట్టు, క్యాడర్‌లో ఉన్న ఫాలోయింగ్‌కు తగ్గట్టుగా పార్టీలో స్థానం లభించడం లేదనే ఆవేదన ఆయనలో ఉందని అంటున్నారు. పార్టీలో కొనసాగడం వల్ల తనకు రాజకీయంగా ఆశించిన ప్రయోజనం ఉండదనే నిర్ణయానికి ఆయన వచ్చినట్లు సమాచారం. ఇక ఇదే పార్టీలో ఉంటే భవిష్యత్తు లేదని, కొత్త దారి వెతుక్కోవాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది.

బీజేపీ పెద్దలతో రహస్య భేటీలు.. ఢిల్లీలో సంప్రదింపులు?

ఇప్పటికే పలుమార్లు బీజేపీ ముఖ్య నేతలతో ఆ కీలక నేత భేటీ అయినట్లు రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. హైదరాబాద్‌లోనే కాకుండా ఢిల్లీ స్థాయిలోనూ సంప్రదింపులు జరిగినట్లు ప్రచారం సాగుతోంది. బీజేపీ జాతీయ నాయకత్వం కూడా ఆ నేత చేరికపై సానుకూలంగా ఉన్నట్లు చెబుతున్నారు. తెలంగాణలో బీజేపీకి బలమైన, సమర్థవంతమైన, ప్రజల్లో పట్టున్న నాయకుడు కావాలని ఆ పార్టీ చాలా కాలంగా చూస్తోంది. ఆ కీలక నేత లాంటి నాయకుడు వస్తే పార్టీకి రాష్ట్రంలో ఊహించని బలం వస్తుందని బీజేపీ నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే ఆయనకు తగిన గౌరవం, కీలక బాధ్యతలు ఇచ్చేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని ప్రచారం జరుగుతోంది. త్వరలోనే పార్టీ మార్పుపై కీలక నిర్ణయం తీసుకుని, అధికారికంగా బీజేపీలో చేరనున్నారనే ప్రచారం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

ఆ నేత వెళ్తే బీఆర్ఎస్‌కు పెద్ద దెబ్బ!

ఆ కీలక నేత అంటే బీఆర్ఎస్‌కు కేవలం ఒక నాయకుడు మాత్రమే కాదు. పార్టీకి వెన్నెముక లాంటి వారు. ఎన్నికల వ్యూహాలు, సంస్థాగత బలోపేతం, క్యాడర్‌ను కాపాడుకోవడం.. ఇలా ప్రతి విషయంలోనూ ఆయన పాత్ర కీలకం. అలాంటి నాయకుడు పార్టీని వీడితే బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ తగులుతుందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. మరోవైపు ఆ నేతతో పాటు ఆయన అనుచరులు, సన్నిహిత నేతలు కూడా పార్టీ మారే అవకాశం ఉందని చెబుతున్నారు. దీంతో బీఆర్ఎస్‌లో కలకలం మొదలైంది. పార్టీ శ్రేణులు ఈ ప్రచారాన్ని నమ్మాలో, నమ్మకూడదో తెలియక అయోమయంలో ఉన్నాయి.

బీజేపీలో ఉత్సాహం.. కాంగ్రెస్‌లో ఆందోళన

ఆ కీలక నేత బీజేపీలో చేరుతారనే వార్తతో బీజేపీ వర్గాల్లో ఉత్సాహం నెలకొంది. రాబోయే ఎన్నికల్లో ఆ నేత రాకతో తెలంగాణలో బీజేపీకి తిరుగుండదని ఆ పార్టీ క్యాడర్ ధీమా వ్యక్తం చేస్తోంది. అదే సమయంలో అధికార కాంగ్రెస్‌లోనూ ఈ ప్రచారం కలవరం రేపుతోంది. ఆ నేత బీజేపీలోకి వెళ్తే ప్రతిపక్ష ఓటు చీలకుండా బీజేపీ బలపడుతుందని, అది కాంగ్రెస్‌కు ఇబ్బందిగా మారుతుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపు

అయితే ఈ విషయంపై ఇప్పటివరకు ఆ కీలక నేత గానీ, బీఆర్ఎస్ గానీ, బీజేపీ గానీ అధికారికంగా స్పందించలేదు. ఇది కేవలం ప్రచారమా? లేక నిజంగా తెరవెనుక ఏదో జరుగుతోందా? అనేది త్వరలోనే తేలనుంది. ఆ కీలక నేత తీసుకునే ఒక్క నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో పెద్ద భూకంపం సృష్టించడం ఖాయమని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అందరి చూపు ఇప్పుడు ఆ నేత వైపే ఉంది. ఆయన ఏం చెబుతారోనని రాష్ట్రమంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 స్కామ్..

హైదరాబాద్, నవంబర్ 4 : ఏపీపీఎస్సీ గ్రూప్-1 కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఏపీపీఎస్సీ మాజీ కార్యదర్శి, మాజీ ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులు నివాసంతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని పలు ప్రాంతాలు, మంగళగిరి సమీపంలోని హాయ్‌ల్యాండ్ రిసార్ట్ సహా మొత్తం ఏడు చోట్ల ఈ తనిఖీలు జరుగుతున్నాయి. ఆంజనేయులు, క్యామ్‌సైన్ మీడియా, ఇతర ప్రైవేట్ సంస్థల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలపై ఈడీ అధికారులు దృష్టి సారించారు. గత ప్రభుత్వ హయాంలో 2018లో 169 గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. 2020లో మెయిన్స్ పరీక్ష నిర్వహించారు. అయితే, జవాబు పత్రాల మూల్యాంకనంలో భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై విచారణ జరిపిన సిట్... మంగళగిరి వద్ద హాయ్‌ల్యాండ్ రిసార్ట్‌లో 84 రోజుల పాటు మూల్యాంకనం చేశారని, అర్హత లేని 66 మందితో జవాబు పత్రాలను దిద్దించారని తన నివేదికలో తేల్చింది. ఈ మూల్యాంకనం కోసం క్యామ్‌సైన్ మీడియాకు రూ.1.14 కోట్లు, ఇతర సంస్థలకు రూ.1.38 కోట్లు చెల్లించినట్టు సిట్ గుర్తించింది. ఈ నివేదిక ఆధారంగా 2025 ఏప్రిల్‌లో పోలీసులు కేసు నమోదు చేయగా, గతంలో పీఎస్ఆర్ ఆంజనేయులు, క్యామ్‌సైన్ మీడియా డైరెక్టర్‌ను అరెస్ట్ చేశారు. సిట్ దర్యాప్తు నివేదిక ఆధారంగానే, ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసి, తాజాగా సోదాలు చేపట్టింది.

పోలవరం-బనకచర్ల లింక్‌పై రేవంత్ సర్కార్ ద్వంద్వ వైఖరి

పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నదీ జలాల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని, ఈ విషయం ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాలతో మరోసారి బహిర్గతమైందని ఆమె విమర్శించారు. ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశాల్లో రాష్ట్ర అధికారులు గోదావరి - కావేరి నదుల అనుసంధానాన్ని సమ్మక్క సాగర్ నుంచి చేపట్టాలని కోరుతుంటే... మరోవైపు కేంద్ర హోంమంత్రి అధ్యక్షతన జరిగిన దక్షిణాది రాష్ట్రాల కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సమ్మతి తెలపడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని కవిత ఆరోపించారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ నీటి హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుందని, 2024లోనే తెలంగాణ జాగృతి తరపున తాము దీనిని వ్యతిరేకించామని గుర్తుచేశారు. "రాష్ట్రానికి హక్కుగా దక్కాల్సిన 250 టీఎంసీల గోదావరి జలాలను సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు 'గురుదక్షిణ'గా చెల్లించుకుంటున్నారు" అని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆమోదంతోనే ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విషయంలో ముందుకెళ్లేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని గుర్తించాలని కవిత హెచ్చరించారు. ఈ ప్రాజెక్టుపై కేంద్రం జరిపే అన్ని సంప్రదింపుల నుంచి తెలంగాణ తక్షణమే వైదొలగాలని, ప్రాజెక్టును అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వెంటనే లేఖ రాయాలని ఆమె డిమాండ్ చేశారు.

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

సంబంధించిన అంశాలు, పెండింగ్ దరఖాస్తులు, ప్రజల నుంచి వస్తున్న అభ్యంతరాలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులపై నేరుగా చర్చిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కోరుతున్న అంశాలు, అధికారులకు ఎదురవుతున్న సమస్యలు, పరిష్కారానికి అవసరమైన ప్రభుత్వ స్థాయి అనుమతులు, మార్గదర్శకాలపై ఉన్నది ఉన్నట్లుగా అధికారులు వివరించాలని సూచించారు. సమస్యలను దాచిపెట్టకుండా స్పష్టంగా తెలియజేస్తే అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలను నిజాయితీగా పరిష్కరిస్తూ బాధ్యతాయుతంగా పనిచేసే అధికారులను ప్రభుత్వం అభినందిస్తుందని మంత్రి తెలిపారు. ఉద్దేశపూర్వకంగా సమస్యలను తప్పుదోవ పట్టించే లేదా ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అధికారులపై అదే స్థాయిలో తక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దాదాపు 125 ఏళ్ల క్రితం జరిగిన సర్వే తర్వాత రాష్ట్రంలో మరోసారి ఇంత విస్తృత స్థాయిలో సమగ్ర భూ సర్వే చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ సర్వే ద్వారా కేవలం భూముల కొలతలకే పరిమితం కాకుండా, సర్వే నంబర్లు ఒకచోట ఉండటం, భూముల వాస్తవ స్వాధీన స్థితి మరోచోట ఉండటం వంటి సమస్యలకు కూడా శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సరిహద్దు వివాదాలు, పట్టా భూములకు సంబంధించిన సమస్యలు, భూముల హద్దులపై నెలకొన్న వివాదాలు వంటి అంశాలను కూడా సమగ్ర సర్వే ద్వారా గుర్తించి పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం విజయవంతం కావడానికి అధికారులు సమష్టిగా కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. 22ఎ కు సంబంధించి ఇప్పటివరకు ఇచ్చిన జీవో లు, మెమో లతో కవర్ కానీ అంశాలు ఏమైనా ఉంటే పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య , మనోహర్ రెడ్డి, అరికెపూడి గాంధీ, బండారు లక్ష్మారెడ్డి, ఈర్లపల్లి శంకర్, మర్రి రాజశేఖర రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒక క్లిక్ చాలు.. జీవితమే తలకిందులు!

మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ శాఖ సంయుక్తంగా బుధవారం మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో భారీ సైబర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 2300 మంది విద్యార్థినులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎస్పీ జానకి ముఖ్య అతిథిగా పాల్గొని సైబర్ నేరాల తీరుతెన్నులను కళ్లకు కట్టినట్టు వివరించారు.

సైబర్ నేరగాళ్ల ట్రాప్ ఇలా..

ప్రస్తుత డిజిటల్ యుగంలో ఇంటర్నెట్, సోషల్ మీడియా వినియోగం విపరీతంగా పెరిగిందని, దానితో పాటు సైబర్ నేరాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయని ఎస్పీ అన్నారు. ముఖ్యంగా యువతులే టార్గెట్ అని, వారిని ట్రాప్ చేయడానికి నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతులు వాడుతున్నారని హెచ్చరించారు. మొదట సోషల్ మీడియాలో ఫ్రెండ్ రిక్వెస్ట్, తర్వాత స్నేహం పేరుతో నమ్మకం, ఆ తర్వాత వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, వీడియోలు సేకరణ, చివరకు వాటిని మార్ఫింగ్ చేసి బయటపెడతామని బెదిరించి డబ్బులు డిమాండ్ చేయడం.. ఇదే నేరగాళ్ల ఫార్ములా అని వివరించారు. అంతేకాదు, నకిలీ ప్రొఫైల్స్, ప్రేమ పేరుతో మోసాలు, వీడియో కాల్స్ ద్వారా బ్లాక్‌మెయిల్, నకిలీ ఉద్యోగ అవకాశాలు, ఆన్‌లైన్ గేమ్స్, ఫేక్ లింకులు, ఫేక్ కస్టమర్ కేర్ నంబర్లు.. ఇలా ప్రతి దానిలోనూ మోసం దాగి ఉందని తెలిపారు.

అమ్మాయిలు గుర్తుంచుకోవాల్సిన 5 సూత్రాలు

విద్యార్థినులు తమ భద్రత కోసం తప్పనిసరిగా పాటించాల్సిన జాగ్రత్తలను ఎస్పీ వివరించారు.

1. వ్యక్తిగత సమాచారం షేర్ చేయొద్దు:లి మీ ఫొటోలు, వీడియోలు, ఫోన్ నంబర్, చిరునామా, కళాశాల వివరాలను అపరిచితులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దు.
2. అకౌంట్‌కు లాక్ వేయండి: సోషల్ మీడియా ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్, టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ తప్పనిసరిగా పెట్టుకోండి. పాస్‌వర్డ్‌ను ఎవరితోనూ షేర్ చేయొద్దు.
3. లింక్ వస్తే ఆలోచించండి:లి అనుమానాస్పద లింకులు, ఆఫర్లు, లాటరీ గెలిచారన్న మెసేజ్‌లు వస్తే క్లిక్ చేయొద్దు.
4. OTP, PIN ఎవరికీ చెప్పొద్దు: బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని చెప్పినా న్యూ, బ్యాంకు వివరాలు, UPI PIN ఎవరికీ తెలియజేయవద్దు. బ్యాంకు ఎప్పుడూ న్యూ అడగదు.
5. భయపడొద్దు, చెప్పండి:లి ఆన్‌లైన్‌లో ఎవరైనా బెదిరించినా, అసభ్యకర సందేశాలు పంపినా భయపడి దాచొద్దు. వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు చెప్పండి. దాచిపెట్టడమే నేరగాళ్లకు బలం.

మోసపోతే మొదటి గంటే గోల్డెన్ అవర్

సైబర్ ఆర్థిక మోసానికి గురైనప్పుడు మొదటి గంటను గోల్డెన్ అవర్‌గా పరిగణించాలని ఎస్పీ స్పష్టం చేశారు. మోసం జరిగిన వెంటనే ఆలస్యం చేయకుండా లి1930లి సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. అదేవిధంగా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లిఒఒఒ.ఎఎవతీఎతీఅఎవ.గ్రశీఙ.అఅలి ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. త్వరగా ఫిర్యాదు చేస్తే మోసగాళ్ల ఖాతాలకు వెళ్లిన నగదును నిలిపివేసి, తిరిగి రాబట్టే అవకాశం ఉంటుందని వివరించారు. ఆలస్యం చేస్తే డబ్బు చేతులు మారిపోతుందని హెచ్చరించారు.

అవగాహన పోస్టర్లతో ప్రత్యక్ష వివరణ

అనంతరం విద్యార్థినులకు సైబర్ నేరాల రకాలు, వాటి నుంచి రక్షించుకోవాల్సిన జాగ్రత్తలు, మోసానికి గురైనప్పుడు తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించిన అవగాహన పోస్టర్లను ప్రదర్శించి వివరించారు. విద్యార్థినులు కేవలం తాము తెలుసుకోవడంతో ఆగకుండా తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా ఈ విషయాలపై అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ సైబర్ అవగాహన రాయబారిగా మారాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సైబర్ క్రైమ్ డీఎస్పీ గిరి కుమార్, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇజాజ్ ఉద్దీన్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణయ్య, కళాశాల ప్రిన్సిపాల్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం..

భద్రతలను కాపాడటంలో వారి పాత్ర ఎంతో కీలకమని ప్రశంసించారు. హైదరాబాద్ జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్ఠలు సాధించి అభివృద్ధి చెందిన నగరంగా నిలబడాలంటే యాదవులు మరింత కష్టపడాలని పిలుపునిచ్చారు. యాదవుల ఆత్మగౌరవం, హక్కులను కాపాడే విషయంలో ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసే బాధ్యత తనదేనని భరోసా ఇచ్చారు.

గత ప్రభుత్వం పట్టించుకోలేదు.. మేం రాష్ట్ర ఉత్సవం చేశాం

గత ప్రభుత్వ హయాంలో సదర్ సమ్మేళనాన్ని అధికారికంగా నిర్వహించలేదని సీఎం గుర్తు చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే యాదవ సోదరుల విజ్ఞప్తి మేరకు సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర ఉత్సవంగా గుర్తిస్తూ ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఈ ఉత్సవాల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ. 5 కోట్ల నిధులు విడుదల చేసిందని ప్రకటించారు. బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌తో పాటు ఎన్నో రాష్ట్రాల నుంచి ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని సదర్ ఉత్సవానికి మరింత శోభను తెచ్చారని వ్యాఖ్యానించారు. ఇది కేవలం తెలంగాణ వేడుక మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా యాదవుల ఐక్యతకు ప్రతీక అని అన్నారు.

కులగణనతో దేశానికి దారి చూపాం

దేశంలోనే మొట్టమొదటిసారిగా కులగణన చేసి తెలంగాణ దేశానికి మార్గదర్శకంగా నిలబడిందని సీఎం చెప్పారు. ఎవరెంత మేరకు ఉంటే అంత శాతం వాటా కల్పించాలన్న లక్ష్యంతోనే కులగణన చేశామని, యాదవులకు ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించామని తెలిపారు. ఈశ్వరమ్మ యాదవ్‌కు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి పాలకమండలి సభ్యురాలిగా నియమించడమే కాకుండా, యాదగిరిగుట్ట గోశాల బాధ్యతలను కూడా అప్పగించామని గుర్తు చేశారు. ఇది యాదవ సమాజానికి ఇచ్చిన గౌరవానికి నిదర్శనమని అన్నారు.

వేదికపై ప్రముఖుల సందడి

ఈ సదర్ ఉత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్, బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, మల్లు రవి, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఎంపీ ధర్మేంద్ర యాదవ్, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, పలువురు ప్రజాప్రతినిధులు, శ్రీకృష్ణ సదర్ సమ్మేళన్ ఉత్సవ కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, వివిధ రాష్ట్రాలకు చెందిన యాదవ ప్రతినిధులు పాల్గొన్నారు. సదర్ ఉత్సవం ముగిసే వరకు ఎన్టీఆర్ స్టేడియం పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

హైదరాబాద్‌లో క్రీడా పండగ..

తెలంగాణ స్టేట్ బ్యూరో, నవంబర్ 04, విజన్ ఆంధ్ర: హైదరాబాద్‌లోని చారిత్రాత్మక ఎల్బీ స్టేడియం బుధవారం క్రీడా సందడితో కళకళలాడింది. ఎన్నో ఏళ్లుగా క్రీడాకారులకు స్ఫూర్తినిచ్చిన ఈ స్టేడియం ఇప్పుడు మరింత సరికొత్త హంగులతో ముస్తాబైంది. ఆధునీకరించిన అత్యాధునిక టెన్నిస్ కాంప్లెక్స్‌ను మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ ఘనంగా ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి, టెన్నిస్ కోర్టులను పరిశీలించిన మంత్రులు క్రీడాకారులతో ముచ్చటించారు. అత్యాధునిక వసతులతో నిర్మించిన ఈ కాంప్లెక్స్‌ను చూసి క్రీడాకారులు, కోచ్‌లు హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో టెన్నిస్ క్రీడకు ఇది కొత్త ఊపు తీసుకొస్తుందని అందరూ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ క్రీడా సలహాదారు జితేందర్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వాణి ప్రసాద్, క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ సోనీ బాలదేవి, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల్ చారి, శంకర్ గీతా కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, ఇతర ముఖ్య నేతలు, ఉన్నతాధికారులు, క్రీడాకారులు, కోచ్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణకు ఖేలో ఇండియా రావడం గర్వకారణం

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణలో క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తోందని చెప్పారు. ఖేలో ఇండియా నిర్వహణ బాధ్యతలు తెలంగాణకు రావడం మనందరికీ గర్వకారణమని, ఈ అవకాశం ఇచ్చిన కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఖేలో ఇండియా క్రీడలను అత్యంత విజయవంతంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ ఆతిథ్యాన్ని దేశం మొత్తం ప్రశంసించేలా, ఖేలో ఇండియాను ఒక చారిత్రాత్మక ఈవెంట్‌గా మార్చేలా సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

సీఎం కప్ నుంచి స్కూల్ స్థాయి వరకు.. ప్రతి చోటా క్రీడా సందడి

సీఎం కప్, పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీ స్థాయిలో క్రీడా పోటీల నిర్వహణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారిని ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యమని చెప్పారు. నిరుపయోగంగా పడి ఉన్న స్టేడియాలను తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని, ప్రతి స్టేడియం క్రీడాకారులతో కళకళలాడాలన్నదే ప్రభుత్వ సంకల్పమని అన్నారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ స్కూల్స్ ద్వారా తెలంగాణను దేశంలోనే స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో తెలంగాణ నుంచే ఎక్కువ మంది ఒలింపియన్లు రావాలని ఆకాంక్షించారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

ఖేలో ఇండియా విజయవంతానికి హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా అన్ని శాఖల నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, మెట్రో వాటర్ వర్క్స్, పోలీస్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్రీడా పాఠశాలలు ఉన్న ప్రాంతాల్లోనూ ఖేలో ఇండియా ఈవెంట్లు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్ వంటి క్రీడా పాఠశాలలకు క్రీడా పోటీల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రాలకే పరిమితం కాకుండా క్రీడాకారులకు అన్ని ప్రాంతాల్లో, మారుమూల గ్రామాల్లోనూ అవకాశాలు కల్పించాలని అన్నారు.

చదువే కాదు.. క్రీడల్లోనూ బంగారు భవిష్యత్తు

చదువుకుంటేనే ఉద్యోగాలు వస్తాయనే అపోహ నుంచి యువత బయటకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. క్రీడల్లో ప్రతిభ చూపితే ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్యలో సీట్లు పొందే అవకాశాలు ఉన్నాయని గుర్తు చేశారు. క్రీడలే జీవితాన్ని మార్చేస్తాయని, ఎంతో మంది క్రీడాకారులు దేశానికి కీర్తి తెచ్చారని ఉదాహరణలతో చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. క్రీడాకారుల విజయాల వెనుక క్రీడా ఉపాధ్యాయుల కృషి ఎంతో కీలకమని కొనియాడారు. క్రీడా ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించి తెలంగాణకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు. ప్రతి పాఠశాలలో, ప్రతి కళాశాలలో క్రీడా సంస్కృతి పెరగాలని, అప్పుడే తెలంగాణ నిజమైన స్పోర్ట్స్ హబ్‌గా మారుతుందని అన్నారు.

క్రీడాకారుల్లో నూతనోత్సాహం

టెన్నిస్ కాంప్లెక్స్ ప్రారంభంతో హైదరాబాద్‌లోని టెన్నిస్ క్రీడాకారుల్లో నూతనోత్సాహం నెలకొంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కోర్టులు, ఆధునిక వసతులు తమకు ఎంతో ఉపయోగపడతాయని క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేశారు.

చిల్లర కోసం వాగ్వాదం.. కండక్టర్ ప్రాణం తీసింది!

ఇవ్వమని కండక్టర్ ప్రవళికకు రూ. 100 ఇచ్చింది. ప్రవళిక రూ. 10 టికెట్ జారీ చేసి, మిగతా చిల్లర రూ. 90ను టికెట్ వెనుక రాసి ఇచ్చింది. చిల్లర ఇప్పుడే కావాలని మౌనిక పట్టుబట్టడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చెలరేగింది. వాగ్వాదం పెరిగి మౌనిక ఆగ్రహంతో ప్రవళికను బస్సు నుంచి కిందకు నెట్టివేసిందని ఆరోపణలు ఉన్నాయి. ఆ సమయంలో బస్సు కదులుతుండటంతో ప్రవళిక బస్సు వెనుక టైర్ల కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆమె రెండు కాళ్లు విరిగిపోయాయి. హైదరాబాద్‌లోని సాయి సంజీవని ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించినప్పటికీ ఆమె కోలుకోలేకపోయింది. ఎన్నో రోజులు మృత్యువుతో పోరాడి చివరకు బుధవారం ఉదయం కన్నుమూసింది.

ఉస్మానియా మార్చురీ వద్ద నివాళులు

ప్రవళిక పార్థివదేహానికి ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి నివాళులు అర్పించారు. ప్రవళిక తల్లిని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆర్టీసీ కుటుంబ సభ్యురాలిని కోల్పోవడం చాలా బాధాకరంగా ఉందని అన్నారు. ప్రమాదం జరగగానే మేనేజ్‌మెంట్ తరపున ఆసుపత్రికి వెళ్లి మంచి చికిత్స అందించే ప్రయత్నం చేశామని, తాను కూడా హాస్పిటల్‌కి వెళ్లి అమ్మాయికి ధైర్యం చెప్పానని తెలిపారు. ప్రవళిక మృతి తనను తీవ్రంగా కలచివేసిందని, ఆమె కుటుంబానికి ప్రగాఢ సంతాపం, హృదయపూర్వక సానుభూతి తెలియజేశారు. ఈ విషాద సమయంలో ఆ కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు.



కుటుంబానికి ప్రభుత్వ భరోసా

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో ప్రవళిక కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి ప్రకటించారు.

- ప్రవళిక తల్లికి ఉద్యోగం
- ఇందిరమ్మ ఇల్లు
- ప్రభుత్వం, ఆర్టీసీ నుండి 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా
- ఆర్టీసీ నిర్ణయం మేరకు బ్యాంకు నుండి కోటి రూపాయల ప్రమాద బీమా

ఫైనాన్షియల్‌గా ఇబ్బంది లేకుండా చూసుకున్నా, సభ్యురాలిని కోల్పోయిన బాధను ఎవరూ తీర్చలేరని మంత్రి అన్నారు. ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత కార్మికుల సంక్షేమానికి అనేక నిర్ణయాలు తీసుకున్నామని, పెండింగ్‌లో ఉన్న నిర్ణయాలన్నీ పూర్తి చేయడం వల్ల కార్మికులు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు.

దోషిపై హత్య కేసు

ఈ సంఘటనలో దోషిపై మొదట హత్య ప్రయత్నం కేసు ఉండేదని, ఇప్పుడు హత్య కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకూడదని ఆకాంక్షించారు. సిబ్బంది పొరపాటుగా ప్రవర్తించారంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని, చర్యలు తీసుకుంటామని చెప్పారు. కానీ చట్టాన్ని చేతిలోకి తీసుకొని తోసివేయడం వల్ల ఒక కుటుంబం రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రయాణికులే దేవుళ్లు - కానీ చట్టాన్ని చేతిలోకి తీసుకోవద్దు

ఆర్టీసీ ప్రయాణికులకు సౌకర్యాలు కలుగజేస్తుందని, అదే సమయంలో కార్మికుల సంక్షేమం, భద్రత ముఖ్యమని మంత్రి అన్నారు. ఏమైనా ఇబ్బంది ఉంటే ఫిర్యాదు చేయవచ్చని, ఇలాంటి దాడులు సరికాదని హితవు పలికారు. క్రమశిక్షణతో కాకీ బట్టల సంస్థగా ఆర్టీసీ ముందుకు వస్తుందని, ప్రయాణికులే దేవుళ్లు అన్నట్టుగా వారి సౌకర్యం కలుగజేయడం సిబ్బంది బాధ్యత అని సూచించారు. ప్రయాణికుల ద్వారా అసౌకర్యం కలిగితే చట్టం ముందు ఫిర్యాదు చేయాలన్నారు. ఏదైనా తప్పిపోతే దొరికినా బాధ్యతకు అప్పగించిన సంస్థ ఆర్టీసీ అని గుర్తు చేశారు. సంక్షేమ విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉంటుందని, కార్మికుల భద్రత, ప్రయాణికుల సౌకర్యం రెండూ అంతే ప్రాధాన్యత అని చెప్పారు. పరస్పరం ఇబ్బంది కలిగితే చట్టంలో ఫిర్యాదులు చేసుకోవాలి తప్ప ఇటువంటి సంఘటనలకు పాల్పడవద్దని కోరుతూ, ఆ కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటామని తెలియజేశారు. ప్రవళిక మృతితో మణుగూరు డిపోలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సహచర కండక్టర్లు, డ్రైవర్లు కన్నీరు మున్నీరుగా విలపించారు.

దేశంలోనే ఎక్కువ మంది డాక్టర్లను తయారు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ

రాష్ట్రం తెలంగాణ అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా విద్యార్థులు వచ్చి ఇక్కడ చదువుకుంటున్నారని, 9 ఏళ్లలో తెలంగాణను అంత గొప్పగా తీర్చిదిద్దుకున్నామని గుర్తు చేశారు. మహేశ్వరం మెడికల్ కాలేజీ విద్యార్థుల సమస్యల గురించి ప్రభుత్వాన్ని నిలదీస్తామని, అసెంబ్లీలో కూడా మీ సమస్యలను లేవనెత్తుతామని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. మహేశ్వరం మెడికల్ కాలేజీని సందర్శించిన హరీష్ రావు విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.



విద్యార్థులకు కనీస వసతులు లేవు

మెడికల్ కాలేజీలో విద్యార్థులకు కనీస వసతులు కూడా లేవని హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. కాలేజీ బిల్డింగ్‌కు వాటర్ బిల్లు, కరెంట్ బిల్లు కూడా కట్టడం చేతకావడం లేదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. వైద్య విద్యార్థులు చదువుకోవాల్సిన చోట ఇలాంటి దుస్థితి ఉంటే భవిష్యత్తులో వైద్య వ్యవస్థ పరిస్థితి ఏమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మహేశ్వరం మెడికల్ కాలేజీలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు

అందరి ముఖ్యమంత్రుల కంటే నేను గొప్ప అని రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నారని హరీష్ రావు ఎద్దేవా చేశారు. అది చెప్పాల్సింది నువ్వు కాదు రేవంత్ రెడ్డి, ప్రజలు చెప్పాలని అన్నారు. నీ అంత చెత్త ముఖ్యమంత్రి ఈ రాష్ట్రానికి రాలేదు, వచ్చినందుకు ప్రజలు కష్టపడుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష నాయకులు ఇంట్లో నుంచి ఎటు పోతున్నారు, ఎక్కడ అరెస్ట్ చేయాలి అని చెప్తున్న నీ ఇంటెలిజెన్స్ వ్యవస్థ.. ఈ విద్యార్థుల సమస్యలు చెప్పడం లేదా? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నేతలపై నిఘా పెట్టేంత శ్రద్ధ, విద్యార్థుల సమస్యలపై లేదా అని నిలదీశారు.

9 ఏళ్లలో తెలంగాణను గొప్పగా తీర్చిదిద్దాం

తెలంగాణ ఏర్పడిన తర్వాత 9 ఏళ్లలో వైద్య రంగంలో తెలంగాణ దేశంలోనే ముందంజలో నిలిచిందని హరీష్ రావు గుర్తు చేశారు. ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ తీసుకువచ్చి, వేలాది మంది డాక్టర్లను తయారు చేసే స్థాయికి తెలంగాణను తీసుకెళ్లామని చెప్పారు. ఇతర రాష్ట్రాల విద్యార్థులు కూడా ఇక్కడికి వచ్చి చదువుకోవడం తెలంగాణకు గర్వకారణమని అన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. మెడికల్ కాలేజీలను పట్టించుకోకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

అసెంబ్లీలో పోరాడుతాం

మహేశ్వరం మెడికల్ కాలేజీ విద్యార్థుల సమస్యలను వదిలిపెట్టబోమని హరీష్ రావు స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని నిలదీస్తామని, అసెంబ్లీలో కూడా ఈ సమస్యలను లేవనెత్తుతామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని చెప్పారు. హరీష్ రావు పర్యటన సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. హాస్టల్, తాగునీరు, విద్యుత్, ల్యాబ్, ఫ్యాకల్టీ కొరత వంటి అనేక సమస్యలు ఉన్నాయని వాపోయారు.

సంపాదకీయం

భారత్ లో అంత పేదరికం తగ్గిందా

దశాబ్ద కాలంలో ఆర్థిక, ఆర్థికేతర అంశాల్లో పేదరికాన్ని తగ్గించడంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని ప్రపంచ బ్యాంక్ నివేదిక తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా పేదరికాన్ని తగ్గిస్తున్న దేశాల్లో భారత్ కూడా ఒకటని ఆ నివేదిక పేర్కొంది.

'భారత్‌లో పేదరికం, సమానత్వం' పేరుతో ప్రపంచ బ్యాంక్ ఈ నివేదిక విడుదల చేసింది. దారిద్ర్య రేఖకు దిగువన అంటే రోజుకు 4.2డాలర్ల (సుమారు రూ. 399) కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్న జనాభా శాతం 2011 నుంచి 2023 మధ్య 57.7 శాతం నుంచి 16.1 శాతానికి తగ్గింది" అని నివేదికలో ప్రపంచబ్యాంక్ తెలిపింది. ఈ కాలంలో 49.6 కోట్ల మంది ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారు. అదే సమయంలో తీవ్ర పేదరికంలో అంటే రోజుకు 3 డాలర్ల (సుమారు రూ. 285)కంటే తక్కువ ఆదాయంతో నివసిస్తున్న జనాభా 27.1 శాతం నుంచి 2.6 శాతానికి తగ్గింది" అని వెల్లడించింది. భారత్‌లో పేదరికం తగ్గడం కొనసాగుతుందని, అయితే ఈ తగ్గుదల వేగం కొంత నెమ్మదించవచ్చని అంచనావేస్తున్నట్టు ప్రపంచ బ్యాంకు పేర్కొంది. రోజుకు రూ. 399 ఆదాయాన్నిదారిద్ర్య రేఖగా గుర్తిస్తే 2026లో 14.2 శాతంగా ఉన్నపేదరికం రేటు 2028 నాటికి 12.1 శాతానికి తగ్గవచ్చని అంచనావేసింది. "ఆర్థికేతర ప్రమాణాల ఆధారంగా పేదరికాన్ని అంచనావేయడానికి ఆక్స్‌ఫర్డ్ పావర్టీ అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్ (ఓపీహెచ్ఐ) రూపొందించిన మల్టిడైమన్షనల్ పావర్టీ ఇండెక్స్ (ఎంపీఐ) ఆధారంగా అంచనా వేస్తారు. 2005-06లో పేదరికం రేటు 53.8 శాతంగా ఉండగా అది 2019-21 నాటికి 16.4 శాతానికి తగ్గింది. 2022-23లో ఈ రేటు 15.5 శాతంగా ఉందని ప్రపంచ బ్యాంకు బహుముఖ పేదరిక సూచీ తెలిపింది. భారత్‌లో పేదరికం తగ్గుతున్నప్పటికీ ఆర్థిక అసమానతలు పెరుగుతున్న సమస్య మాత్రం అలాగే ఉంది. "నిజానికి ప్రజలెంత ఖర్చుచేస్తున్నారనేదాని ఆధారంగా అసమానతలను లెక్కిస్తే అవి చాలా తక్కువగా కనిపిస్తాయి. ఆదాయాలను పోల్చిచూస్తే అసమానత చాలా ఎక్కువగా ఉంటుంది" అని ఇండియాటుడే నిర్వహించిన కార్యక్రమంలో ఆర్థికవేత్త సంతోష్ మెహ్రోత్రా చెప్పారు. "భారత్‌లో ప్రజల ఆదాయాలకు సంబంధించి అసలు సర్వేలే నిర్వహించడం లేదు. మన దేశంలో ఆర్థిక అసమానతలు చాలా తీవ్రమైన సమస్య. అది మరింత తీవ్రమైంది. మనం దీనిని నిర్లక్ష్యం చేయకూడదు" అని ఆయన అన్నారు. ప్రపంచబ్యాంక్ నివేదికలోని అంశాలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్వాగతించారు. నివేదిక గణాంకాల్లోని సానుకూల అంశాలను సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్‌లో ఆమె ప్రస్తావించారు. "ప్రజల వినియోగం గణనీయంగా పెరగడం, ముఖ్యంగా మహిళలకు ఉపాధి అవకాశాలు పెరగడం, ఆహార సబ్సిడీతో పాటు సామాజిక సంక్షేమ పథకాల విస్తరణ వంటివి పేదరికం తగ్గడానికి ప్రధాన కారణాలని ప్రపంచ బ్యాంకు గుర్తించింది" అని నిర్మలా సీతారామన్ అన్నారు. "ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం అమలుచేస్తున్న విధానపరమైన ప్రయత్నాలు స్పష్టమైన ఫలితాలను ఇస్తున్నాయి. దీంతో అందరికీ అభివృద్ధి ఫలాలు అందించే సమ్మిళిత వృద్ధికి, ప్రజలకు మరిన్ని ఆర్థిక అవకాశాలు కల్పించడానికి బలమైన పునాది ఏర్పడుతోంది" అని ఆమె విశ్లేషించారు. పేదరికం తగ్గినప్పటికీ కొన్ని వర్గాల కుటుంబాల్లో ఇప్పుడది ఎక్కువగా కనిపిస్తోందని ప్రపంచ బ్యాంక్ నివేదిక తెలిపింది. విద్యాస్థాయి తక్కువగా ఉన్నవాళ్లు, ఆస్తులు తక్కువగా ఉన్నవాళ్లు, స్థిరమైన ఉపాధి పొందే అవకాశాలు పరిమితంగా ఉన్నవాళ్లు, కుటుంబపోషణ భారం ఎక్కువగా ఉన్నవాళ్ల కుటుంబాల్లో పేదరికం ఎక్కువగా ఉందని ప్రపంచ బ్యాంకు నివేదిక పేర్కొంది. కూలీల వేతనాల మధ్య అసమానతలు ఇప్పటికీ చాలా ఎక్కువగా ఉన్నాయని నివేదిక తెలిపింది. 2023లో అత్యధిక వేతనాలు పొందుతున్న పది శాతం కార్మికుల నగటు వేతనం, అతి తక్కువ వేతనాలు పొందుతున్న 10 శాతం కార్మికుల సగటు వేతనం కంటే దాదాపు 13 రెట్లు ఎక్కువగా ఉంది" అని నివేదిక పేర్కొంది. "కొన్ని ప్రత్యేక భౌగోళిక ప్రాంతాల్లో పేదరికం ఎక్కువగా ఉందని కూడా నివేదిక పేర్కొంది. చాలా రాష్ట్రాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పటికీ దేశంలోని మొత్తం పేద జనాభాలో సుమారు 57 శాతం జనాభా ఉత్తర ప్రదేశ్ నుంచి పశ్చిమ బెంగాల్ వరకు వరుసగా ఉన్న ప్రాంతాల్లోనే నివసిస్తోంది" అని నివేదిక పేర్కొంది. 2017 నుంచి 2023 మధ్యకాలంలో ఉద్యోగాలు, ఉపాధి పొందుతున్నవాళ్ల సంఖ్య సుమారు 13.4 కోట్లు పెరిగిందని కూడా నివేదిక పేర్కొంది. పని చేసే వయసులో ఉన్న జనాభా పెరుగుదలతో పోలిస్తే ఉపాధి పొందుతున్న వారి సంఖ్య దాదాపు రెట్టింపు పెరిగింది. ఈ ఉపాధి పెరుగుదలలో ఎక్కువ భాగం గ్రామీణప్రాంతాల్లో మహిళలు జీతం వచ్చే పనుల్లో చేరడం వల్లే సాధ్యమైంది. దీనివల్ల కుటుంబంలో సంపాదించే సభ్యుల సంఖ్య పెరిగింది. అయితే యువతలో నిరుద్యోగం పెరిగిన విషయాన్ని కూడా ప్రపంచ బ్యాంక్ ప్రత్యేకంగా ప్రస్తావించింది. 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం నుంచి 2027-28 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం మధ్య యువతలో నిరుద్యోగ రేటు 14.6 శాతం నుంచి 15.9 శాతానికి పెరిగింది. ఈ ప్రభావం ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువతులపై ఎక్కువగా పడిందని నివేదిక తెలిపింది. అంతేకాకుండా ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకున్నతర్వాత లెక్కించే వాస్తవ వేతనాల్లో పెద్దగా మార్పులేదని నివేదిక పేర్కొంది. అదే సమయంలో ఉపాధి పెరిగినప్పటికీ ఎక్కువ ఉత్పాదకత లేని పనుల్లోనే ఈ పెరుగుదల ప్రధానంగా కనిపించిందని తెలిపింది.

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

రాష్ట్రవ్యాప్తంగా రైతుల సమక్షంలోనే సమగ్ర భూ సర్వే,
వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని సర్వే చేయాలని లక్ష్యం,
క్షేత్రస్థాయి సమస్యలను అధికారుల సమక్షంలోనే పరిష్కరిస్తాం,
రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నవంబర్ 4 (విజన్ ఆంధ్ర బ్యూరో):రాష్ట్రంలో ప్రధానంగా రైతుల ప్రయోజనాల కోసమే భూముల రీసర్వే చేపడుతున్నామని, రైతుల భూ సమస్యల పరిష్కారానికి వారి సమక్షంలోనే రీసర్వే జరగాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. రీసర్వే జరిగే గ్రామాల్లో ప్రతిరోజు తహశీల్దార్లు పర్యటించాలని , ఆర్డీవో, అదనపు కలెక్టర్లు, కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించడమేగాక కనీసం వారానికోరోజు రీసర్వే జరిగే గ్రామాలకు వెళ్లాలని స్పష్టం చేశారు. వచ్చే ఏడాదిలోగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అంగుళం భూమిని సమగ్రంగా సర్వే చేసి, భూ యజమానులకు పూర్తి భద్రతతో కూడిన వివాదరహిత భూములను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. భూమి ఉన్న ప్రతి రైతుకు ఆధార్ కార్డు తరహాలో వారి భూమికి సంబంధించిన సమగ్ర, భద్రతతో కూడిన రికార్డులు, పాస్‌బుక్కులు అందించాలన్నది ప్రభుత్వ సంకల్పమని మంత్రి గారు తెలిపారు. బుధవారం నాడు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించి భూ సర్వే, రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డి. శ్రీధర్ బాబు తో కలిసి మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టరేట్లో సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ,ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని చట్టంలో నిర్దేశించిన విధంగా తొలుత రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాల్లో మొదటి విడతగా వేగవంతంగా చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. గతంలో హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించామని, ఈసారి నేరుగా జిల్లాలకు వచ్చి స్థానిక ప్రజాప్రతినిధులు, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులతో సమావేశమై సమస్యలను సమీక్షిస్తున్నట్లు చెప్పారు. మండల స్థాయి అధికారుల జాబితా నుంచి యాదృచ్ఛికంగా అధికారులను ఎంపిక చేసి, ఆయా మండలాల్లో సర్వేకు సంబంధించిన అంశాలు, పెండింగ్ దరఖాస్తులు, ప్రజల నుంచి వస్తున్న అభ్యంతరాలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులపై నేరుగా చర్చిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కోరుతున్న అంశాలు, అధికారులకు ఎదురవుతున్న సమస్యలు, పరిష్కారానికి అవసరమైన ప్రభుత్వ స్థాయి అనుమతులు, మార్గదర్శకాలపై ఉన్నది ఉన్నట్లుగా అధికారులు వివరించాలని సూచించారు. సమస్యలను దాచిపెట్టకుండా స్పష్టంగా తెలియజేస్తే అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలను నిజాయితీగా పరిష్కరిస్తూ బాధ్యతాయుతంగా పనిచేసే అధికారులను ప్రభుత్వం అభినందిస్తుందని మంత్రి తెలిపారు. ఉద్దేశపూర్వకంగా సమస్యలను తప్పుదోవ పట్టించే లేదా ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అధికారులపై అదే స్థాయిలో తక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దాదాపు 125 ఏళ్ల క్రితం జరిగిన సర్వే తర్వాత రాష్ట్రంలో మరోసారి ఇంత విస్తృత స్థాయిలో సమగ్ర భూ సర్వే చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ సర్వే ద్వారా కేవలం భూముల కొలతలకే పరిమితం కాకుండా, సర్వే నంబర్లు ఒకచోట ఉండటం, భూముల వాస్తవ స్వాధీన స్థితి మరోచోట ఉండటం వంటి సమస్యలకు కూడా శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సరిహద్దు వివాదాలు, పట్టా భూములకు సంబంధించిన సమస్యలు, భూముల హద్దులపై నెలకొన్న వివాదాలు వంటి అంశాలను కూడా సమగ్ర సర్వే ద్వారా గుర్తించి పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం విజయవంతం కావడానికి అధికారులు సమష్టిగా కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. 22ఎ కు సంబంధించి ఇప్పటివరకు ఇచ్చిన జీవో లు, మెమో లతో కవర్ కానీ అంశాలు ఏమైనా ఉంటే పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య , మనోహర్ రెడ్డి, అరికేపూడి గాంధీ, బండారు లక్ష్మారెడ్డి, ఈర్లపల్లి శంకర్, మర్రి రాజశేఖర రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రెండు వేరువేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు



మనోహరాబాద్ నవంబర్ 4 (విజన్ ఆంధ్ర): మనోహరా బాద్ మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒక యువకుడు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కాళ్లకల్ వద్ద బుధవారం ఉదయం కాళ్లకల్ నుంచి మేడ్చల్ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడు దుండిగల్‌కు చెందిన వ్యక్తిగా స్థానికులు తెలిపారు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మరో ఘటనలో మనోహరాబాద్ మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న మధ్యప్రదేశ్‌కు చెందిన పర్స్ లాల్ ఇన్వంటి (27)ను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు స్థానిక పరిశ్రమల్లో కార్మికుడిగా పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

మ్యూల్ బ్యాంకు ఖాతాల వినియోగంపై ఉక్కుపాదం

ఆపరేషన్ క్రాక్‌డౌన్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ఆపరేషన్
51 అనుమానిత మ్యూల్ బ్యాంకు ఖాతాల గుర్తింపు
ఖాతాలు అందించిన వారిపై 9 కేసులు నమోదు



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 4 (విజన్ ఆంధ్ర)మీ బ్యాంకు ఖాతాలను ఇతరులకు ఇవ్వవద్దు... సైబర్ నేరగాళ్లకు సహకరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు... జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేసి సంపాదించిన డబ్బును ఒకరి నుంచి మరొకరి ఖాతాలకు బదిలీ చేసేందుకు మ్యూల్ బ్యాంకు ఖాతాలను వినియోగిస్తున్న నేపథ్యంలో, అటువంటి ఖాతాలను గుర్తించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ క్రాక్‌డౌన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.

ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగా జిల్లాలో మొత్తం 51 అనుమానిత మ్యూల్ బ్యాంకు ఖాతాలను గుర్తించి, సంబంధిత బ్యాంకుల సమన్వయంతో విచారణ, క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టినట్లు వెల్లడించారు. సైబర్ నేరాలకు పాల్పడే వ్యక్తులకు తమ బ్యాంకు ఖాతాలను అందించడం, ఖాతాలను ఇతరుల ద్వారా నిర్వహించడం వంటి అంశాలపై సమగ్ర విచారణ నిర్వహించి, ఆధారాల మేరకు బాధ్యులపై ఇప్పటివరకు 9 కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌ల వారీగా నమోదైన కేసుల వివరాలు:
- ఆదిలాబాద్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ▪ 3 కేసులు
- మావల పోలీస్ స్టేషన్ 3 కేసులు
- ఉట్నూర్ పోలీస్ స్టేషన్ 1 కేసు
- అదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో - 2 కేసులు. మొత్తం 9 కేసులు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ఎవరూ తమ బ్యాంకు ఖాతాలను ఇతరులకు వినియోగించేందుకు ఇవ్వకూడదని, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డులు, పిన్ నంబర్లు, ఓటీపీలు ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. కమీషన్ లేదా ఇతర ఆశలకు లోబడి తమ ఖాతాల్లోకి తెలియని వ్యక్తుల నుంచి డబ్బులు జమ చేయించుకోవడం, ఇతర ఖాతాలకు బదిలీ చేయడం వంటి చర్యలకు పాల్పడితే సైబర్ నేరాల్లో భాగస్వాములుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మీకు తెలియకుండానే తమ బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లు వినియోగిస్తున్నట్లు గుర్తించినా, అనుమానాస్పద లావాదేవీలు జరిగినా వెంటనే సంబంధిత బ్యాంకుకు, పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణలో ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, మ్యూల్ ఖాతాల వినియోగానికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

పదో తరగతిలో 100 శాతం ఫలితాలకు కృషి చేయాలి 100 రోజుల ప్రత్యేక ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలి: ఏసీఎంఓ ఉద్ధవ్

బెజ్జూర్, నవంబర్ 4 (విజన్ ఆంధ్ర): కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలంలోని కుంటలమానేపల్లి ఆశ్రమ పాఠశాలతో పాటు టీడబ్ల్యూపీఎస్ కుంటలమానేపల్లి, అందుగులగూడ, పర్ధంగుడ, అందుగులగూడ లంబాడి తండా, సులుగుపల్లి పాఠశాలలను బుధవారం ఏసీఎంఓ ఉద్ధవ్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యాబోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, పదో తరగతి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా రూపొందించిన 100 రోజుల ప్రత్యేక ప్రణాళికను ఉపాధ్యాయులు పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ప్రతిరోజూ స్లిప్ టెస్టులు నిర్వహిస్తూ విద్యార్థుల విద్యా సామర్థ్యాలను అంచనా వేయాలని తెలిపారు. డిసెంబర్ నెలాఖరు నాటికి సిలబస్ పూర్తి చేసి, అనంతరం పునశ్చరణ తరగతులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం టీడబ్ల్యూపీఎస్ కుంటలమానేపల్లి ఉపాధ్యాయుడు సంతోష్‌పై పత్రికల్లో వచ్చిన వార్తలకు సంబంధించి విచారణ చేపట్టారు. విచారణ నివేదికను డీడీటీడబ్ల్యూ ద్వారా ప్రాజెక్టు అధికారికి సమర్పించినట్లు తెలిపారు. పర్యటనలో భాగంగా వివిధ పాఠశాలల్లో విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. బోధనా పద్ధతులను మరింత మెరుగుపరుచుకుంటూ గిరిజన విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులందరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ పర్యటనలో ఎస్ఆర్పీలు వెంకటేశ్, నందారాం, కుంటలమానేపల్లి ప్రధానోపాధ్యాయుడు పరిషరాం తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో దండారి గుస్సాడి సాంస్కృతిక ప్రదర్శన గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి: డీడీ జాదవ్ అంబాజీ



ఆసిఫాబాద్, నవంబర్ 4 (విజన్ ఆంధ్ర): జనజాతి గౌరవ దివస్ వేడుకల్లో భాగంగా నాల్గవ రోజు కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల బాలురులో దండారి గుస్సాడి సాంస్కృతిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గిరిజన ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయ కళారూపాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ ప్రదర్శన విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కళాకారుల సంప్రదాయ వేషధారణలు, నృత్యాలు, వివిధ వాయిద్యాల నడుమ సాగిన గుస్సాడి ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో ప్రాచీనమైనవని అన్నారు. దండారి, గుస్సాడి వంటి ప్రత్యేకమైన కళారూపాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు బిర్సా ముండా, కొమురం భీమ్, కుమారం సూరు వంటి గిరిజన పోరాట యోధుల చరిత్రను తెలుసుకోవాలని, వారి త్యాగాలు, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. చదువుతో పాటు తమ మూలాలను, సంస్కృతి సంప్రదాయాలను మరచిపోకుండా వాటి పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు గిరిజన కళలు, సంప్రదాయాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి మడావి శేఖు, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, లింబారావు, వార్డెన్ మధుకర్, ఎస్సీఆర్పీ రాథోడ్ రవీందర్, రాజ్ గోండ్ సేవా సమితి నాయకులు నానేష్, సిదాం కైలాష్, మనీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల స్థలాల కోసం ప్రత్యేక కార్యాచరణ పొంగులేటి



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 4 (విజన్ ఆంధ్ర బ్యూరో):తెలంగాణలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక పాలసీని మరియు శాశ్వత పరిష్కారాన్ని రూపొందిస్తోందని రెవెన్యూ,గృహ నిర్మాణ ,పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో జిల్లా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, డి.శ్రీధర్ బాబు లకు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...జర్నలిస్టులకు చట్టపరమైన చిక్కులు లేని విధంగా, నివాసయోగ్యమైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని తెలిపారు.త్వరలోనే అరులైన జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇళ్ల స్థలాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా మేడ్చల్ జిల్లా ప్రెస్ క్లబ్ భవన్ కోసం స్థలం కేటాయించేందుకు కృషి చేస్తానని తెలిపారు.కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు కల్లేపల్లి రవిచంద్ర,ప్రధాన కార్యదర్శి పాక రవీందర్ ,ఉపాధ్యకులు పన్నాల బాల్ రెడ్డి, రవికిరణ్ రెడ్డి,కార్యవర్గ సభ్యులు రామారావు,సీనియర్ జర్నలిస్టులు ఏం.హనుమంత్ రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన గదిని పరిశీలన

ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 4 (విజన్ ఆంధ్ర) : బుధవారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గల ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, పరిశీలించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను కుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత రిజిస్టర్ లను పరిశీలించి సంతకాలు చేశారు. ఈ కార్యక్రమములో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నెమత్ హాలీ, తహసిల్దార్,సిబ్బంది తదితరులు ఉన్నారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తతే శ్రీరామరక్ష

విద్యార్థులు, ఉపాధ్యాయులకు పోలీసుల అవగాహన



కామారెడ్డి బ్యూరో నవంబర్ 4(విజన్ఆంధ్ర)సైబర్ జాగరూకత దినోత్సవం సందర్భంగా కామారెడ్డి జిల్లా డీ4సీ ఆధ్వర్యంలో సదాశివనగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీరయ్య, డీ4సీ ఎస్ఐ నరేష్ నేతృత్వంలో సదాశివనగర్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మీ డబ్బు మీ క్లిక్ మీ ఎంపిక" అనే నినాదంతో ఆన్‌లైన్ ప్రకటనల మోసాలు, క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాల చోరీ, షేర్ల మార్కెట్, పెట్టుబడుల పేరుతో జరిగే మోసాల గురించి వివరించారు. తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. ఆన్‌లైన్ లావాదేవీల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద సందేశాలు, కాల్స్ పట్ల జాగ్రత్త వహించాలని అవగాహన కల్పించారు. సైబర్ ఆర్థిక మోసానికి గురైనప్పుడు ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సదాశివనగర్ సీఐ వీరయ్య, డీ4సీ ఎస్ఐ నరేష్, పోలీసు సిబ్బంది ప్రవీణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు తల్లి వల్లభు లక్ష్మీ గారి ప్రథమ వర్ధంతి



మహబూబాబాద్ జిల్లా లోని కేసముద్రం మున్సిపాలిటీలో వల్లభు వెంకటేశ్వర్లు నివాసంలో వారి తల్లి వల్లపు లక్ష్మి వర్ధంతి కార్యక్రమానికి బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై నివాళు లర్పించడం జరిగినది. ఈ కార్యక్రమానికి మానుకోటపట్టణ ఇంచార్జ్ ఎల్డీ మల్లయ్య గౌడ్, జిల్లా నాయకులు ముల్లంగి ప్రతాపరెడ్డి చుక్కల నరేష్, టౌన్ ఉపాధ్యక్షులు పెద్దబోయిన రవి యాదవ్ సంక్ల దీపక్ పటేల్ దగ్గుల సురేష్, మహిళా నాయకురాలు పాల్గొన్నారు

లీ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అదనపు కలెక్టర్ మధుమోహన్



మల్దకల్ నవంబర్ 4 (విజన్ ఆంధ్ర బ్యూరో)ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీసర్వే పనులను ఎలాంటి తగాదాలకు ఆస్కారం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారుజోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని బూడిదపాడు గ్రామంలో కొనసాగుతున్న రీ సర్వే పనులను జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్ బుధవారం క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే పనుల పురోగతిని సమీక్షించారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహణ తీరును, సంబంధిత రికార్డులను పరిశీలించి, పనుల అమలులో ఎదురవుతున్న అంశాలపై అధికారులతో చర్చించారు. పునఃసర్వే ప్రక్రియను పారదర్శకంగా, సమన్వయంతో నిర్వహిస్తూ, నిర్దేశిత లక్ష్యాల మేరకు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రీ సర్వేతో భూ తగాదాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సర్వేకు లైసెన్స్ సర్వేయర్ల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు.
ఈ పర్యటనలో సర్వే ఏడి నూకరాజు, మల్దకల్ తహసీల్దార్ ఝాన్సీ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు గాలికి.. స్వార్థ ప్రయోజనాలకే పెద్దపీట

– తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకుడు అరుణ్‌కుమార్, అసెంబ్లీ ఇంచార్జి వేణుగోపాల్ యాదవ్



ఆదిలాబాద్, బ్యూరో నవంబర్ 4 (విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్ జిల్లాలో ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోగా, అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని, నాయకులు మాత్రం వ్యక్తిగత ప్రయోజనాలకే పెద్దపీట వేస్తూ తమ ఆస్తులను రెట్టింపు చేసుకుంటున్నారని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకుడు అరుణ్‌కుమార్ విమర్శించారు. రోడ్లు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు లేక ఆదిలాబాద్ వెనుకబడిపోతుంటే.. నాయకులు మాత్రం ఆర్థికంగా ఎదుగుతున్నారని ఆరోపించారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారని, జిల్లా అభివృద్ధిపై చిత్తశుద్ధి చూపడం లేదని మండిపడ్డారు.వారు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారంటూ ఆరోపించారు. ఈ వ్యవహారంలో తమకు ఎలాంటి సంబంధం లేకపోతే విచారణకు ఎందుకు ముందుకు రావడం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని విలువైన భూములను కొందరు నాయకులు తమ పేర్లపై మార్చుకుంటున్నారని ఆరోపించారు. బీజేపీ కార్యాలయానికి కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు విక్రయించారన్న ఆరోపణలపైనా విచారణ జరపాలని డిమాండ్ చేశారు.చనాక కొరట ప్రాజెక్టుపై ప్రభుత్వం స్వతంత్రంగా విచారణ చేపట్టాలని కోరారు. భూసేకరణ పూర్తి చేసి కాలువల నిర్మాణం చేపడితే జిల్లాలోని రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రాజెక్టు ద్వారా రైతులకు పూర్తి ప్రయోజనం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సమావేశంలో తెలంగాణ రక్షణ సేన ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వేణుగోపాల్ యాదవ్, పార్లమెంట్ ఇన్‌చార్జి మడావి బాపూరావు, యూత్ ప్రెసిడెంట్ ప్రమోద్, మైనార్టీ నాయకుడు జావిద్, నాయకులు కార్తీక్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

6న సబ్ జూనియర్ కబడ్డీ బాలుర ఎంపికలు

నారాయణపేట, నవంబర్4 (విజన్ ఆంధ్ర) తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ కబడ్డీ బాలుర టోర్నీలో పాల్గొనే జిల్లా జట్టును ఈ నెల 6న మినీ స్టేడియం నారాయణపేటలో ఎంపిక చేస్తామని కబడ్డీసంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోటూరు నాగేశ్వర్‌రెడ్డి చెన్నారం వెంకటప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన క్రీడాకారులు 60 కిలోల లోపు బరువు కలిగి ఉండి డిసెంబర్13. తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్ కార్డు పదవ తరగతి మెమో వెంట తీసుకొని రావాలని కోరారు.రాష్ట్రస్థాయి టోర్నమెంట్ ఈనెల 12.నుండి 14. వరకు వికారాబాద్ జిల్లా ఎన్నపల్లిలో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హత కలిగిన క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హనుమంతుని గడ్డ హనుమాన్ దేవాలయాన్ని దేవాదాయ శాఖలో విలీనం చేయాలి

బీజేపీ పట్టణ ఇంచార్జ్ ఎల్డి మల్లయ్య గౌడ్ డిమాండ్



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 4 (విజన్ ఆంధ్ర):మహబూబాబాద్: మహబూబాబాద్ పట్టణంలోని 28వ వార్డులో గల అతి పురాతనమైన హనుమంతుని గడ్డ హనుమాన్ దేవాలయాన్ని తక్షణమే దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకొని, ప్రభుత్వ పర్యవేక్షణలో నిర్వహించాలని బీజేపీ పట్టణ ఇంచార్జ్ ఎల్డి మల్లయ్య గౌడ్ డిమాండ్ చేశారుబుధవారం 28వ వార్డు ఇంచార్జ్ చుక్కల నరేష్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు హనుమంతుని గడ్డ హనుమాన్ దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎల్డి మల్లయ్య గౌడ్ మాట్లాడుతూ, సుమారు 200 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ పురాతన దేవాలయానికి మంగళవారం, శనివారం వందల సంఖ్యలో భక్తులు దర్శనానికి వస్తుంటారని తెలిపారు.దేవాలయానికి కోట్లాది రూపాయల విలువైన మాన్యం భూములు ఉన్నాయని, వాటి ద్వారా వచ్చే ఆదాయం ఆలయ అభివృద్ధికి వినియోగించాల్సి ఉన్నప్పటికీ, కొంతమంది ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో దేవాలయం ఉండటం వల్ల ఆలయానికి సంబంధించిన నిధులు పక్కదారి పడుతున్నాయని ఆయన ఆరోపించారు.భక్తులు సమర్పించే కానుకలతోనే ఆలయంలో నిత్యం ధూపదీప నైవేద్యాలు నిర్వహిస్తున్నారని, ఇంతటి పురాతనమైన దేవాలయం అభివృద్ధికి నోచుకోకపోవడం బాధాకరమన్నారు. దేవాలయానికి సంబంధించిన మాన్యం భూములు, ఆదాయ వనరులపై సమగ్ర విచారణ జరిపి, ఆలయ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.దేవాలయాన్ని ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో నుంచి తక్షణమే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని దేవాదాయ శాఖలో విలీనం చేయాలని, ఆలయ ఆస్తులను పరిరక్షించి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు ముల్లంగి ప్రతాపరెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు పెద్దబోయిన రవి యాదవ్ దగ్గుల సురేష్, దీపక్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

జనజాతి గౌరవ దివస్ నాల్గవ రోజు వేడుకల్లో భాగంగా దండారి గుస్సాడి

ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల బాలురులో జనజాతి గౌరవ దివస్ వేడుకల్లో భాగంగా నాల్గవ రోజు దండారి గుస్సాడి సాంస్కృతిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గిరిజనుల ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు, కళారూపాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించి గిరిజన సంప్రదాయాలకు అనుగుణంగా వేడుకలను ప్రారంభించారు. అనంతరం కళాకారులు ప్రదర్శించిన దండారి గుస్సాడి నృత్యాలను ఆసక్తిగా తిలకించారు. గుస్సాడి కళాకారుల సంప్రదాయ వేషధారణలు, నృత్యరీతులు, వాయిద్యాల నడుమ సాగిన ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ మాట్లాడుతూ.. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో ప్రాచీనమైనవని, విశిష్టమైనవని పేర్కొన్నారు. గిరిజన సమాజానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చే దండారి, గుస్సాడి వంటి కళారూపాలను భవిష్యత్ తరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు భగవాన్ బిర్సా ముండా, కొమురం భీమ్, కుమారం సూరు వంటి మహనీయ గిరిజన పోరాట యోధుల చరిత్రను తెలుసుకోవాలని, వారు చూపిన ధైర్యసాహసాలు, త్యాగాలు, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.విద్యార్థులు చదువుతో పాటు తమ మూలాలను మరచిపోకుండా గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను గౌరవించాలని, వాటి పరిరక్షణలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు తమ వారసత్వ సంపదపై అవగాహన పెరగడంతో పాటు మన సంస్కృతిపై గౌరవం, అభిమానం ఏర్పడతాయని తెలిపారు.జనజాతి గౌరవ దివస్ వేడుకల ద్వారా గిరిజన మహనీయుల చరిత్రను, వారి పోరాటాలను, ఆదివాసీ కళలు మరియు సంప్రదాయాల గొప్పతనాన్ని విద్యార్థులకు పరిచయం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి మడావి శేఖు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, వార్డెన్ మధుకర్, ఆశ్రమ పాఠశాల బాలికల ప్రధానోపాధ్యాయులు లింబారావు, ఎస్సీఆర్పీ రాథోడ్ రవీందర్, పాఠశాల సిబ్బంది, రాజ్ గోండ్ సేవా సమితి నాయకులు నానేష్, సిడాం కైలాష్, మనీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.గిరిజన సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పిన దండారి గుస్సాడి నృత్య ప్రదర్శనతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

చొప్పదండి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు దాన్యం అమ్మి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం హిమ్మత్ నగర్, కురిక్యాల,గంగాధర, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. రైతులు ఇబ్బంది పడకుండా కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. గన్ని సంచులు, పరదాలు, తూకం యంత్రాలను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతుల వివరాలను నమోదు చేసుకొని, తేమ శాతం వచ్చిన వెంటనే వడ్లు కొనుగోలు చేయాలని, రైతు వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి రైతుల ఖాతాలో ధాన్యం డబ్బులు జమ అయ్యేలా చూడాలని సూచించారు. కేంద్రాల్లో ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాసరెడ్డి, జిల్లా సహకార అధికారి రామాంజనేయ చార్య, సింగిల్ విండో చైర్మన్లు వెలిచాల తిర్మల్ రావు, దూలం బాల గౌడ్, తాసిల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో రామ్, ఏపిఎం కుమారస్వామి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి మహేందర్,మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిరుత మంగ,మాజీ జెడ్పిటిసి సత్తు కనకయ్య,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పురుమల్ల మనోహర్, సర్పంచ్ ల ఫోరమ్ మండల అధ్యక్షుడు ముద్దం నగేష్,సర్పంచ్ లు పడాల భాగ్యలక్ష్మి రాజన్న,రామిడి రాజిరెడ్డి,బాసవేని శ్రీనివాస్,రేండ్ల శ్రీనివాస్,బీర్ల ఆనంద్,ఆరె తేజశ్రీ – రాజశేఖర్,మల్కాపురం రాజేశ్వరి రాజేశం,కడారి రేణుక కనకయ్య,చిందం ఆంజనేయులు,కోలేపాక కవిత మల్లేశం,ధీకొండ బాబలక్ష్మి మధు,గుండవేని లావణ్య తిరుపతి,గుడి రజని ప్రవీణ్ రెడ్డి,రాచమల్ల రవి,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై యువతకు అవగాహన కల్పించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 4 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలోఎన్ ఎస్ ఎస్, ఎన్ సి సి ఆధ్వర్యంలో నిర్వహించిన యువత నాయకత్వ అవగాహన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పౌరుడు తన ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని అన్నారు. ముఖ్యంగా యువత ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, సమాజంలో చైతన్యం తీసుకువచ్చేలా ముందుండాలని సూచించారు. యువత కేవలం విద్యకే పరిమితం కాకుండా నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, సామాజిక బాధ్యతతో సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఓటు హక్కు, ప్రజాస్వామ్య వ్యవస్థ, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ తెలిపారు.

ఆర్టీసీలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.లక్ష మోసం

ఉద్యోగం పేరుతో నమ్మించి డబ్బులు తీసుకొని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

మావల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు, గవడే గజానన్ అరెస్టు, రిమాండ్....మావల ఎస్.హెచ్.ఓ బి.డి. ప్రేమ్ కుమార్



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 4 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ పట్టణంలోని కైలాష్ నగర్‌కు చెందిన కె. పవన్ కళ్యాణ్ (28)కు నిందితుడు గవాండే గజానంద్ గతంలో అద్దెకు పక్కింట్లో ఉండటం ద్వారా పరిచయం ఏర్పడింది. 2021 నుండి 2024 మధ్య ఆర్టీసీ కార్గోలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, విడతలవారీగా ఫోన్ పే ద్వారా రూ. 60,000/- మరియు నగదు రూపంలో రూ. 40,000/- కలిపి మొత్తం రూ. 1,00,000/- తీసుకున్నాడు. డబ్బులు తీసుకున్న అనంతరం ఉద్యోగం ఇప్పించకుండా, తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకుండా బాధితుడిని మోసం చేశాడు. డబ్బులు తిరిగి ఇవ్వాలని పలుమార్లు కోరినప్పటికీ రేపు, ఎల్లుండి అంటూ కాలయాపన చేశాడు. డబ్బులు అడిగేందుకు ఇంద్రవెల్లిలోని నిందితుడి ఇంటికి వెళ్లిన బాధితుడిని నిందితుడు మరియు అతని భార్య బెదిరించడంతో బాధితుడు భయపడి వెనుదిరిగాడు. చివరకు బాధితుడి ఫిర్యాదు మేరకు మావల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితని అరెస్టు చేసే రిమాండ్ కు తరలించడం జరిగింది అని తెలిపారు.ప్రజలకు సూచన:ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వ్యక్తులను నమ్మి ముందస్తుగా డబ్బులు చెల్లించవద్దు. ఉద్యోగ నియామకాలు అధికారిక ప్రక్రియ ద్వారా మాత్రమే జరుగుతాయని గుర్తించాలి. ఎవరైనా ఉద్యోగం పేరుతో డబ్బులు తీసుకొని మోసం చేస్తే వెంటనే పోలీసులను ఆశ్రయించాలి.

సైబర్ నేరాలపై అప్రమత్తతే అసలైన రక్షణ

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే పోస్టర్లను విడుదల చేసిన జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు



గద్వాల నవంబర్ 4 (విజన్ ఆంధ్ర బ్యూరో)సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాల రూపాలు కూడా మారు తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తమ వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని సురక్షితంగా ఉంచుకోవాల ని జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివా సరావు, ఐపీఎస్ గారు సూచించారు.జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం సైబర్ నేరాల నివారణలో భాగంగా ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహిస్తున్న సైబర్ జాగ్రత్త దివాస్ కార్యక్రమంలో భాగంగా బుదవారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే పోస్టర్లను జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ కె. శంకర్ తో కలిసి విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, ఆన్‌లైన్ షాపింగ్, యూపీఐ, నెట్ బ్యాంకింగ్ వంటి సేవలను వినియోగించే సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా సైబర్ నేరగాళ్లకు అవకాశం కల్పిస్తుందని తెలిపారు. తెలియని లింకులు, ఆకర్షణీయమైన ఆఫర్లు, నకిలీ వెబ్‌సైట్లు, ఫేక్ యాప్‌లు, వెూసపూరిత కాల్స్ ద్వారా ప్రజలను వెూసం చేస్తున్నారని హెచ్చరించారు.వినికిడి, చూపు, స్పర్శ, వానన, అభిరుచి వంటి పంచేంద్రియాల సమాచారాన్ని అనవసర యాప్‌లు లేదా వెబ్‌సైట్లకు ఇవ్వకూడదు. తెలియని వ్యక్తులతో వీడియో కాల్స్, ఆన్‌లైన్ చాటింగ్‌లో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దు. అనుమానాస్పద లింకులు, ఫేక్ మెసేజ్‌లు, తెలియని యాప్‌లను ఓపెన్ చేయకూడదు. తెలియని వ్యక్తులు పంపిన లింకుల ద్వారా యాప్‌లు డౌన్‌లోడ్ చేయవద్దు. సైబర్ నేరగాళ్లు అడిగినప్పటికీ ఓటిపి,పిన్ , పాస్‌వర్డ్ వంటి వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దు. పబ్లిక్ వై ఫై, అనుమానాస్పద నెట్‌వర్క్‌లలో బ్యాంకింగ్ లేదా ఇతర ఆర్థిక లావాదేవీలు చేయవద్దు. మొబైల్ ఫోన్, యాప్‌లు, సోషల్ మీడియా ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లు ఏర్పాటు చేసుకోవాలి. అవసరం లేని యాప్‌లకు కెమెరా, మైక్రోఫోన్, కాంటాక్ట్స్ వంటి అనుమతులు ఇవ్వకూడదు. భారీ డిస్కౌంట్లు, తక్కువ ధరల పేరుతో వచ్చే సందేశాలను నమ్మి మోసపోవద్దని పోలీసులు సూచించారు. నకిలీ వెబ్‌సైట్ల ద్వారా ప్రజలను మోసం చేసే అవకాశం ఉన్నందున, వెబ్‌సైట్ యొక్క సరైన అడ్రస్‌ను పరిశీలించిన తర్వాతే కొనుగోళ్లు చేయాలని తెలిపారు. తెలియని లింకులపై క్లిక్ చేయకుండా, వీలైనంత వరకు నమ్మకమైన వెబ్‌సైట్లు, అధికారిక యాప్‌ల ద్వారా మాత్రమే షాపింగ్ చేయాలని సూచించారు. డిజిటల్ చెల్లింపుల్లో అప్రమత్తత అవసరం ఎవరైనా ఫోన్ చేసి బ్యాంకు అధికారి, యూపీఐ ప్రతినిధి లేదా ఇతర సంస్థల ప్రతినిధినని చెప్పినా వెంటనే నమ్మవద్దని తెలిపారు. ఎస్ఎంఎస్, ఇమెయిల్ లేదా సోషల్ మీడియా ద్వారా వచ్చిన అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకూడదని సూచించారు. యుపిఐ ద్వారా డబ్బు పొందడానికి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాల్సిన అవసరం లేదని, డబ్బు పంపే సమయంలో మాత్రమే జాగ్రత్తగా వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఫోన్ కాల్‌లో ఎవరైనా బ్యాంకు వివరాలు, ఓటిపి,పిన్ లేదా పాస్‌వర్డ్ అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పకూడదని హెచ్చరించారు. సైబర్ నేరాల బారిన పడిన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు నమోదు చేయవచ్చని జిల్లా పోలీసులు తెలిపారు. ప్రజల భద్రతే లక్ష్యంగా, సైబర్ నేరాలపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ జిల్లా పోలీసులు ముందుకు సాగుతున్నారని ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

సోమిని ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్సీ దండే విఠల్ విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్సీ



బెజ్జూర్ .నవంబర్ 4 (విజన్ ఆంధ్ర): కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలంలోని సోమిని గ్రామ ఆశ్రమ పాఠశాలను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, భోజన సదుపాయాలు, తాగునీరు, వసతి గృహ సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలని, పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని కోరారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఏపెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు పంద్రం బిక్షమయ్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం ఆగదు



నారాయణపేట నవంబర్ 4 (విజన్ ఆంధ్ర) జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 23వ రోజుకు చేరుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఈ ఆందోళనలో భాగంగా నారాయణపేట జిల్లా కేంద్రంలో కూడా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు దీక్షా శిబిరాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేస్తున్నారు. ఎన్‌హెచ్‌ఎం యూనియన్ గౌరవ అధ్యక్షుడు భిక్షపతి, అధ్యక్షుడు ప్రసాద్ లు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఆరోగ్య శాఖలో కీలక సేవలు అందిస్తున్నప్పటికీ తమ ఉద్యోగాలకు భద్రత లేకపోవడం, చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహించాల్సి వస్తుందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమైనదని, అలాంటి తమ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలనారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి తమకు న్యాయం చేయాలన్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఐక్యంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం యూనియన్ కోశాధికారి రాఘవేందర్‌తో పాటు సభ్యులు నరసింహారావు సగరి, మోనేష్ చారి, తిరుపతి, శ్రీలత, అర్చన, ఐశ్వర్య, విరోజా, అనురాధ, నందిని, వినోద్, సోహెల్ మునీర్, మంజూర్, జారుద్దీన్, ఆశా బి, రామేశ్వరి, నాగజ్యోతి, సుమిత్ర, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ జిల్లాలో అంతర్రాష్ట్ర చైన్ స్నాచింగ్ ముఠా గుట్టురట్టు

పది తులాల బంగారు ఆభరణాలు, కారు, ఆటో, సెల్ ఫోన్లు స్వాధీనం

ముగ్గురు మహిళలు సహా 8 మంది నిందితుల అరెస్ట్

తెలంగాణ, మహారాష్ట్ర, చత్తీస్‌గడ్, కర్ణాటక రాష్ట్రాలలో దొంగతనాలు

వృద్ధ మహిళలు, ఒంటరి మహిళలే టార్గెట్

ఆదిలాబాద్, నిర్మల్ పట్టణాల్లో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన ముఠాలి

శ్రీరామ నవమి వేడుకల్లోనూ పట్టణంలో మహిళల మెడలోని బంగారు గొలుసుల చోరీ

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 4 (విజన్ ఆంధ్ర)వృద్ధ మహిళలు ఒంటరి మహిళలను టార్గెట్గా చేసుకొని పలు రాష్ట్రాలలో మరియు ఆదిలాబాద్ జిల్లాలో మహిళల మెడలోని బంగారు గొలుసులను చాకచక్యంగా దొంగిలిస్తూ ప్రజలను మోసగిస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను ఆదిలాబాద్ జిల్లా పోలీసులు పట్టుకున్నారు. ఈ ముఠాలో ముగ్గురు మహిళలు, ఐదుగురు పురుషులు కలిపి మొత్తం 8 మంది నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి దొంగతనాలకు ఉపయోగించిన కారు, ఆటో, బంగారు ఆభరణాలు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ బుధవారం ఏర్పాటుచేసిన పత్రిక సమావేశంలో వివరాలను వెల్లడించారు.

వివరాలలోమహారాష్ట్రలోని వార్ధా ప్రాంతానికి చెందిన నిందితులు ఒక ముఠాగా ఏర్పడి మహారాష్ట్రతో పాటు తెలంగాణ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. నిందితులు కారు, ఆటోలో ప్రయాణిస్తూ పట్టణాలకు చేరుకొని, ఒంటరిగా వెళ్తున్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకునేవారు. ఆటోలో మహిళలను ఎక్కించుకొని, మాటలతో నమ్మించి, వక్కనే కూర్చున్న మహిళా నిందితురాలు వాంతులు చేసుకుంటున్నట్లు నటిస్తూ బాధితురాలి దృష్టిని మళ్లించేది. అదే సమయంలో మరో మహిళ బాధితురాలి మెడలోని బంగారు గొలుసును నోటితో కొరికి తెంపి దొంగిలించేది. అనంతరం బాధితురాలిని దింపేసి అక్కడి నుంచి పరారయ్యేవారు. మహిళలు నకిలీ నంబర్ తో ఉన్న ఆటోలో దొంగతనం చేసి కొద్ది దూరం ప్రయాణించి, కారులో బదిలీ అయి కారులో ఉన్న మగవారితో ఆటోను తోలుతూ వీరు పాల్పడుతున్న మోసం విధానం.

దొంగిలించిన బంగారు ఆభరణాలను కరిగించి ముక్కలుగా చేసి, అవసరమైనప్పుడు కొద్దికొద్దిగా విక్రయిస్తూ వచ్చిన డబ్బులతో జల్సాలకు పాల్పడేవారు.వారం రోజుల క్రితం ఆదిలాబాద్ పట్టణంలో ఒక మహిళను ఆటోలో ఎక్కించుకొని ఆమె మెడలోని బంగారు గొలుసును దొంగిలించి పరారయ్యారు. 2025 శ్రీరామ నవమి సందర్భంగా ఆదిలాబాద్‌లో జరిగిన వేడుకల్లో భోజనాల సమయంలో మహిళల మెడలోని బంగారు గొలుసులను దొంగిలించారు. అదేవిధంగా జాతీయ రహదారి పక్కన ఉన్న రామాలయంలో భోజనాలు జరుగుతున్న సమయంలో కూడా మహిళల మెడలోని బంగారు గొలుసులను దొంగిలించారు.31 అక్టోబర్ న నిర్మల్ పట్టణంలో ఇద్దరు మహిళల మెడలోని బంగారు గొలుసులను దొంగిలించి, వాటిని ముఠాలోని ఇద్దరు సభ్యులకు భద్రపరచడానికి ఇచ్చారు. మరిన్ని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడేందుకు ఆదిలాబాద్‌కు వస్తున్న సమయంలో పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించిన నిందితులను పోలీసులు పట్టుకొని విచారించగా, పై నేరాలకు పాల్పడినట్లు వెల్లడించారు.

నిందితులపై ఆదిలాబాద్ నిర్మల్ జిల్లాలలో ఆరు కేసులు నమోదైనట్లు అదేవిధంగా, మహారాష్ట్ర చత్తీస్‌గడ్ కర్ణాటక రాష్ట్రాలలో పలు నేరాలలో పాల్పడినట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు.

నిందితుల వివరాలు:1. విశాల్ సావంత్ పాత్రే (44), వార్ధా, మహారాష్ట్ర.
2. అల్లా రహీమ్ (22), వార్ధా, మహారాష్ట్ర.
3. సంజయ్ ఏ ఎల్.బి. సయ్యద్ (38), వార్ధా, మహారాష్ట్ర.
4. లొండే విశ్వదీప్ (40), వార్ధా, మహారాష్ట్ర.
5. షైక్ ఫెరోజ్ (45), వార్ధా, మహారాష్ట్ర.
6. రంజిత పాత్రే (46), వార్ధా, మహారాష్ట్ర.
7. లక్ష్మీ అజిత్ బోకర్ (30), వార్ధా, మహారాష్ట్ర.
8. నాడే నిషా (25), వార్ధా, మహారాష్ట్ర.

లిస్వాధీనం చేసుకున్న వస్తువులు:లి
లి(పది తులాల బంగారం స్వాధీనం.)లి
1. ఒక బంగారు గొలుసు ▪ 20 గ్రాములు.
2. రెండు బంగారు ముక్కలు ▪ ఒక్కొక్కటి సుమారు 10 గ్రాములు.
3. రెండు చిన్న బంగారు ముక్కలు ▪ 7 గ్రాములు, 3 గ్రాములు.
4. నిర్మల్‌లో దొంగిలించిన రెండు బంగారు గొలుసులు ▪ 25.900 గ్రాములు, 26.500 గ్రాములు.
5. దొంగతనాలకు ఉపయోగించిన ఒక డస్టన్ కారు
6. ఒక బజాజ్ ఆటో ▪
7. ఆటోలో అదనంగా ఉంచిన మరో నంబర్ ప్లేట్
8. ఐదు సెల్ ఫోన్లు.

మహిళల భద్రతకు భంగం కలిగించే చైన్ స్నాచింగ్‌లపై పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలను గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.

ఒంటరి మహిళలు ఉచితంగా లిఫ్ట్ ఇస్తామంటూ ఆటోలో ఎక్కించుకునే ప్రయత్నం చేసిన వారి పట్ల అప్రమత్తతో వ్యవహరించాలని అలాంటి వారిని నమ్మవద్దని సూచించారు, ప్రజల భద్రతకు, నేరాల నియంత్రణకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోంది. కేసు చేతనలో కృషి చేసిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డులను ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై ఎన్ నాగనాథ్, సిబ్బంది రమేష్, రుక్మారెడ్డి, హనుమంతు,నరేష్, జోగేంద్ర సింగ్, అఖిల్, సైబర్ క్రైమ్ ఆర్ఎస్ఐ గోపికృష్ణ, సైబర్ క్రైమ్ సిబ్బంది త్రిశూల్, అన్వేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోస్గిలో సైన్స్ మ్యూజియాన్ని ప్రారంభానికి సిద్ధం చేయాలి

-రెండు రోజుల్లో అన్ని పనులు పూర్తి చేయాలి
-జిల్లా కలెక్టర్ ప్రియాంక.

నారాయణపేట ప్రతినిధి, నవంబర్ 4 (విజన్ ఆంధ్ర) నారాయణ పేట జిల్లాలోని కోస్గి పట్టణంలో రూ. 5 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సర్ సీ.వీ. రామన్ సైన్స్ మ్యూజియాన్ని అన్ని హంగులతో త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోస్గి పట్టణంలోని సర్ సీ.వీ. రామన్ సైన్స్ మ్యూజియాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మ్యూజియంలో విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రంపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న వివిధ రకాల సైన్స్ పరికరాలను, వాటి అమరిక పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.మ్యూజియంలో సైన్స్ పరికరాల ఏర్పాటు, ఇతర మిగిలిన పనులన్నింటినీ మరో రెండు రోజుల్లో పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు.మ్యూజియంలో ఏర్పాటు చేస్తున్న సైన్స్ పరికరాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులుకు సూచించారు. పరికరాలను ఎలాంటి రక్షణ లేకుండా బహిరంగంగా ఏర్పాటు చేయకుండా, వాటి పరిరక్షణ కోసం తగిన విధంగా చిన్న గాజు పలకలు ఏర్పాటు చేయాలని



ఆదేశించారు. విద్యార్థులు పరికరాలను సులభంగా పరిశీలించేలా, వాటికి ఎలాంటి నష్టం కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు.అదేవిధంగా ప్రతి సైన్స్ పరికరం వెనుక భాగంలో దాని పేరు, ఉపయోగం, పనితీరు, శాస్త్రీయ సూత్రాలను వివరించేలా పెద్ద సైజు సమాచార చార్టులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. దీనివల్ల విద్యార్థులు సంబంధిత పరికరాన్ని పరిశీలిస్తూనే దాని పనితీరును చదివి అర్థం చేసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. సైన్స్ పరికరాలకు సంబంధించిన సమాచారం సరళమైన భాషలో, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఉండాలని పేర్కొన్నారు.అలాగే మ్యూజియం ఆవరణలో పరిశుభ్రతను పాటిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా గ్రీనరీని ఏర్పాటు చేయాలని, మొక్కలు నాటి పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు మ్యూజియాన్ని సందర్శించినప్పుడు ఆహ్లాదకరమైన అనుభూతి కలిగేలా పరిసరాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.మ్యూజియం ప్రారంభమైన అనంతరం పరికరాల పనితీరును విద్యార్థులకు వివరించేందుకు ప్రత్యేకంగా ఒక సైన్స్ అధికారిని నియమించాలని జిల్లా విద్యాశాఖ అధికారికి సూచించారు. మ్యూజియాన్ని సందర్శించే విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలు, పరికరాల వినియోగం, శాస్త్రీయ అంశాలపై అవగాహన కల్పించే విధంగా అవసరమైన సిబ్బంది, నిర్వహణ ఏర్పాట్లు చేయాలని తెలిపారు.మ్యూజియంలో అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేసి, నిర్దేశించిన గడువులోగా మ్యూజియాన్ని ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, కోస్గి మున్సిపల్ చైర్మన్ నాగులపల్లి నరేందర్, ప్రజారోగ్య శాఖ ఎస్.ఈ. విజయ్ భాస్కర్, హైదరాబాద్ బిర్లా ప్లానిటోరియం డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, కోస్గి మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తహసీల్దార్ కళ్యాణి, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల ఏఈలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ఆరోగ్య కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలి

పిఎచ్సీ.ల సూపర్వైజర్ సిబ్బందితో సమీక్ష సమావేశం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సంధ్యా కిరణ్మయి



గద్వాల నవంబర్ 4 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లాలో అమలవుతున్న అన్ని ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని సమీక్షించేందుకు అన్ని పిఎచ్సీ. ల సూపర్వైజర్ సిబ్బందితో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సంధ్య కిరణ్ మై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూప్రతి ఆరోగ్య కార్యక్రమానికి సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలు, పారామీటర్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశిత గడువులోగ శతశాతం లక్ష్యాలను సాధించాలని సిబ్బందిని ఆదేశించారు.క్షేత్రస్థాయిలో ఆరోగ్య కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందేల బాధ్యతాయుతంగ విధులు నిర్వహించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండ, ప్రతి కార్యక్రమంలో ఆశించిన పురోగతి సాధించాలని, లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం లేద అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్. ప్రసూన రాణి, డా. జి. రాజు, డిపిఎచ్ఎన్ఓ– వరలక్ష్మి, ఇన్‌చార్జి మీడియా అధికారి హీర్య నాయక్, ఎస్ఓ– తిరుమల్ రెడ్డి,పిఎచ్ఎన్ – తిరుమల రాణి,డిపిసి – వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 4 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ పట్టణంలోని మైనార్టీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తున్న మెహందీ డిజైన్, మగ్గం వర్క్ మరియు టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదిలాబాద్ మైనార్టీస్ కామన్ సర్వీస్ సెంటర్‌లో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, మహిళలు కేవలం ఇంటి బాధ్యతలకే పరిమితం కాకుండా, తమలోని నైపుణ్యాలను వెలికితీసి ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ శిక్షణ అవకాశాలను మైనార్టీ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెహందీ డిజైనింగ్, మగ్గం వర్క్, టైలరింగ్ వంటి కోర్సుల్లో నైపుణ్యం సంపాదించడం ద్వారా మహిళలు స్వయంగా ఉపాధి పొందడమే కాకుండా, భవిష్యత్తులో చిన్నచిన్న వ్యాపారాలు ప్రారంభించి ఇతరులకు కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని తెలిపారు. శిక్షణను ప్రతి ఒక్కరూ శ్రద్ధగా నేర్చుకొని, నేర్చుకున్న విద్యను తమ జీవితంలో ఉపయోగించుకోవాలని కోరారు. మహిళల అభ్యున్నతి, సాధికారత మరియు స్వయం ఉపాధికి తెలంగాణ ప్రభుత్వం మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా ఇలాంటి ఉచిత శిక్షణ కార్యక్రమాలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి షేక్ కలీం అహ్మద్, తదితరులు పాల్గొన్నారు

రైతులకు మెసేజ్‌లు వచ్చాయి.. డబ్బులు ఎవరి ఖాతాల్లోకి వెళ్లాయి?

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కప్పర ప్రసాద్ రావు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి నవంబర్ 4 (విజన్ ఆంధ్ర)తెలంగాణలోరైతులకు పెట్టుబడి సాయం అందిందని సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు వస్తున్నప్పటికీ, రైతుల బ్యాంకు ఖాతాల్లో మాత్రం డబ్బులు జమ కాలేదా? అసలు రైతులకు అందాల్సిన నిధులు ఎక్కడికి వెళ్లాయి? ఎవరి ఖాతాల్లో జమ అయ్యాయి? అంటూ కప్పర ప్రసాద్ రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. రైతులకు పెట్టుబడి సాయం అందినట్లు సందేశాలు పంపితే సరిపోదని, వాస్తవంగా రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యిందా లేదా అన్నది ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు అందాల్సిన ఆర్థిక సాయం విషయంలో గందరగోళం నెలకొంటే ప్రభుత్వం బాధ్యత వహించి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రైతులకు వచ్చిన సందేశాలకు, వారి బ్యాంకు ఖాతాల్లో కనిపిస్తున్న నగదుకు మధ్య ఉన్న వ్యత్యాసంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. రైతులకు అందాల్సిన ప్రతి రూపాయి నేరుగా వారి ఖాతాల్లో జమ అయ్యేలా



చూడాలని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం స్పందించి రైతుల సందేహాలను నివృత్తి చేస్తుందా? పెట్టుబడి సాయం పంపిణీపై పూర్తి వివరాలు వెల్లడిస్తుందా? అనేది వేచి చూడాలి.

ఏపి.లో ఎంపీటీసీ,జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని నాలుగు మండలాల పరిధిలోని మద్యం దుకాణాలు మూసివేయాలి

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



అలంపూర్ నవంబర్ 4 (విజన్ ఆంధ్ర బ్యూరో)ఆంధ్రప్రదేశ్‌లో రెండో విడత ఎంపీటీసీ,జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించి జోగులాంబ గద్వాల జిల్లాలోని 19 గ్రామాల్లో మద్యం దుకాణాలు,2బి బార్లు,కల్లు దుకాణాలు మూసివేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు.తెలంగాణ ఎక్సైజ్ చట్టం 1968లోని సెక్షన్ 20(1) ప్రకారం ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. నవంబర్ 3వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి నవంబర్ 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం విక్రయాలు పూర్తిగా నిలిపివేయాలని స్పష్టం చేశారు.అయిజ మండలంలోని వులికల్, వెనిసోంపురం, రాజాపురం,కేశవరం, కుతకనూరు గ్రామాలకు,అలంపూర్ మండలంలోని జిల్లెలపాడు, సుల్తాన్‌పురం, రాయలంపాడు, సింగవరం,కాశీపురం గ్రామాలకు వర్తిస్తాయని తెలిపారు. అదేవిధంగా ఉండవెల్లి మండలంలోని బస్వాపురం, పుల్లూరు, కల్గొట్ల, మెన్నిపాడు గ్రామాలు,రాజోలి మండలంలోని తుమ్మిళ్ల,ధన్వాడ,రాజోలి,పెద్దధన్వాడ, చిన్నధన్వాడ గ్రామాల పరిధిలో కూడా ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయని పేర్కొన్నారు.సంబంధిత గ్రామాల్లోని మద్యం దుకాణాలు,బార్లు,కల్లు దుకాణాల నిర్వాహకులు నిర్దేశిత సమయంలో తప్పనిసరిగా మూసివేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు,వ్యాపారులు జిల్లా యంత్రాంగం జారీ చేసిన ఉత్తర్వులకు సహకరించాలని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ఎల్‌నినో పరిస్థితుల్లో ఆయిల్ పామ్ సాగు రైతులకు లాభదాయకమైన ప్రత్యామ్నాయం

పంట జిల్లా ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ శాఖ అధికారి జ్యోతి



కామారెడ్డి బ్యూరో నవంబర్ 4(విజన్ఆంధ్ర)కామారెడ్డి జిల్లా అంబర్‌పేట్ గ్రామానికి చెందిన రైతు శ్రీ ప్రవీణ్ రావు గారి ఆయిల్ పామ్ తోటను సందర్శించి, ఆయిల్ పామ్ సాగు విధానం, పంట దిగుబడి, ఆదాయం మరియు ప్రభుత్వ రాయితీలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా రైతు ప్రవీణ్ రావు మాట్లాడుతూ, తాను గత నాలుగు సంవత్సరాలుగా ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తున్నానని, ప్రస్తుతం పంట దిగుబడి ప్రారంభమైందని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 10 సార్లు గెలల కోత (కట్టింగ్) చేపట్టి, సుమారు 10 టన్నుల ఆయిల్ పామ్ గెలలను దిగుబడిగా పొందినట్లు వెల్లడించారు. దీని ద్వారా ఇప్పటివరకు సుమారు రూ. 2,50,000 ఆదాయం లభించిందని, తక్కువ సమయంలోనే మంచి ఆదాయం రావడంతో తాను ఎంతో సంతోషంగా ఉన్నానని తెలిపారు. ఆయిల్ పామ్ పంట దీర్ఘకాలికంగా రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందించే పంట అని తన అనుభవాన్ని ఇతర రైతులతో పంచుకున్నారు.ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులు, ఎల్‌నినో ప్రభావం మరియు నీటి లభ్యతలో ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల మార్పిడిపై దృష్టి సారించాలని, ఆయిల్ పామ్ సాగును ఒక ప్రత్యామ్నాయ వాణిజ్య పంటగా పరిశీలించాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుకు ఉద్యాన శాఖ ద్వారా డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను కూడా ప్రభుత్వ రాయితీపై అందించడం జరుగుతుందని, కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆయిల్ పామ్ సాగు చేపట్టేందుకు ముందుకు రావాలని రైతు ప్రవీణ్ రావు సూచించారు.ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ శాఖ అధికారి శ్రీమతి జ్యోతి మాట్లాడుతూ, ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు పలు రకాల రాయితీలు మరియు ప్రోత్సాహకాలను అందిస్తోందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ఒక ఎకరానికి సంవత్సరానికి రూ. 4,200 చొప్పున నిర్వహణ ఖర్చుల నిమిత్తం రాయితీ అందించడం జరుగుతుందని వివరించారు. అదేవిధంగా డ్రిప్ ఇరిగేషన్ పరికరాలపై కూడా అర్హత మేరకు రాయితీ కల్పించడం జరుగుతుందని తెలిపారు.ఆయిల్ పామ్ పంట ఒకసారి నాటిన తరువాత దీర్ఘకాలం పాటు దిగుబడిని అందించే పంట అని, రైతులకు నిరంతర ఆదాయ అవకాశాలను కల్పిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ వాణిజ్య పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు చేయదలచిన రైతులు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి సాగు విధానం, మొక్కల లభ్యత, రాయితీలు మరియు ఇతర ప్రభుత్వ ప్రోత్సాహకాలపై పూర్తి వివరాలు తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ శాఖ అధికారి శ్రీమతి జ్యోతి, కామారెడ్డి ఉద్యాన అధికారి సుమన్, ఉద్యాన విస్తరణ అధికారి బాపురెడ్డి, హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ మేనేజర్ చంద్రబాబు, సీనియర్ మేనేజర్ శ్రీనివాస్, ఆయిల్ పామ్ సిబ్బంది హిమకుమార్, అరుణ్, శివ, సత్యనారాయణ, కిరణ్, అంబర్‌పేట్ గ్రామ సర్పంచ్, అంబర్‌పేట్ మరియు దోమకొండ ఎఇఒలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గోపాల్ రావుపేటలో డయాబెటిక్ క్యాంపు

రామడుగు రామడుగు మండలం గోపాలరావుపేట లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 6:30గంటలకు గోపాల్ రావుపేటలోని మార్కెట్ రోడ్ లో డయాబేటిక్ క్యాంపు నిర్వహించారు. 99మందికి పరీక్షలు చేయగా 30 మందికి డయాబెటిక్ ఉన్నట్లు నిర్ధారించారు.వారిని డాక్టర్ వద్దకు పంపించారు.మరియు (బిపి)వరీక్షలు చేశారు.అనంతరం డయబేటిక్ అవగాహన కొరకు కరపత్రములు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా లయన్ ఇనుగుర్తి రమేష్ చేపూరి లక్ష్మయ్య హాజరైనారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రెటరీ పాకాల మోహన్ కోశాధికారి మూల అనంతరెడ్డి మైక్రో కేబినెట్ మెంబర్స్ కర్ర శ్యాం సుందర్ రెడ్డి రాంపల్లి శ్రీనివాస్ వైస్ ప్రెసిడెంట్ కర్ర రాజిరెడ్డి డైరెక్టర్స్ ముదుగంటి సత్యనారాయణరెడ్డి ముదుగంటి రాజిరెడ్డి కటుకూరి మల్లేశం పబ్బతి మల్లారెడ్డి ఎడవెల్లి రాజిరెడ్డి సుద్దాల మల్లేశం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ – డాక్టర్ అనిమేశ్ భట్టాచార్య



నాంపల్లి, నవంబర్, 04(విజన్ ఆంధ్ర):మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ రక్షిత తాగునీరు అందించడం వల్ల రామదాస్ తండా వంటి మారుమూల తండాలలో ఫ్లోరోసిస్ సమస్య పూర్తిగా తొలగిపోవడం పట్ల జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డాక్టర్ అనీవేష్ భట్టాచార్య సంతోషం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ చాలా మంచి కార్యక్రమమని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు.బుధవారం ఆయన నాంపల్లి మండలంలోని రాందాస్ తండా గ్రామాన్ని సందర్శించి, ఇంటింటికీ తిరుగుతూ మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.ముందుగా మెగావత్ అంతిరాం ఇంటికి వెళ్లి నల్లా ద్వారా ఎన్ని రోజులకు ఒకసారి నీరు వస్తుందని ? నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటారని? అడిగి తెలుసుకున్నారు. రోజుకు రెండు సార్లు నీరు సరఫరా అవుతున్నదని, నీటిని నిల్వ చేసుకుని అవసరాలకు వినియోగించుకుంటున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు.నల్లాలకు లీకేజీలు లేకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. మిషన్ భగీరథ పథకం రాకముందు తాగునీటి కోసం ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారని? ప్రజలను అడిగి తెలునుకున్నారు. గతంలో బోరు నీటి పైనే ఆధారపడేవారమని, ఫ్లోరైడ్ నీటి కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నామని గ్రామస్థులు వివరించారు. మిషన్ భగీరథ ద్వారా రక్షిత తాగునీరు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఫ్లోరోసిస్ సమస్య తగ్గిపోయిందని గ్రామ సర్పంచ్ మేఘావత్ చిట్టి శ్రీనివాస్ ఎన్ హెచ్ ఆర్ సి స్పెషల్ మానిటర్ కు తెలిపారు.గ్రామంలో మరికొంతమంది ప్రజలతో మాట్లాడిన ఆయన, ప్రస్తుతం తాగునీటి వల్ల ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా ? అని అడిగారు. ప్రస్తుతం రెండు రోజులకు ఒకసారి నీరు వస్తుందని, అవసరమైన నీటిని ట్యాంకుల్లో నిల్వ చేసుకుని వినియోగించుకుంటున్నామని గ్రామస్థులు తెలిపారు.గ్రామంలో ఫ్లోరోసిస్ కేసులు ఏమైనా ఉన్నాయా? అని ఆశా కార్యకర్తను అడగగా, ప్రస్తుతం ఎలాంటి కేసులు లేవని తెలిపారు. గత 10 సంవత్సరాలుగా ఫ్లోరోసిస్ కేసులు నమోదు కాలేదని మండల అధికారులు వివరించారు. సాధారణంగా సీజనల్ వ్యాధులు మినహా ఇతర ఆరోగ్య సమస్యలు లేవని తెలిపారు.ప్రతి ఇంటికీ మరుగుదొడ్లు నిర్మించినట్లు గ్రామ కార్యదర్శి వివరించారు. గ్రామంలో మొత్తం 250 గృహాలు ఉన్నాయని తెలిపారు.అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో వినియోగిస్తున్న తాగునీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం ద్వారా ఫ్లోరోసిస్ వంటి సమస్యలను నివారించవచ్చని, మిషన్ భగీరథ పథకాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని ఆయన సూచించారు.మిషన్ భగీరథ ఎస్ఈ నాగేశ్వరరావు, చందూరు ఆర్డీవో శ్రీదేవి, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ లక్ష్మీనారాయణ, డిఈ అజయ్ కుమార్, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో రామకృష్ణ శర్మ, సర్పంచ్ మెగావత్ చిట్టి శ్రీనివాస్,ప్రయోగశాల ఇంచార్జ్

ఆదర్శ గ్రామంగా లింగంపల్లి కుర్దును తీర్చిదిద్దాలి

– నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

– ఉపాధి హామీ పనుల్లో ప్రజల భాగస్వామ్యం అభినందనీయం

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి బ్యూరో నవంబర్ 4(విజన్ఆంధ్ర) జిల్లాలోని గ్రామాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడంతో పాటు, నీటి సంరక్షణ చర్యలను విస్తృతంగా చేపట్టి పర్యావరణ పరిరక్షణలో ఆదర్శంగా నిలపాలన్నదే జిల్లా యంత్రాంగం లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. బుధవారం లింగంపేట మండలంలోని లింగంపల్లి కుర్దు గ్రామంలో పర్యటించి, గ్రామంలో చేపడుతున్న ప్లాస్టిక్ రహిత కార్యక్రమాలు, నీటి సంరక్షణ నిర్మాణాలు, పారిశుద్ధ్య పనులు, వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం గ్రామ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో గ్రామస్థులు, రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటికే తడకల్ గ్రామంలోని ఎంఆర్సియాల్, దోమకొండ మండలంలోని గోటిముక్కుల గ్రామాల్లో ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కార్యక్రమాలు చేపట్టామని, తాజాగా లింగంపల్లి కుర్దు గ్రామాన్ని మూడో ప్లాస్టిక్ రహిత గ్రామంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, పర్యావరణ హిత ఇటుకల తయారీ, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల మహిళల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు అభినందనీయమన్నారు.గ్రామంలో నీటి సంరక్షణ, పారిశుద్ధ్య పనుల పరిశీలనగ్రామంలో పర్యటించిన కలెక్టర్ పైకప్పులపై పడే వర్షపు నీటి సేకరణ నిర్మాణాలు, ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తతో పాటు నాలుగు రకాల చెత్తను వేర్వేరుగా సేకరించే విధానం, మురుగునీటి కాలువల వ్యవస్థ, ప్రతి ఇంటి వద్ద, సామూహికంగా నిర్మిస్తున్న ఇంకుడు గుంతలు, బోరుబావుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పెంపునకు చేపడుతున్న నిర్మాణాలను పరిశీలించారు. ప్రతి ఇంటి వద్ద నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టడం ద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేసి భూగర్భ జలాలను పెంపొందించాలని సూచించారు.వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతలు, బోరుబావుల పునరుద్ధరణ, పైకప్పులపై పడే వర్షపు నీటి సేకరణ నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. లింగంపల్లి కుర్దు గ్రామంలో 1.2 మీటర్ల పొడవు, 1.2 మీటర్ల వెడల్పు, 1.8 మీటర్ల లోతుతో నిర్మించే ఇంకుడు గుంతకు సుమారు రూ.6,500 అంచనా వ్యయం అవుతుందని వివరించారు.ఉపాధి హామీ పనుల్లో ప్రజల భాగస్వామ్యం అభినందనీయంగ్రామ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామస్థులు ఉపాధి హామీ పనుల్లో అధిక సంఖ్యలో పాల్గొనడం, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణను సమర్థవంతంగా నిర్వహించడం పట్ల అభినందనలు తెలిపారు. గ్రామాభివృద్ధికి అవసరమైన నీటి సంరక్షణ, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ పనులను ప్రజలందరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని, ప్రతి కుటుంబం ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి.ఎల్‌నినో ప్రభావంతో రాబోయే కాలంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు రాబోయే రబీ సీజన్‌లో వరి సాగుపైనే ఆధారపడకుండా జొన్న, మొక్కజొన్న, సోయాబీన్, పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని, సాగులో తగిన జాగ్రత్తలు పాటించి నష్టాలు రాకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేయాలని తెలిపారు.కూరగాయల సాగు, ఆయిల్‌పామ్ తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బిందు సేద్యం ద్వారా తక్కువ నీటితో అధిక దిగుబడులు, ఆదాయం పొందవచ్చని వివరించారు. జిల్లాలో జొన్నల సాగుకు అవసరమైన విత్తనాల పరిమితిని 8 క్వింటాళ్లకు పెంచాలని కోరుతూ ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్‌ను ఆదేశించారు.విద్యార్థుల ప్రదర్శనలను అభినందించిన కలెక్టర్ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల ఆవశ్యకతపై పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, నృత్యరూపకాలు, పాటలను కలెక్టర్ తిలకించారు. విద్యార్థులు అద్భుతంగా ప్రదర్శనలు ఇచ్చారని అభినందిస్తూ, చిన్న వయస్సు నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఇళ్లలోనూ, పరిసర ప్రాంతాల్లోనూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు.చెరువుకట్టపై మొక్కల పెంపకం, సౌర విద్యుత్‌కు చర్యలుఅనంతరం గ్రామ చెరువుకట్టను పరిశీలించి, కట్టపై మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. చెరువుకట్ట పరిసరాలను పచ్చదనంతో తీర్చిదిద్దాలని, నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతను గ్రామస్థులు తీసుకోవాలని సూచించారు. చెరువుకట్ట ఆవరణలో సౌర విద్యుత్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించి, సంబంధిత ప్రతిపాదనలు సిద్ధం చేసి సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మొక్క నాటి, సౌర విద్యుత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ప్రజల భాగస్వామ్యంతోనే ఆదర్శ గ్రామాల నిర్మాణంగ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడంలో సర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, యువత, విద్యార్థులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, తడి, పొడి చెత్తను వేరు చేయడం, నీటిని పొదుపుగా వినియోగించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, డిప్యూటీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సురేందర్, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి, సర్పంచ్ ప్రత్యూష సాయిరాం, ఉపసర్పంచ్ కుమ్మరి సంతోష్ కుమార్, తహసీల్దార్, ఎంపీడీవో ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, రైతులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చారిత్రక రాతి చిత్రాలను పరిరక్షించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి



కామారెడ్డి బ్యూరో నవంబర్ 4 (విజన్ఆంధ్ర)సందర్శకులు సులభంగా వీక్షించేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్లింగంపేట మండలం ఎల్లమ్మ తండా సమీపంలోని ఖందకాల ప్రాంతంలో ఉన్న చారిత్రక రాతి చిత్రాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా రాతిపై చిత్రించిన ప్రాచీన చిత్రాలను స్వయంగా వీక్షించి, వాటి ప్రత్యేకతలు, చారిత్రక ప్రాధాన్యతను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలోని రాతిపై వీబీ "జీ రామ్ జీ అనే అక్షరాలు రాసి ఉండటాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ ప్రాంతం ప్రధాన రహదారికి సమీపంలో ఉండటంతో పర్యాటకులు సులభంగా చేరుకుని చారిత్రక రాతి చిత్రాలను వీక్షించేందుకు అనుకూలంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, చారిత్రక వారసత్వ సంపదను భావితరాలకు అందించేలా పరిరక్షించడం మనందరి బాధ్యత అని అన్నారు. రాతి చిత్రాల చారిత్రక ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలని, సందర్శకులు సులభంగా వీక్షించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతాన్ని ఆకర్షణీయమైన చారిత్రక పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఎంపీడీఓకు సూచించారు.
ఈ పరిశీలన కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సురేందర్, మండల రెవెన్యూ అధికారి, ఎంపీడీఓ ప్రవీణ్‌తో పాటు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

1 మెగా వాట్ సోలార్ ప్లాంట్ గ్రిడ్‌కు విజయవంతంగా అనుసంధానం

–సహకార సంఘాల ద్వారా నాలుగు సోలార్ ప్లాంట్ల ఏర్పాటు

–కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి నవంబర్-04(విజన్ ఆంధ్ర)పెద్దపల్లి జిల్లాలో సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒక మెగావాట్ సామర్థ్యం గల సోలార్ ప్లాంట్‌ను విద్యుత్ గ్రిడ్‌కు విజయవంతంగా అనుసంధానం చేసినట్లు కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.రాష్ట్రంలోనే సహకార సంఘాల ఆధ్వర్యంలో నాలుగు సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన జిల్లాగా పెద్దపల్లి గుర్తింపు పొందిందని పేర్కొన్నారు.బుధవారం పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామంలోని ట్రాన్స్‌కో కార్యాలయం, విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఒక మెగావాట్ సామర్థ్యం గల సోలార్ ప్లాంట్ సింక్రనైజేషన్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,సహకార సంఘాల ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లాలో ఒక్కొక్కటి ఒక మెగావాట్ సామర్థ్యంతో మొత్తం నాలుగు సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.రాష్ట్రంలోనే సహకార సంఘాల ద్వారా నాలుగు సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన జిల్లాగా పెద్దపల్లి నిలవడం గర్వకారణమని తెలిపారు.ఈ సోలార్ ప్లాంట్ల ఏర్పాటు విజయవంతం కావడంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), సిబ్బంది చేసిన సమష్టి కృషి ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ఒక మెగావాట్ సామర్థ్యం గల సోలార్ ప్లాంట్ సింక్రనైజేషన్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని, ఇకపై ప్రతిరోజూ విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని తెలిపారు.సోలార్ ప్లాంట్లను అధికారికంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, వచ్చే వారం ప్రభుత్వ విప్ శాసనసభ్యులు సమయం తీసుకొని రాఘవాపూర్ లో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల, ట్రాన్స్‌కో ఎస్.ఈ. గంగాధర్, రెడ్ కో డి.యం.మనోహర్,టీజీఎన్‌పీడీసీఎల్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కొటాలగూడలో బీరప్ప జాతర మహోత్సవం

దేవాక్షుడు, దేవాక్షురాలు సంతానం కుమారుడు దొంతుల శివాలరాజు, కూతురు సూరమ్మ

సూరమ్మ, బ్రహ్మయ్యల తనయుడు బీరప్ప స్వామి

కొటాలగూడ గ్రామ బీరప్ప స్వామి ఆలయం కమిటీ ఆధ్వర్యంలో జాతర మహోత్సవం





వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 04 (విజన్ ఆంధ్ర) : ఆధ్యాత్మిక చింతన అలవర్చడానికి ఎప్పుడో ఒకప్పుడు దైవ స్వరూపులు భూమండలంపై అవతరిస్తారు. దేవాక్షుడు, దేవాక్షురాలకు మగ సంతానం దొంతుల శివాలరాజు మాత్రమే ఉండడంతో దిగులు చెంది మరొక సంతానం కావాలని పరమేశ్వరున్ని భక్తి ప్రపత్తులతో వేడుకుంటారు. శివుడు ప్రత్యక్షమై ఆ దంపతులకు మరొక సంతానం కలుగుతుందని వరం ఇస్తాడు. ఆ వరం కారణంగా సూరమ్మ అనే కూతురు పుడుతుంది. సూరమ్మ ను బ్రాహ్మణ యువకుడైన బ్రహ్మయ్యకు ఇచ్చి వివాహం చేశారు. కొంతకాలం అనంతరం సూరమ్మ గర్భవతి అవుతుంది. సూరమ్మ గర్భంలో ఒక శిశువు జీవం పోసుకుంది. ఆ శిశువును చంపడానికి సూరమ్మ అన్న దొంతుల శివాల రాజు పెరుగన్నంలో విషం కలిపి సూరమ్మ ఇంటికి తీసుకెళ్తాడు. పెరుగన్నంలో విషం కలిపిన విషయాన్ని గమనించకుండా సూరమ్మ తింటుంది. సూరమ్మ తిన్న పెరుగన్నాన్ని తన ఇంటిలో ఉన్న కుక్కకు వేస్తుంది. పెరుగన్నాన్ని తిన్న కుక్క చనిపోవడంతో తన గర్భంలో పెరుగుతున్న శిశువుతో పాటు తాను కూడా చనిపోతామేమోనని దిగులు చెందుతుంది. సూరమ్మ ఆ పరమేశ్వరుని భక్తి ప్రపత్తులతో నన్ను నా గర్భంలో పెరుగుతున్న శిశువును నీవే రక్షించాలని ధ్యానిస్తుంది. సూరమ్మ గర్భంలో పెరుగుతున్న శిశువు, విషము కలిపిన పెరుగన్నాన్ని తన చేతులతో అడ్డుకుంటుంది. విషము కలిపిన పెరుగన్నము సూరమ్మ గర్భంలో పెరుగుతున్న శిశువుపై ఎలాంటి ప్రభావం చూపదు. సూరమ్మ గర్భంలో శిశువుగా పెరిగిన దైవాంశ సంభూతుడు బీరప్పగా భూమండలంపై జన్మిస్తాడని మూదిరి మల్లికార్జున్ పంతులు భక్తులకు వివరించారు. బుధవారం వికారాబాద్ మండల పరిధిలోగల కొటాలగూడ గ్రామంలో బీరప్ప జాతర మహోత్సవాన్ని బీరప్ప జాతర కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. హోమ యజ్ఞం కార్యక్రమంలో ఎల్లన్నోల్ల మానస, ఎల్లన్నోల్ల మల్లేశం పుణ్య దంపతులతో పాటు మరో 20 జంటలు హోమయజ్ఞాలు చేశారు. హోమయజ్ఞాల కార్యక్రమాన్ని నాగేశం పంతులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్లన్నోళ్ళ బీరప్ప చింతబాయి వెంకటేష్, ఎల్లన్నోల రవీందర్, పలుగుట్ట శ్రీనివాస్, పులుమద్ది పరమేష్,చింతబాయి శివయ్య, పలుగుట్ట మల్లయ్య, పీరంపల్లి కృష్ణ, గట్టోపల్లి మహేందర్, నస్కుంటి యాదయ్య, మాసన్నోల్ల శ్రీశైలం, పెద్దగొల్ల శివరాములు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గట్టు ఆస్పిరేషనల్ బ్లాక్ అభివృద్ధి సూచికల్లో మెరుగైన పురోగతి సాధించాలి

కేంద్ర బృందం సభ్యుడు నోడల్ అధికారి లోకేష్



గద్వాల నవంబర్ 4 (విజన్ ఆంధ్ర బ్యూరో)గట్టు ఆస్పిరేషనల్ బ్లాక్‌లో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర బృందం సభ్యుడు,నోడల్ అధికారి లోకేష్ అన్నారు.బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో గట్టు ఆస్పిరేషనల్ బ్లాక్ అభివృద్ధి సూచికలపై నోడల్ అధికారి లోకేష్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించి, అదనపు కలెక్టర్ నర్సింగరావు తో కలిసి బ్లాక్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గట్టు ఆస్పిరేషనల్ బ్లాక్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి,మెరుగైన ఫలితాలు సాధించేలా అధికారులు సమిష్టి కృషి తో పని చేయాలన్నారు.విద్యారంగంలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించి, పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక బోధనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు విద్యార్థుల చదువు కొనసాగింపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బాలురు, బాలికలు ఎవరూ మధ్యలో చదువు మానేయకుండా పటిష్టమైన పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ఐసీడీఎస్ కార్యక్రమం ద్వారా గర్భిణీ స్త్రీలకు అందించాల్సిన పోషకాహారం క్రమం తప్పకుండా అందేలా చూడాలని సూచించారు. గట్టు ఆస్పిరేషనల్ బ్లాక్‌లో బ్యాంకింగ్ సేవలు,స్వయం సహాయక సంఘాలు, శిశు ఆరోగ్యం, గ్రామీణ పారిశుద్ధ్యం, అంగన్‌వాడీ మౌలిక సదుపాయాలు, చిన్నారుల పోషకాహారం,మధుమేహ పరీక్షలు వంటి అంశాల్లో సాధించిన పురోగతిని ఇదే విధంగా కొనసాగిస్తూ,మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. గట్టు ఆస్పిరేషనల్ బ్లాక్ అభివృద్ధికి స్థానిక అవసరాలు, వనరులు, సంప్రదాయాలకు అనుగుణంగా కొత్త ఆవిష్కరణలతో కూడిన వినూత్న ప్రాజెక్టులను అధికారులు గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు.గట్టు బ్లాక్‌లోని ప్రత్యేకత కలిగిన స్థానిక, సంప్రదాయ ఉత్పత్తులను గుర్తించి,వాటి వివరాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఆకాంక్ష' బ్రాండ్ ద్వారా వాటికి విస్తృత ప్రచారం, మార్కెటింగ్ అవకాశాలు కల్పించి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేలా కృషి చేయాలన్నారు.తద్వారా స్థానిక కళాకారులు, మహిళా స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ ప్రజలకు ఉపాధి, ఆదాయ అవకాశాలు పెంపొందించాలని తెలిపారు. బ్లాక్ అభివృద్ధికి మైక్రోసేవ్ కన్సల్టింగ్ సంస్థతో సమన్వయం చేసుకుంటూ, ఆర్థిక సమ్మిళితం,ఆరోగ్యం, పోషకాహారం,నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయ రంగాల్లో సంస్థ అందించే సహకారాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.గట్టు ఆస్పిరేషనల్ బ్లాక్‌ను అభివృద్ధి సూచికల్లో మరింత మెరుగైన స్థానానికి తీసుకువచ్చేందుకు సమిష్టిగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఎంపీడీఓ మహ్మద్ అబ్దుల్ సయ్యద్ ఖాన్, డిఆర్డిఓ ముసాయిదాబేగం,పీఆర్ ఈఈ ప్రభాకర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి సునంద,మిషన్ భగీరథ ఈఈ పరమేశ్వరి, బ్లాక్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో ఎండిన వరి పంటలపై సమగ్ర సర్వే చేపట్టాలి

రైతులకు ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు నష్టపరిహారం అందించాలి

జిల్లా కలెక్టర్‌కు తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షుడు అక్కమొల్ల మైసయ్య యాదవ్ విజ్ఞప్తి

మనోహరాబాద్ నవంబర్ 4 (విజన్ ఆంధ్ర):మెదక్ జిల్లాలో ఎండిపోయిన వరి పంటలపై అన్ని గ్రామాల్లో సమగ్ర సర్వే నిర్వహించి, నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా అధ్యక్షుడు అక్కమొల్ల మైసయ్య యాదవ్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు మీడియా ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మైసయ్య యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిన జాబితాలో మెదక్ జిల్లాలోని 21 మండలాలకు గాను కేవలం మనోహరాబాద్ మండలాన్ని మాత్రమే చేర్చడం బాధాకరమన్నారు. పారిశ్రామిక ప్రాంతాలు ఎక్కువగా ఉన్న మనోహరాబాద్ మండలాన్ని మాత్రమే కరువు మండలంగా ప్రకటించి, మిగిలిన 20 మండలాలను విస్మరించడం వల్ల ఆయా ప్రాంతాల్లో పంటలు నష్టపోయిన రైతులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లాలో అధిక శాతం మంది రైతులు వరి సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నారని, వర్షాభావ పరిస్థితులు, నీటి కొరత కారణంగా అనేక గ్రామాల్లో వరి పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. మరో వారం నుంచి పది రోజుల్లో జిల్లావ్యాప్తంగా వరి కోతలు పూర్తయ్యే అవకాశం ఉన్నందున అధికారులు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేయాలని కోరారు.జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని వ్యవసాయ శాఖ అధికారులతో ప్రతి గ్రామంలో సమగ్ర సర్వే నిర్వహించాలని, ఎండిపోయిన వరి పంటల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపించాలని విజ్ఞప్తి చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 30 వేల నుంచి రూ. 40 వేల వరకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ విషయంపై స్వయంగా స్పందించి మెదక్ జిల్లా రైతుల పరిస్థితిని పరిశీలించాలని కోరారు. కేవలం ఒక మండలానికే పరిమితం కాకుండా జిల్లాలోని అన్ని మండలాల్లో పంట నష్టాన్ని పరిశీలించి, అర్హులైన రైతులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.రైతులు ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలు కళ్లముందే ఎండిపోతుంటే పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామాల వారీగా సర్వే పూర్తి చేసి, ఎండిపోయిన వరి పంటలకు నష్టపరిహారం అందించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి, మెదక్ జిల్లా రైతుల తరఫున మైసయ్య యాదవ్ మరోసారి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

శారీరక దృఢత్వమే ఆటల పోటీలు లక్ష్యం

నేషనల్ వాలీబాల్ ప్లేయర్, కంటెస్టెంట్ ఎమ్మెల్యే పెద్దింటి నవీన్ కుమార్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 4 (విజన్ ఆంధ్ర) : శారీరక, మానసిక దృఢత్వానికి స్పోర్ట్స్ ఎంతో అవసరం అని నేషనల్ వాలీబాల్ ప్లేయర్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే పెద్దింటి నవీన్ కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా టీఎస్ డబ్ల్యూ ఆర్ స్కూల్స్ 12 జోనల్ మీట్ సెలక్షన్ అనంతగిరిపల్లి టిఎస్ డబ్ల్యూ ఆర్ పాఠశాలలో ఓల్డ్ స్టూడెంట్ నేషనల్ వాలీబాల్ ప్లేయర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే పెద్దింటి నవీన్ కుమార్ ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ మాజీ జనరల్ సెక్రెటరీ విజయభాస్కర్ రెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ అమరేందర్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, జిల్లా మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ వీటిలోసప్ప, నర్సింలు, సీనియర్ నాయకుడు స్కూల్ ప్రిన్సిపల్ రమాదేవి, పిడి చందర్, పి ఈ టి లు తదితరులు పాల్గొన్నారు. సెలక్షన్ ను ఉద్దేశించి పెద్దింటి నవీన్ కుమార్ మాట్లాడుతూ ,భవిష్యత్తులో స్పోర్ట్స్ కు చాలా భవిష్యత్తు ఉంటుందనీ అన్నారు.నేను ఒక సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో చదివి ఒక స్పోర్ట్స్ ప్లేయర్ గా స్ఫూర్తిదాయకంగానే ఉన్నానని అన్నారు. ప్రతి ఒక్కరు స్పోర్ట్స్ ఆడాలని అన్నారు. స్పోర్ట్స్ ఆడడం వలన శారీరక మానసిక దృఢత్వం ఉంటుందని అన్నారు.జీవితంలో ఆరోగ్యం కోసం స్పోర్ట్స్ ఎంతో అవసరం అని తెలిపారు.తన గురువు అయినటువంటి చందర్ పీడిని, పీఈటీలను శాలువాతో సన్మానించారు.

విద్యార్థులకు దీపావళి భద్రతపై అవగాహన

రామాయంపేటమెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు దీపావళి పండుగ సందర్భంగా భద్రతా అవగాహన కార్యక్రమాన్ని అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాణసంచా కాల్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారి నరేష్ మాట్లాడుతూ దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో పాటు సురక్షితంగా జరుపుకోవాలని తెలిపారు.బాణసంచా కాల్చే సమయంలో తప్పనిసరిగా భద్రతా నియమాలు పాటించాలని నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.విద్యార్థులు పెద్దల పర్యవేక్షణలోనే బాణసంచా కాల్చాలని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.పండుగ సమయంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు.

అమిత్ షా కి జగ్గారెడ్డి కౌంటర్



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ :04(విజన్ ఆంధ్ర)రాహుల్ గాంధీ నీ ప్రధాని చేసేందుకు తెలంగాణ కాంగ్రెస్ ఛాలెంజ్ గా తీసుకుంటాం అని టి పీ సి సి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. బుధవారం నాడు గాంధీభవన్లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ లో 14 ఎంపీ సీట్లు గెలిచి తీరుతాం అని ధీమా వ్యక్తం చేశారు రాహుల్ గాంధీ ఇంట్లోనే ప్రధాని పదవి పుట్టింది రాహుల్ గాంధీ ప్రధాని అవ్వాలి అనుకుంటే 2004లోనే అయ్యేవారురాముడి పేరు చెప్పుకుని మూడు సార్లు ప్రధాని అయ్యింది మీ మోడీ రాముడి పేరుతో అధికారం లోకి వచ్చారు కానీ ఆయన అడుగు జాడల్లో పని చేయడం లేదు అని విమర్శించారు. స్వతంత్ర ఉద్యమం లోనే మహాత్మాగాంధీ రఘుపతి రాఘవ రాజారాం అని రాముడి భజన చేశారు అప్పుడు బీజేపీ పుట్టలేదు. మోడీ అమిత్ షా లు కూడా పుట్టి ఉండరు అని అన్నారు.రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే అవకాశం లేదని అమిత్ షా మాట్లాడారు.అమిత్ షా ఒక విషయం మర్చిపోతున్నారు.కానీ ప్రధాన మంత్రి పదవే రాహుల్ గాంధీ కుటుంబం లో పుట్టిందన్నారు అమిత్ షా మీరు అధికారం లోకి రాకముందు ఏం జరిగిందో మీ కుటుంబ సభ్యులని అడిగి తెలుసుకోండి అని అన్నారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత ప్రజలు నేరుగా నెహ్రు నీ ప్రధానిగా ఎన్నుకున్నారని గుర్తు చేశారు.మోడీ ప్రధాన మంత్రి అయ్యి 13ఏళ్లు అయింది. 2004 లో సోనియా గాంధీ నేతృత్వం లో యూపీఏ ప్రభుత్వం ఏర్పడింది.సోనియా, రాహుల్ గాంధీ నీ ప్రధాని కావాలని ఎంపీలు అందరు తీర్మానం చేశారు కానీ మాకు ప్రధాన మంత్రి పదవి వద్దన్నారని గుర్తు చేశారు.మన్మోహన్ సింగ్ నీ ప్రైమ్ మినిస్టర్ చేశారు.మన్మోహన్ సింగ్ సైతం ప్రైమ్ మిస్టర్ అయ్యాక రాహుల్ గాంధీ దగ్గరికి వెళ్ళి ప్రైమ్ మినిస్టర్ కావాలని కోరారు కానీ రాహుల్ గాంధీ తిరస్కరించి మీరే ఉండాలి మీ నేతృత్వం లోనే పని చేస్తామని అన్నారు.ఉపాధి హామీ పధకం తీసుకొచ్చి దేశంలో పెద్ద ప్రజలను ఆదుకున్నారు.అమిత్ షా మీరెవ్వరు రాహుల్ ప్రధాని కాలేడని చెప్పడానికి అని అన్నారు.మీకు చెప్పే హక్కే లేదుదేశ ప్రజలు రాహుల్ నీ ప్రధాని చేస్తారుఈ దేశ ఓటర్లను శాసించే హక్కు మీకు లేదు. అమిత్ షా కీ ఇదే మా సమాధానంఅమిత్ షా అహంకారం తో మాట్లాడిన మాటలకి సమాధానం ఇస్తాము.రానున్న ఎన్నికలో 17 లో 14 ఎంపీ స్థానాలు గెలిచి ఇస్తాము.తెలంగాణ లో కాంగ్రెస్ కీ బలం ఉంది... బిజేపీ కీ లేదు.ఛాలెంజ్ గా తీసుకుంటాము రాహుల్ గాంధీ ప్రధాని కావడానికి పని చేస్తామురాముడి పేరుతో మీరు అధికారం లో ఉన్నారు. మంచిది కానీ ఆయన అడుగుజాడల్లో మీరు పరిపాలన సాగించడం లేదు అని విమర్శించారు.బీజేపీ పార్టీ యే కాదు మోడీ అమిత్ షా కుడా పుట్టలేదేమోప్రజలు సంతోషంగా ఉండాలనే నెహ్రు, గాంధీ కుటుంబం కోరుకున్నదిసర్దార్ వల్లభాయ్ పటేల్ పేరుతో ఓట్లు తీసుకునే ప్రయత్నం బీజేపీ చేసింది.సర్దార్ వల్లభాయ్ పటేల్ నెహ్రూ కాబినెట్ లో మంత్రి. సర్దార్ వల్లభాయ్ పటేల్ పక్క కాంగ్రెస్ పార్టీ. నెహ్రూ డైరెక్షన్ లోనే కదా సర్దార్ వల్లభాయ్ పటేల్ తెలంగాణ ను దేశంలో విలీనం చేయించింది మా ఇంటి వారిని కుడా మీ ఖాతాలో వేసుకుంటారు. రాహుల్ గాంధీ నీ ప్రధాని చేస్తాము. దాని కోసం 17 ఎంపీ స్థానలో 14 స్థానాలు గెలిచేందుకు పని చేస్తాము అని తెలిపారు.

కరువు పీడిత రైతులను, ప్రజలను తక్షణమే ఆదుకోవాలి

పదిర మండలాన్ని కరువు ప్రభావిత ప్రాంతంగా గుర్తించి సహాయక చర్యలు చేపట్టాలి:

సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి డిమాండ్



నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో (విజన్ ఆంధ్ర): నవంబర్. 04 సీపీఐ రాష్ట్ర బృందం ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లాలోని పదిర మండల పరిధిలోని వంకేశ్వరం తదితర గ్రామాల్లో కరువు పరిస్థితులపై క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో తీవ్ర కరువు పరిస్థితుల కారణంగా రైతులు పంట నష్టంతో పాటు పెట్టుబడులను కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులనుఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు గ్రామీణ ప్రజలు తీవ్రమైన తాగునీటి కొరతతో అల్లాడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కరువు బాధిత రైతులను, ప్రజలను ఆదుకోవాలని సీపీఐ డిమాండ్ చేస్తోందన్నారు.సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. బాల నరసింహ, సీపీఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి. ఫయాజ్ మాట్లాడుతూ.. పదిర మండలంతో పాటు అచ్చంపేటనియోజకవర్గంలోని పలు మండలాల్లో, ముఖ్యంగా గిరిజనులు నివసిస్తున్న గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ పథకం ద్వారా కనీసం 15 రోజులకు ఒకసారి కూడా తాగునీరు అందని దుస్థితి నెలకొందని, ఇది ప్రభుత్వ మంచినీటి సరఫరా వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.కరువు కారణంగా పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారంఅందించాలని, పెట్టుబడి సాయం కల్పించాలని, తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో మంచినీటి సరఫరానుయుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని కోరారు.కరువు పరిస్థితులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను గుర్తించి బాధిత రైతులకు, ప్రజలకు తక్షణ ఉపశమనం కల్పించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే కేశవ గౌడ్ వి వెంకటయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు పెబ్బేటి విజయుడు ఈర్ల చంద్రమౌళి అచంపేట్ నియోజకవర్గ కార్యదర్శి పెరమల గోపాల్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సూర్య శంకర్ గౌడ్ అధ్యక్షులు బి శ్రీనివాసులు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్ కుమార్ దళిత కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి బండిలక్ష్మీపతిఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శిమారేడుశివశంకర్బ్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు తన్నీరు మల్లేష్ సిపిఐ జిల్లా సమితి సభ్యులు వి రవీందర్ పి పరశురాం డిపెచ్విఎస్ రాష్ట్ర సమితి సభ్యులు వంకేశ్వరం శ్రీనివాసులు కొత్త రామస్వామి మహమ్మద్ ఖలీల్ ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు ఎం ఆంజనేయులు విష్ణు నరేందర్ రెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు విష్ణు శివకృష్ణ ధనుంజయుడు శ్రీను నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షాలుపొంగిపొర్లుతున్న వాగులు

భద్రాద్రి జిల్లాలో జలమయమైన రహదారులు

ములకలపల్లి, నవంబర్ 4: మురను తుఫాన్ ప్రభావంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ప్రధాన రహదారులు జలమయమవ్వగా.. లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. పాల్వంచ నుంచి మాదారం మీదుగా అన్నపురెడ్డిపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై సత్యంపేట గ్రామం వద్ద పాములేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వంతెనపై నుంచి వరద నీరు పొంగిపొర్లుతుండటంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు పాల్వంచ నుంచి దమ్మపేట వెళ్లే ప్రధాన రహదారిపై రాజుపేట శివారులో పాములేరు వాగుపై ఇటీవల కూలిన వంతెన పక్కన ఏర్పాటు చేసిన తాత్కాలిక అప్రోచ్ కూడా వరద ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో ఈ రెండు మార్గాల్లో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు భారీ వర్షాలతో మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో సాగు చేస్తున్న వరి, మిర్చి, పుచ్చ, శనగ తదితర పంటలు నీట మునుగుతున్నాయి.

జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు2026 ఘనంగా నిర్వహణ



కామారెడ్డి బ్యూరో నవంబర్ 4 (విజన్ఆంధ్ర)కామారెడ్డి పట్టణంలోని కళాభారతి ఆడిటోరియంలో రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ అనుమతితో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు " 2026లో భాగంగా జిల్లా స్థాయి యువజన సాంస్కృతిక పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందన్ నాయక్ , మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి , మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శ్రీమతి కాసర్ల గోదావరి గారు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న ప్రతిభ, సృజనాత్మకత మరియు కళా నైపుణ్యాలను వెలికితీయడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. యువత ఇలాంటి కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని స్వామి వివేకానందుని ఆశయాలు, సందేశాలను భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా జానపద బృంద గానం, జానపద బృంద నృత్యం, నాటిక, చిత్రలేఖనం మరియు కవితా రచన తదితర విభాగాల్లో పోటీలను నిర్వహించారు. వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ, ద్వితీయ మరియు తృతీయ బహుమతులతో పాటు మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేసి ఘనంగా సత్కరించారు.ఈ పోటీలలో ప్రథమ బహుమతి సాధించిన విజేతలు రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న యువజన సాంస్కృతిక పోటీలలో కామారెడ్డి జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు.

అంగన్వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలి

బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలి
సఖి కేంద్రం సేవలను విస్తరించాలి
శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం
జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల నవంబర్ 4 (విజన్ ఆంధ్ర బ్యూరో)అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణీలకు సక్రమంగా పౌష్టికాహారం అందజేస్తూ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పనితీరుపై కలెక్టర్ సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అంగన్వాడి కేంద్రాలు అంటే కేవలం పిల్లలకు పౌష్టికాహారం, పూర్వ ప్రాథమిక విద్యను అందించడమే కాక చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను కూడా గమనించేలా అక్కడి ఉద్యోగులు విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో బరువు, ఎత్తు తక్కువగా ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారికి అవసరమైన చికిత్సతో పాటు ప్రత్యేక పౌష్టికాహారాన్ని అందజేయాలన్నారు. చిన్నారులకు కంటి, చెవి, ఇతరత్రా సంబంధ సమస్యలతో పాటు మానసిక పరిస్థితిపై పర్యవేక్షణ అవసరమన్నారు. జిల్లాలో కొంత మందికి మేనరిక వివాహాల కారణంగా కూడా అంగవైకల్యం కలిగిన, బుద్ధిమాంద్యంతో బాధపడే చిన్నారులు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల పైన ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో వచ్చే 20 రోజుల్లో పిల్లలందరికీ వివిధ పరీక్షలు పూర్తి చేసి నివేదికను అందజేయాలని ఆదేశించారు.జిల్లాలో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న అంగన్వాడి కేంద్రాలకు పక్కా భవనాలను విబిజి రాంజీ పథకంలో నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పక్కా భవనాలు అవసరమున్నచోట ప్రతిపాదనలు పంపితే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అధికారులు తరచూ అంగన్వాడి కేంద్రాలను పర్యవేక్షణ చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని కేంద్రాలను తరచూ సందర్శిస్తూ పకడ్బందీగా నిర్వహించేందుకు తమ వంతుగా బాధ్యత వహించాలన్నారు. కేంద్రాలకు కుళ్లిన కోడిగుడ్లు సరఫరా చేస్తే తగు చర్యలు తీసుకుంటామని, లబ్ధిదారుల సంఖ్యకు సరిపోయేంత ఆహారాన్ని వండించి పెట్టాలన్నారు. అంగన్వాడి సరుకులను పక్కదారి పట్టించే వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడి అంగన్వాడి టీచర్లతో పాటు వివిధ శాఖల అధికారులు బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే బాలల సంరక్షణ విభాగానికి తెలియజేయాలన్నారు. కేంద్రాల్లోని చిన్నారులకు ఆధార్ ఎన్రోల్మెంట్ పూర్తి స్థాయిలో జరగలేదని, పూర్తిస్థాయిలో ఆధార్ కార్డులు అందేలా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జనన ధ్రువీకరణ పత్రాలు అవసరమైన వారికి అందించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.మహిళల సంరక్షణకు ఉద్దేశించిన సఖి కేంద్రం సేవలను గురించి ప్రజలకు పెద్ద ఎత్తున తెలిసేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు గుడ్, బ్యాడ్ టచ్ పై కౌమార దశపై అవగాహన కలిగించి క్రమశిక్షణతో ఉండేందుకు దోహదపడాలన్నారు. ప్రతి పాఠశాలలో చైల్డ్ సేఫ్టీ నోడల్ అధికారిని నియమించినందున బాలల హక్కులు, భద్రత విషయంలో ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే బాలల సంరక్షణ విభాగం అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో డిడబ్ల్యూఓ సునంద, డీసీపీవో నరసింహ, సిడిపిఓలు రాజేశ్వరి, హేమలత, సూపర్వైజర్లు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాలకు ప్రముఖులకు ఆహ్వానం



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నవంబర్ 4 (విజన్ ఆంధ్ర బ్యూరో):శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 22వ తేదీన నిర్వహించనున్న కార్తీక వనభోజన మహోత్సవానికి పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు.ఈ సందర్భంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ,ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమలు అండ్ వాణిజ్యం తెలంగాణ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబును, కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు, కె.పి. వివేకానందను, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ ను, మాజీ కేంద్ర మంత్రి, సముద్రాల వేణుగోపాల చారిని, గాంధీ భవన్ పిఆర్వో కప్పర హరిప్రసాద్ రావును కలిసి ఆహ్వానించారు. అదేవిధంగా పలువురు ఇతర ప్రముఖులకు కూడా ఆహ్వాన పత్రికలు అందజేశారు.ఈ కార్యక్రమంలో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు గోగులపాటి కృష్ణమోహన్, ప్రధాన సలహాదారు సర్వేపల్లి రమేష్, కార్యవర్గ సభ్యులు గడ్డం రాంబాబు, పురోహితుల హరి రాఘవేంద్ర, సింహాచలం శ్రీధరాచార్యులు, శ్రీరంగం గోపికృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.కార్తీక మాస ఆధ్యాత్మిక విశిష్టతను చాటుతూ, బ్రాహ్మణ కుటుంబాల మధ్య ఐకమత్యం, ఆత్మీయత, సాంస్కృతిక సంప్రదాయాలను పెంపొందించడమే ఈ వనభోజన మహోత్సవం ముఖ్య ఉద్దేశమని సంఘ ప్రతినిధులు తెలిపారు.

కుమురం భీమ్ వర్ధంతి వారోత్సవాల ముగింపు కార్యక్రమం

ఆసిఫాబాద్: గిరిజన హక్కుల కోసం పోరాడి జల్, జంగల్, జమీన్ నినాదంతో ఆదివాసీల ఆత్మగౌరవ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిన గిరిజన పోరాట యోధుడు అమరుడు కొమురం భీమ్ వర్ధంతి వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కుమురం భీమ్ చౌక్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, వారోత్సవాల ముగింపు సందర్భంగా జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అమరుడు కొమురం భీమ్ చేసిన పోరాటాలను, ఆదివాసీల హక్కుల సాధన కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. గిరిజన సమాజం ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం కొమురం భీమ్ చేసిన పోరాటం నేటి తరానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 4:(విజన్ ఆంధ్ర)జిల్లాలో త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతిరోజు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఇంట్రా గ్రిడ్ అధికారులతో త్రాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామానికి త్రాగునీటి సరఫరా చేయాలని, ఏ గ్రామంలో తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుండి డిసెంబర్ 31వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, ప్రతి బోరు, సింగిల్ పేజ్ మోటారు, ఓవర్ హెడ్ ట్యాంకులు, గ్రిడ్ పైప్ లైన్ల పనులను పరిశీలించి, మరమ్మత్తు ఉన్నట్లయితే వెంటనే చేపట్టాలని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి త్రాగునీటి సమస్య రాకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, మిషన్ భగీరథ ఈ.ఈ. రాకేష్, ఇంట్రా గ్రిడ్ ఈ.ఈ. ఎం.ఎ. సిద్ధికి తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించిన జాదవ్ అంబాజీ

ఘనంగా సన్మానించి స్వాగతం పలికిన సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 4:(విజన్ ఆంధ్ర)కోమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జాదవ్ అంబాజీ అదనపు బాధ్యతలు స్వీకరించారు. బుధవారం జిల్లా కలెక్టర్ శ్రీమతి కె. హరిత ఆదేశాల మేరకు ఆయనకు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారుఈ సందర్భంగా కార్యాలయానికి చేరుకున్న జాదవ్ అంబాజీకి సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జాదవ్ అంబాజీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించిన జిల్లా కలెక్టర్ కె. హరితకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వహిస్తూ సాంఘిక సంక్షేమ శాఖ అభివృద్ధికి, శాఖ పరిధిలోని విద్యార్థులు, లబ్ధిదారుల సంక్షేమానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని తెలిపారు. శాఖలోని అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ప్రోటోకాల్ ఉల్లంఘనపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

పెద్దపల్లిదసరా ఉత్సవాల సందర్భంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు తగిన ప్రోటోకాల్ పాటించకుండా, అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించకపోవడంపై విచారణ జరిపించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు పర్స విజయ్‌కు మార్ జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కోరారు. రామ గుండం కార్పొరేషన్, పెద్దప ల్లి మున్సిపల్ అధికారుల తీరుపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో కాళేశ్వరం పుష్కరాల సందర్భంగా ప్రోటోకాల్ ఉల్లంఘనపై కలెక్టర్ గెజిట్ ఉత్తర్వులు జారీ చేసినా, మళ్లీ అదే పరిస్థితి నెలకొందని ఫిర్యా దులో పేర్కొన్నారు.

కొడంగల్ రైతు మేళాకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర వ్యవసాయ,సహకార శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్ కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



గద్వాల నవంబర్ 4 (విజన్ ఆంధ్ర బ్యూరో)కొడంగల్‌లో మూడు రోజులపాటు నిర్వహించనున్న రైతు మేళాకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యవసాయ,సహకార శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్ అధికారులను ఆదేశించారు.బుధవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్, కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేటలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న రైతు మేళా ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్, మాట్లాడుతూ,ఈ నెల 7 నుండి 9 వరకు కొండంగల్ లోని జరిగే రైతు మేళాకు పెద్ద సంఖ్యలో రైతులు,అన్నదాతలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు మేళా ప్రాధాన్యతను వివరించి వారి భాగస్వామ్యాన్ని పెంపొందించాలని సూచించారు. రైతు మేళా సందర్భంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరగనున్న నేపథ్యంలో సభా ప్రాంగణం,ప్రధాన వేదిక నిర్మాణం, ఇతర ఏర్పాట్లను నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు.రైతు మేళాకు హాజరయ్యే రైతులు, చేరుకోవడం నుంచి తిరిగి తమ ప్రాంతాలకు వెళ్లే వరకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా రవాణా,ఇతర సదుపాయాలను సమన్వయంతో పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతుల సౌకర్యార్థం భోజనం, తాగునీరు,విశ్రాంతి తదితర అవసరమైన ఏర్పాట్లపై సంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ప్రదర్శన స్టాళ్లను ఆకర్షణీయంగా, సమాచారాత్మకంగా రూపొందించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం,నూతన సాగు పద్ధతులు, వ్యవసాయ యాంత్రీకరణ, పంటల వైవిధ్యీకరణ, ప్రకృతి వ్యవసాయం, ఉద్యానవన పంటలు, సూక్ష్మ సేద్యం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించేలా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నారు.ప్రతి శాఖ సమన్వయంతో కేటాయించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేసి,రైతు మేళాను విజయవంతం చేయాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ,రైతు మేళాకు జోగులాంబ గద్వాల్ జిల్లా నుంచి హాజరయ్యే రైతుల కోసం అవసరమైన బస్సులను ఏర్పాటు చేయడంతో పాటు, ప్రతి బస్సుకు రూట్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. రైతులకు మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం అందించేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించి అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. రైతుల రవాణా,భద్రత తదితర అంశాలపై జిల్లా ఎస్పీతో సమన్వయం చేసుకుంటూ అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిని ముషాయిదా బేగం,వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప,ఉద్యానవన శాఖ అధికారి రాజ్ కుమార్,ఆర్టీసీ డీయం శ్రీధర్,తదితరులు పాల్గొన్నారు.

తాడిచర్ల డేంజర్ జోన్ పరిధిలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి - కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లిజిల్లా 04 నవంబర్ (విజన్ ఆంధ్ర) జెన్‌కో, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు నిర్వహించిన సర్వే ప్రకారం 2022 సంవత్సరానికి ముందు గ్రామంలో నిర్మించిన ఇళ్లలో గ్రామ పంచాయతీ లేదా పంచాయతీ కార్యదర్శి అనుమతులు పొందిన ఇళ్లను మాత్రమే అర్హత ప్రాతిపదికన పి.ఎన్.లో చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో జెన్‌కో అధికారులు నిర్వహించిన సర్వేలో అనుమతులు లేని కొన్ని ఇళ్లకు ఒకే వ్యక్తి పేరుపై ఒకటి కంటే ఎక్కువ ఇంటి నంబర్లు కేటాయించినట్లు గుర్తించిన నేపథ్యంలో, అసలైన లబ్ధిదారులను గుర్తించి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.ఇప్పటివరకు అందిన ఒరిజినల్ పిటిషన్లను పూర్తిస్థాయిలో పరిశీలించి, ఆమోదించబడిన పిటిషన్లు, ఖచ్చితమైన ఇంటి నంబర్ల ఆధారంగా ఆర్ఎన్ఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. మిగిలిన భూములకు సంబంధించిన పిటిషన్ల పరిశీలనను పూర్తి చేసి, నిర్దేశిత గడువులోగా భూసేకరణ, అవార్డుల ప్రక్రియను పూర్తిచేయాలని తెలిపారు.అలాగే గ్రామసభలను ముందస్తు షెడ్యూల్ ప్రకారం నిర్వహించి, ప్రజలకు తగిన నోటీసులు జారీ చేయాలని, ఇళ్ల వివరాలను జియో కోఆర్డినేట్స్ ఆధారంగా ఫొటోలు, డిజిటల్ రికార్డుల రూపంలో నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బంది, ప్రాజెక్టు అధికారులు, రెవెన్యూ, జెన్‌కో, సర్వే శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.భూసేకరణ, పునరావాస ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు, అవకతవకలకు తావులేకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ప్యాకేజీలు, నష్టపరిహారం నిబంధనల ప్రకారం అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జెన్కో సీఈ శ్రీ ప్రకాష్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జెన్కో రెవెన్యూ సర్వే అధికారులతో సమీక్ష

తాడిచర్ల డేంజర్ జోన్ పరిధిలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లిజిల్లా 04 నవంబర్ (విజన్ ఆంధ్ర) జెన్‌కో, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు నిర్వహించిన సర్వే ప్రకారం 2022 సంవత్సరానికి ముందు గ్రామంలో నిర్మించిన ఇళ్లలో గ్రామ పంచాయతీ లేదా పంచాయతీ కార్యదర్శి అనుమతులు పొందిన ఇళ్లను మాత్రమే అర్హత ప్రాతిపదికన పి.ఎన్.లో చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో జెన్‌కో అధికారులు నిర్వహించిన సర్వేలో అనుమతులు లేని కొన్ని ఇళ్లకు ఒకే వ్యక్తి పేరుపై ఒకటి కంటే ఎక్కువ ఇంటి నంబర్లు కేటాయించినట్లు గుర్తించిన నేపథ్యంలో, అసలైన లబ్ధిదారులను గుర్తించి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.ఇప్పటివరకు అందిన ఒరిజినల్ పిటిషన్లను పూర్తిస్థాయిలో పరిశీలించి, ఆమోదించబడిన పిటిషన్లు, ఖచ్చితమైన ఇంటి నంబర్ల ఆధారంగా ఆర్ఎన్ఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. మిగిలిన భూములకు సంబంధించిన పిటిషన్ల పరిశీలనను పూర్తి చేసి, నిర్దేశిత గడువులోగా భూసేకరణ, అవార్డుల ప్రక్రియను పూర్తిచేయాలని తెలిపారు.అలాగే గ్రామసభలను ముందస్తు షెడ్యూల్ ప్రకారం నిర్వహించి, ప్రజలకు తగిన నోటీసులు జారీ చేయాలని, ఇళ్ల వివరాలను జియో కోఆర్డినేట్స్ ఆధారంగా ఫొటోలు, డిజిటల్ రికార్డుల రూపంలో నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బంది, ప్రాజెక్టు అధికారులు, రెవెన్యూ, జెన్‌కో, సర్వే శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.భూసేకరణ, పునరావాస ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు, అవకతవకలకు తావులేకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ప్యాకేజీలు, నష్టపరిహారం నిబంధనల ప్రకారం అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జెన్కో సీఈ శ్రీ ప్రకాష్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు

లబ్ధిదారులు ,అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని పిలుపు, రాష్ట్రంలో 2,21,500 ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు పూర్తి, వివిధ నిర్మాణ దశల్లో 1.90 లక్షల ఇందిరమ్మ ఇళ్లు, 4 కార్పొరేషన్లలో హైదరాబాద్ తరహా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 4 (విజన్ ఆంధ్ర బ్యూరో): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిరుపేదల కోసం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇంతవరకు 2,21,500 ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తయ్యాయని ఈ దీపావళి రోజున ప్రతి ఇందిరమ్మ ఇంటిలో దీపావళి వేడుకల జరపాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఆరోజున పేదల ఇంట్లో వెలిగే ప్రతిదీపం తెలంగాణ ప్రజాప్రభుత్వ సంకల్పానికి ప్రతీక కావాలన్నారు. బుధవారం నాడు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి మంత్రి పొంగులేటి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ ప్రజా ప్రభుత్వం ఎన్ని ఆర్థిక అవరోధాలున్నా పేదల ఆత్మగౌరవానికి చిహ్నమైన ఇందిరమ్మ ఇళ్లను నిర్మించేందుకు నిర్ణయించిందన్నారు. భద్రత, భరోసాతో పాటు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్న సంకల్పంతో తొలివిడత 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా ఇప్పటికి 2,21,500 ఇళ్లలో గృహ ప్రవేశాలు పూర్తయ్యాయని, మరో 1.90 లక్షల ఇళ్ళు వివిధ నిర్మాణదశల్లో పూర్తికానున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. గృహ ప్రవేశాలు జరుపుకున్న ఇళ్లకు దీపావళి రోజున ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఇందిరమ్మ ఇళ్ళ కమిటీ సభ్యులు, ఈ పథకంతో మమేకమైన అందరూ ఆ ఇళ్లకు వెళ్లి వారి ఆనందాల్లో భాగస్వాములు కావాలని కోరారు. దీనికి సూచికగా మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు అనే పోస్టర్‌ను మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి మంత్రి పొంగులేటి ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో సహా రాష్ట్ర మంత్రి వర్గం ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించాలని కోరుతోందని మంత్రి పొంగులేటి వెల్లడించారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, తొలి విడతగా 4.50 లక్షల ఇళ్లు, రెండో విడత 2.50 లక్షల ఇళ్లతో పాటు హైదరాబాద్ క్యూర్ ఏరియా పరిధిలో లక్ష ఇళ్లను మంజూరు చేశామని చెబుతూ హైదరాబాద్ తరహాలోనే రాష్ట్రంలోని నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ కార్పొరేషన్‌లలో కూడా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడతామని ప్రకటించారు. జి+5 పద్ధతిలో నిర్మించనున్న ఈ టవర్స్ నిర్మాణానికి సంబంధించి దీపావళి లోగా నోటిఫికేషన్ జారీ చేస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ నుంచి వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తామని మంత్రి గారు పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో రూ. 40 వేల కోట్లతో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ఆపేదిలేదని స్పష్టం చేస్తూ ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు ప్రతి సోమవారం నేరుగా హైదరాబాద్ నుంచి అవినీతి రహితంగా నిధులను జమచేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలోని నగరాలు, పట్టణాలు, గ్రామాలేగాక మారుమూల ప్రాంతాలు, తండాలలో కూడా ఈ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోందని ఫలితంగా పేదవారి సొంతింటికల సాకారమవుతోందని మంత్రి పొంగులేటి అన్నారు.

బియ్యం దుకాణాలపై అధికారుల ఆకస్మిక తనిఖీలు - 26 కిలోల బస్తాల్లో 25 కిలోల బియ్యం మాత్రమే గుర్తింపు



కాగజ్‌నగర్, నవంబర్ 4 (విజన్ ఆంధ్ర): కాగజ్‌నగర్ పట్టణంలోని గోల్ బజార్‌లో బియ్యం దుకాణాలపై పౌరసరఫరాలు, లీగల్ మెట్రాలజీ, మున్సిపల్ శాఖల అధికారులు బుధవారం సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పలు దుకాణాల్లో తూనికలు, కొలతలు, లైసెన్సులకు సంబంధించిన నిబంధనల ఉల్లంఘనలు బయటపడ్డాయి.కొన్ని దుకాణాల్లో 26 కిలోలుగా ముద్రించిన బియ్యం బస్తాల్లో కేవలం 25 కిలోల బియ్యం మాత్రమే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో సంబంధిత వ్యాపారులపై చర్యలకు అధికారులు సిద్ధమయ్యారు. సతీష్ కిరాణా, వైద్య రవికుమార్ కిరాణా, బుక్క రాములు కిరాణా, పండరినాథ్ దుకాణాల్లో నిబంధనల ఉల్లంఘనలు గుర్తించినట్లు తెలిపారు.అదేవిధంగా రిలయన్స్ స్మార్ట్ పాయింట్‌లో తనిఖీలు నిర్వహించగా తూనిక యంత్రంలో వ్యత్యాసాలు గుర్తించారు. దీంతో లీగల్ మెట్రాలజీ అధికారులు కేసు నమోదు చేశారు. వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. వినియోగదారులను మోసం చేసే విధంగా వ్యవహరిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీల్లో డీసీఎస్ఓ వాజిద్ అలీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌కుమార్, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ అజీజ్ పాషా, మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో బియ్యం దుకాణాలు, రిటైల్ స్టోర్‌పై సంయుక్త తనిఖీలు



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 4:(విజన్ ఆంధ్ర) కాగజ్‌నగర్ గోల్ బజార్‌లో పౌరసరఫరాల శాఖ, లీగల్ మెట్రాలజీ శాఖ మరియు మున్సిపల్ శాఖ అధికారులు సంయుక్తంగా బియ్యం దుకాణాలపై తనిఖీలు నిర్వహించారు.తనిఖీల్లో కొన్ని దుకాణాల్లో 26 కిలోలుగా ముద్రించిన బియ్యం బస్తాల్లో 25 కిలోల బియ్యం మాత్రమే ఉన్నట్లు, తూనికలు, కొలతలు మరియు లైసెన్సులకు సంబంధించిన నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారు. ఈ నేపథ్యంలో సతీష్ కిరాణా, వైద్య రవికుమార్ కిరాణా, బుక్క రాములు కిరాణా, పండరినాథ్ దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.అదేవిధంగా, కాగజ్‌నగర్‌లోని రిలయన్స్ స్మార్ట్ పాయింట్‌లో కూడా తనిఖీలు నిర్వహించగా, తూనిక యంత్రంలో (కాంటా) వ్యత్యాసాలు గుర్తించినట్లు, ఈ మేరకు లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను బియ్యం దుకాణాల యజమానులు మరియు వ్యాపార సంస్థలు తప్పనిసరిగా పాటిస్తూ వినియోగదారులకు సహకరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీల్లో డీసీఎస్ఓ వాజిద్ అలీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌కుమార్, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ అజీజ్ పాషా మరియు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కుమురం భీమ్ వర్ధంతి వారోత్సవాల ముగింపు కార్యక్రమం

జెండా ఆవిష్కరించి, ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళులర్పించిన డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 4:(విజన్ ఆంధ్ర) గిరిజన హక్కుల కోసం పోరాడి జల్, జంగల్, జమీన్ నినాదంతో ఆదివాసీల ఆత్మగౌరవ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిన గిరిజన పోరాట యోధుడు అమరుడు కొమురం భీమ్ వర్ధంతి వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కుమురం భీమ్ చౌక్‌లో ఘనంగా నిర్వహించారుబిబిఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, వారోత్సవాల ముగింపు సందర్భంగా జెండాను ఆవిష్కరించారు ఈ సందర్భంగా అమరుడు కొమురం భీమ్ చేసిన పోరాటాలను, ఆదివాసీల హక్కుల సాధన కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. గిరిజన సమాజం ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం కొమురం భీమ్ చేసిన పోరాటం నేటి తరానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారురుబిబికొమురం భీమ్ ఆశయాలను భావితరాలకు తెలియజేస్తూ, ఆయన చూపిన మార్గంలో ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారుఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆదివాసీ సంఘాల నాయకులు, ఆత్రం సక్కు మాజీ శాసన సభ్యులు, ఆత్రం సుగుణ డి సి సి అధ్యక్షులు, సిడాం అర్జు, మాడావి శ్రీనివాస్, పెందూర్ సుధాకర్,ఆత్రం చందన్ సావ్ ,కుమరం సీతారామ్, కుమరం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్

తుగ్గలి: మండల కేంద్రమైన తుగ్గలిలోని పోలింగ్ కేంద్రాన్ని కర్నూలు జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్,ఐఏఎస్ బుధవారం రోజున పరిశీలించారు.నవంబర్ 5న జరగనున్న ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రంలో చేసిన ఏర్పాట్లను ఆయన క్షుణ్ణంగా వరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో తాగునీరు,విద్యుత్, ఫర్నిచర్,ర్యాంప్,మరుగుదొడ్లు తదితర కనీస సౌకర్యాలు ఉన్నాయా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామగ్రి,భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.తుగ్గలిలో గల నాలుగు పోలింగ్ కేంద్రాలకు 333 సిబ్బందిని కేటాయించినట్లు ఆర్వో శేషయ్య జాయింట్ కలెక్టర్ కు తెలియజేశారు.అనంతరం జాయింట్ కలెక్టర్ మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాల రూట్ మ్యాప్ ను ఆయన పరిశీలించారు.ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో,పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

మియాపూర్ భూములు

అమ్మొద్దు...

హైదరాబాద్, నవంబర్ 4, : మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూమి వస్తే అమ్మేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆ భూములను అమ్మి సొమ్ము చేసుకోవాలని చూడకుండా, పేదలు, అమరవీరులు, ఉద్యమకారులకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హైదర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి తన అనుచరులతో కలిసి ఈరోజు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ... "మియాపూర్‌లోని 550 ఎకరాల్లో 200 ఎకరాలు పేదల ఇళ్లకు, 100 ఎకరాలు అమరవీరులకు, మరో 100 ఎకరాలు ఉద్యమకారులకు కేటాయించండి. మిగిలిన భూమిలో పాఠశాలలు, కాలేజీలు కడితే మనస్ఫూర్తిగా స్వాగతిస్తాం" అని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఏడాదిలోపే కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక ఈ భూముల వ్యవహారాలపై దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు.ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇచ్చే చిత్తశుద్ధి ఉందా అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఎక్కడో 80 కిలోమీటర్ల దూరంలోని ఎర్రవెల్లిలో కాకుండా, హైదరాబాద్ నగర నడిబొడ్డున ఉన్న మియాపూర్‌లోనే అమరవీరులకు ఇళ్లు కట్టివ్వాలని సవాల్ విసిరారు. 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ' పేరుతో జరుగుతున్న స్కాంలో భాగస్వాములైతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పారిశ్రామికవేత్తలను ఆయన హెచ్చరించారు. మస్కట్ నుంచి సొంత ఇంటికి రప్పించిన కేటీఆర్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గానికి చెందిన ఓ మహిళకు కేటీఆర్ అండగా నిలిచారు. ఉపాధి పేరుతో మోసపోయి మస్కట్‌లో చిక్కుకున్న ఆమె తన సొంత ఇంటికి చేరుకోవడానికి పూర్తి సాయం అందించారు. ఇంటికి తిరిగొచ్చిన ఆమె.. ఃఖీ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపింది. ఉపాధి కల్పిస్తామని ఓ ఏజెంట్ నమ్మించి మోసం చేయడంతో మస్కట్‌లో చిక్కుకుపోయిన కొడంగల్ నియోజకవర్గానికి చెందిన తుప్పుడు లక్ష్మిని సురక్షితంగా స్వదేశానికి రప్పించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన మాట నిలబెట్టుకున్నారు. నెల రోజుల్లోనే తల్లిని ఇంటికి తీసుకొస్తానని ఆమె కుమారుడు రాజుకు ఇచ్చిన హామీని నెరవేర్చి ఆ కుటుంబంలో ఆనందం నింపారు.తెలంగాణ



సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని గోకఫసల్వాడ గ్రామానికి చెందిన తుప్పుడు లక్ష్మి, భర్త వెంకటప్ప ఉపాధి కోసం ఫిబ్రవరి 27న మస్కట్‌కు వెళ్లారు. కానీ తీరా అక్కడకు వెళ్లిన తర్వాతే ఆమెకు తాను మోసపోయానని అర్థం అయింది. ఆమెకు చెప్పిన పనికి.. అక్కడ జరుగుతున్నదానికి సంబంధమే లేదు. అంతేకాకుండా అక్కడి యజమాని ఆమె పాస్‌పోర్టును స్వాధీనం చేసుకుని లక్ష్మీ స్వదేశానికి తిరిగిరాకుండా అడ్డుకున్నాడు. తనను అక్కడక పంపించిన ఏజెంట్ సాయం చేయాల్సింది పోయి.. తనను తిరిగి రప్పించడానికి 2 లక్షలు డిమాండ్ చేశాడు. ఈ విషయాన్ని లక్ష్మీ ఇంటికి చేరవేసిన తర్వాత ఆమె సిమ్ కార్డులు, వైఫై కూడా యజమానులు నిలిపేశారు. చివరకు పక్కింటి వారి ఇంటర్నెట్ సహాయంతో తన కుమారుడు రాజును సంప్రదించి అక్కడ ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించింది. తల్లి పడుతున్న కష్టాలను చూసి చలించిపోయిన కుమారుడు రాజు సెప్టెంబర్ 29న కేటీఆర్‌ను కలిసి తమ కుటుంబ పరిస్థితిని వివరించారు. స్పందించిన కేటీఆర్ నెల రోజుల్లోనే పాస్‌పోర్టు సమస్యను పరిష్కరించి, తల్లిని సురక్షితంగా స్వదేశానికి తీసుకొస్తానని రాజుకు భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం కేటీఆర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు లేఖ రాయడంతో పాటు అవసరమైన చర్యలు తీసుకున్నారు. దీంతో లక్ష్మి సురక్షితంగా భారత్‌కు తిరిగి చేరుకున్నారు. స్వదేశానికి చేరుకుని కుటుంబ సభ్యులను కలుసుకున్న అనంతరం లక్ష్మి హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను స్వయంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. "నా కొడుకుకు కేటీఆర్ గారు నెల రోజుల్లోనే నిన్ను ఇంటికి తీసుకొస్తానని మాట ఇచ్చారు. అన్న ఇచ్చిన మాట ప్రకారం నన్ను సురక్షితంగా ఇంటికి తీసుకొచ్చారు. నేను, నా కుటుంబం ఎదుర్కొంటున్న కష్టకాలంలో కేటీఆర్ అన్న మాకు అండగా నిలిచారు. ఆయన చేసిన సహాయాన్ని జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను. కేటీఆర్ అన్నకు నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని లక్ష్మి తెలిపారు.

కామారెడ్డి మెడికల్ కాలేజీలో ర్యాగింగ్..

- 14 మంది సీనియర్ విద్యార్థులపై సస్పెన్షన్!

నిజామాబాద్, నవంబర్ 4, : పిల్లలు బాగా చదువుకుని ప్రయోజకులు కావాలని, తాము గర్వపడేలా చేయాలని తల్లిదండ్రులు కోటి ఆశలతో ఉన్నత చదువులు చదివిస్తుంటారు. కానీ కొందరు విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో హద్దు మీరి ప్రవర్తించడంతో సస్పెన్షన్‌కు గురై చిక్కుల్లో ఇరుక్కుంటారు. తాజాగా కామారెడ్డి గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో చోటుచేసుకున్న ర్యాగింగ్ వ్యవహారం వైద్య తీవ్ర కలకలం రేపింది. కామారెడ్డి మెడికల్ కాలేజీలో జూనియర్ విద్యార్థులను మానసికంగా, శారీరకంగా వేధించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 14 మంది సీనియర్ విద్యార్థులపై కాలేజీ యాజమాన్యం క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. ఆరోపణలు, అందుకు ప్రాథమిక సాక్ష్యాలు జత కావడంతో నలుగురు విద్యార్థులను 6 నెలల పాటు, మరో 10 మందిని 4 నెలల పాటు క్లాస్ రూములకు హాజరు కాకుండా సస్పెండ్ చేసింది. ఒక ర్యాగింగ్ సంఘటనలో ఒకేసారి 14 మంది వైద్య విద్యార్థులపై సస్పెన్షన్ వేటు పడటం మెడికల్ కాలేజీలలో హాట్ టాపిక్‌గా మారింది. అటు బాధిత విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఇటు సీనియర్ విద్యార్థుల తల్లిదండ్రులు సైతం పిల్లల భవిష్యత్ గురించి ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల కిందట కొందరు సీనియర్లు తమను తీవ్రంగా వేధిస్తున్నారంటూ జూనియర్ విద్యార్థులు నేషనల్ మెడికల్ కమిషన్ (ఔఓఅ) యాంటీ ర్యాగింగ్ సెల్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో ర్యాగింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై తక్షణమే స్పందించిన ఎన్ఎంసీ ఉన్నతాధికారులు స్థానిక పోలీసులతో పాటు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చి విచారణకు ఆదేశించారు. కాలేజీ యాజమాన్యం చేపట్టిన అంతర్గత విచారణలో ర్యాగింగ్ జరిగిందని స్పష్టమైన ఆధారాలు దొరకడమే కాకుండా, విచారణలో వీడియో ఆధారాలు కూడా లభించాయి.ఈ వ్యవహారంపై ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో హెచ్ఓడీల ప్రత్యేక సమావేశం నిర్వహించి బాధ్యులైన 14 మంది సీనియర్ విద్యార్థులను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. సస్పెండ్ అయిన వారిలో తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఉన్నారు. ఎన్ఎంసీ నిబంధనల ప్రకారమే కఠిన చర్యలు తీసుకున్నామని, కళాశాలలోగానీ, హాస్టల్‌లోగానీ ర్యాగింగ్‌కు పాల్పడితే సహించేది లేదని ప్రిన్సిపాల్ హెచ్చరించారు

88 ఇద్దరు మైనర్ బాలికలపై లైంగిక దాడి

హైదరాబాద్, నవంబర్ 4, : నగరంలోని మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ సంఘటన వెలుగులోకి వచ్చింది. ఎయిర్ హోస్టెస్ శిక్షణ పొందుతున్న ఇద్దరు మైనర్ బాలికలను నమ్మించి రూముకు తీసుకెళ్లిన ఇద్దరు యువకులు, వారికి బలవంతంగా మద్యం తాగించి లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లాకు చెందిన గణేశ్ అనే యువకుడు డిగ్రీ పూర్తి చేసి, హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలో నివాసముంటూ కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. అతడి ఫ్రెండ్ తరుణ్ కూడా నిజామాబాద్ జిల్లాకు చెందినవాడే కాగా, బాలానగర్‌లో ఒక ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తున్నాడు. నిజామాబాద్ జిల్లాకే చెందిన 17 ఏళ్ల బాలిక ఇంటర్ పూర్తి కావడంతో ఎయిర్ హోస్టెస్ ట్రైనింగ్ కోసం హైదరాబాద్‌కు వచ్చింది. వెస్ట్ శ్రీనివాస్ నగర్ కాలనీలోని ఒక లేడీస్ హాస్టల్‌లో ఉంటూ ఓ ప్రముఖ ఏవియేషన్ సంస్థలో ట్రైనింగ్ తీసుకుంటోంది. దమ్మాయిగూడకు చెందిన మరో 17 ఏళ్ల బాలిక ఎయిర్ హోస్టెస్ కోర్సు చేస్తూ ఆ యువతితోనే హాస్టల్‌లో కలిసి ఉంటోంది. గణేశ్‌కు తమ ప్రాంతానికి చెందిన బాలికతో గతంలోనే పరిచయం ఉంది. వీరిద్దరూ ఒకే కాలేజీలో చదివారని తెలుస్తోంది. ఆదివారం రాత్రి 11.30 గంటలకు గణేశ్, తరుణ్ కలసి బాలానగర్‌లో పార్టీ ఉందంటూ ఆ ఇద్దరు బాలికలను నమ్మించి కారులో రూముకు తీసుకెళ్లారు. అక్కడ వారికి బలవంతంగా మద్యం తాగించారు. అనంతరం ఆ ఇద్దరు యువకులు ఆ మైనర్ బాలికలపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ఫ్రెండ్ అని నమ్మి వెళితే తమకు జరిగిన దారుణంపై మైనర్ బాలికలు ఫిర్యాదు చేయడంతో మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితులపై పోక్సో చట్టంతో పాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు గణేశ్, తరుణ్‌లను అదుపులోకి తీసుకున్నారు. తెలిసిన వ్యక్తులు అయినప్పటికీ కొన్నిసార్లు జాగ్రత్తగా ఉండాలని, అప్రమత్తంగా ఉండకపోతే కీచకులు రెచ్చిపోయే అవకాశం ఉందని పోలీసులు సూచించారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో కెరీర్ కోసం వారి పిల్లలను నగరాలకు పంపిస్తుంటారని, తమకు అవగాహన లేకుండా చేసే చిన్న విషయాలు సైతం జీవితాలను తలకిందులు చేస్తాయన్నారు. మైనర్ల జోలికి వస్తే కఠినమైన పోక్సో కేసు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, వీటిలో ఇరుక్కుని జీవితాలు నాశనం చేసుకోకుండా బుద్ధిగా ఉండాలని యువకులను పోలీసులు హెచ్చరించారు.

చంద్రబాబుకు మోడీ ఫోన్

విజయవాడ, నవంబర్ 4, : వరుస తుపాన్లతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు అండగా నిలుస్తామని కేంద్రం భరోసా ఇచ్చింది. వారం రోజుల వ్యవధిలో 'అర్నబ్', 'మురసు' తుపాన్లు రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ నేడు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫోన్ చేసి తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా తుపాన్ల ప్రభావం, వాటి వల్ల జరిగిన నష్టం గురించి చంద్రబాబు ప్రధానికి వివరించారు. భారీ వర్షాలు, బలమైన గాలుల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల రంగాల్లోనూ భారీ నష్టం వాటిల్లిందని, రాష్ట్రాన్ని ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తగిన సహాయం అందించాలని కోరారు. దీనిపై స్పందించిన ప్రధాని మోదీ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలను ప్రశంసించారు. నిరంతర అప్రమత్తతతో తుపాను సవాళ్లను సమర్థంగా ఎదుర్కొన్నారని చంద్రబాబును అభినందించారు.అంతకుముందు ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాయడంతో పాటు ఫోన్‌లోనూ మాట్లాడారు. మంగళవారం ఒక్కరోజే రెండుసార్లు అమిత్ షాతో మాట్లాడిన చంద్రబాబు, ఒక తుపాను నుంచి కోలుకోకముందే మరో తుపాను రావడం వల్ల పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారిందని వివరించారు. 'మురసు' తుపాను వల్ల రాష్ట్రంలో ప్రాథమికంగా రూ.343.95 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా వేశామని తెలిపారు. ఇందులో సుమారు 94 శాతం నష్టం ఒక్క వ్యవసాయ రంగంలోనే జరిగిందని పేర్కొన్నారు.ఏడు జిల్లాల్లోని 465 గ్రామాల్లో 50,473



హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, దీనివల్ల 69,828 మంది రైతులు నష్టపోయారని సీఎం వివరించారు. దెబ్బతిన్న పంటల్లో 45,900 హెక్టార్ల వరి పంట ఉందని, ఒక్క వ్యవసాయ రంగంలోనే ప్రాథమిక నష్టం రూ.324.22 కోట్లుగా ఉందని తెలిపారు. ముఖ్యంగా బాపట్ల, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఉద్యాన పంటలతో సహా పంట నష్టం తీవ్రంగా ఉందని పేర్కొన్నారు.తుపాన్ల హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ), రియల్-టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్)లను అప్రమత్తం చేశామని చంద్రబాబు తెలిపారు. సహాయక చర్యల కోసం 11 ఎస్‌డీఆర్ఎఫ్, 13 ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని, ప్రభావిత జిల్లాల్లో 480 పాఠశాలలను పునరావాస కేంద్రాలుగా మార్చి, 12,230 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని కేంద్రానికి వివరించారు.

కొలంబొ పోర్టులో నిలిచిపోయిన 150కి పైగా మిర్చి కంటైనర్లు మిర్చి రైతులు, ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యను పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రంగంలోకి దిగారు. శ్రీలంకలోని కొలంబో పోర్టులో నిలిచిపోయిన మిర్చి కంటైనర్ల సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు బుధవారం ఆయన లేఖ రాశారు. తక్షణమే జోక్యం చేసుకుని ఈ సంక్షోభానికి ముగింపు పలకాలని విజ్ఞప్తి చేశారు.చైనా, బంగ్లాదేశ్, ఇండోనేసియా, థాయ్‌లాండ్, సింగపూర్ వంటి దేశాలకు ఎగుమతి కావాల్సిన 150కి పైగా మిర్చి కంటైనర్లు కొలంబో పోర్టులో చిక్కుకుపోయాయని ముఖ్యమంత్రి తన లేఖలో వివరించారు. ఈ కంటైనర్లలోని మిర్చిలో తేమ శాతం నిర్దేశిత పరిమితి కంటే ఎక్కువగా ఉందని చెబుతూ, ఆయా దేశాలు వాటిని స్వీకరించేందుకు నిరాకరిస్తున్నాయని తెలిపారు. దీనివల్ల సుమారు రూ.60 కోట్ల విలువైన సరుకు ఎక్కడికీ కదలకుండా పోర్టులోనే నిలిచిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ కంటైనర్ల నిలిపివేత కారణంగా.. మిర్చి పండించిన రైతులు, ఎగుమతిదారులు తీవ్ర ఆర్థిక నష్టాలను చవిచూస్తున్నారని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో వారిని గట్టెక్కించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. సంబంధిత దేశాల ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపి, ఈ కన్సైన్‌మెంట్లను స్వీకరించేలా ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరించి, రైతులకు, ఎగుమతిదారులకు ఊరట కల్పించాలని లేఖలో కోరారు. ఈ వ్యవహారంపై కేంద్రం నుంచి సానుకూల స్పందన వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ఆశిస్తోంది.

మున్సిపాలిటీలు, నగర పంచాయతీల చైర్‌పర్సన్ విజేతలు..

విజయవాడ, నవంబర్ 4, : ఏపీలో 87 మున్సిపల్, నగర పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు పూర్తయ్యింది. మొత్తం 87 స్థానాల్లో 17 ఏకగ్రీవం అయ్యాయి.. 70 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 67 స్థానాల్లో కూటమి విజయం సాధించింది. మూడుచోట్ల వైఎస్సార్‌సీపీ గెలుపొందింది. నందికొట్కూరు, బేతంచర్ల, నాయుడపేటలో వైఎస్సార్‌సీపీ ఛైర్‌పర్సన్ అభ్యర్థులు విజయం సాధించారు. మిగిలిన అన్ని చోట్లా కూటమి అభ్యర్థులు గెలుపొందారు...మొత్తం 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఛైర్‌పర్సన్ స్థానాలకు సంబంధించి 17చోట్ల కూటమికి ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 70 ఛైర్‌పర్సన్ స్థానాల్లో టీడీపీ నుంచి 49చోట్ల, జనసేన పార్టీ నుంచి 17 చోట్ల, బీజేపీ నుంచి నాలుగు స్థానాల్లో అభ్యర్థులు పోటీ చేశారు. ఇక వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు 70 చోట్ల పోటీ చేశారు. 13 కార్పొరేషన్ల

జిల్లాల వారీగా మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఛైర్‌పర్సన్‌లుగా గెలుపొందిన అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి..

1) శ్రీకాకుళం జిల్లా- ఇచ్ఛాపురం (ఆసి లీలారాణి-టీడీపీ), పలాస-కాశీబుగ్గ (వజ్జ గంగా భవాని-టీడీపీ)

2) విజయనగరం జిల్లా- బొబ్బిలి (రాంబార్కి రేణుకాదేవి స్వప్న-టీడీపీ), నెల్లిమర్ల (అప్పలనాయుడు లెంక-ఇండిపెండెంట్)

3) అల్లూరి సీతారామరాజు జిల్లా- (మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు లేవు)

4) పార్వతీపురం మన్యం జిల్లా- పాలకొండ (పల్లా విజయనిర్మల-జనసేన పార్టీ), పార్వతీపురం (బెలగాం కరుణ-టీడీపీ-ఆధిక్యం) , సాలూరు (గొర్ల విజయకుమారి-జనసేన పార్టీ)

5) విశాఖపట్నం జిల్లా- (మేయర్ ఒక్కటే, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు లేవు)

6) అనకాపల్లి జిల్లా-నర్సీపట్నం (చింతకాయల పద్మావతి-టీడీపీ), యలమంచిలి (పిళ్లా రమాకుమారి-బీజేపీ)

7) పోలవరం జిల్లా- (మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు లేవు)

8) డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా- రామచంద్రాపురం (మేడిశెట్టి శేషారావు-టీడీపీ), ముమ్మిడివరం (గుబ్బల గంగా రత్నభవాని జనసేన పార్టీ), అమలాపురం (నల్లా శ్రీధర్-జనసేన పార్టీ)

9) కాకినాడ జిల్లా-గొల్లప్రోలు (కడారి తమ్మయ్య నాయుడు-జనసేన పార్టీ), పిఠాపురం (దానం లాజర్ బాబు-జనసేన పార్టీ), సామర్లకోట (పిట్టా జానకి రామారావు-జనసేన పార్టీ), ఏలేశ్వరం (యార్లగడ్డ అక్షిత-టీడీపీ), పెద్దాపురం (రాజా సూరిబాబు రాజు-టీడీపీ), తుని (శరగణం శ్రీలత జనసేన పార్టీ)

10) తూర్పు గోదావరి జిల్లా- కొవ్వూరు (కంఠమని విజయలక్ష్మి-టీడీపీ), మండపేట (వేగుళ్ల అజయ్‌కుమార్-టీడీపీ), నిడదవోలు (మురాల జ్యోతి-జనసేన పార్టీ)

11) పశ్చిమ గోదావరి జిల్లా- ఆకివీడు (షేక్ నిలోఫర్-టీడీపీ), నరసాపురం (కొత్తపల్లి శైల-జనసేన పార్టీ)

12) ఏలూరు జిల్లా- జంగారెడ్డి గూడెం (రొంగల అనూష-టీడీపీ), నూజివీడు (బర్రె ఇళయరాజా-టీడీపీ)

13) కృష్ణా జిల్లా- పెడన (నాగలింగ జ్యోత్స్న రాణి-జనసేన పార్టీ), ఉయ్యూరు (చేదుర్తిపాటి ప్రవీణ్‌కుమార్-టీడీపీ)

14) ఎన్టీఆర్ జిల్లా- జగ్గయ్యపేట (నరేంద్రుల వినీత-టీడీపీ), నందిగామ (శాఖమూరు వంశీధర్-టీడీపీ, కొండపల్లి (కన్నెగంటి అమూల్య- టీడీపీ), తిరువూరు (పసుపులేటి మాధవి-జనసేన పార్టీ)

15) గుంటూరు జిల్లా- తెనాలి (తోటకూర వెంకటరమణారావు-జనసేన పార్టీ)

16) పల్నాడు జిల్లా-మాచర్ల (యనుముల సుష్మ-టీడీపీ), పిడుగురాళ్ల (షేక్ బాబావలీ-టీడీపీ), సత్తెనపల్లి (మారెళ్ల రామాంజనేయులు-టీడీపీ) చిలకలూరిపేట (తోట రాజరాజేశ్వరి-జనసేన పార్టీ), దాచేపల్లి (తంగెళ్ల శ్రీనివాసరావు-టీడీపీ), గురజాల (నెలవెల్లి బొల్లయ్య-టీడీపీ), వినుకొండ (చెరుకుంపాలెం షమీమ్ ఖాన్-టీడీపీ)

17) బాపట్ల జిల్లా- చీరాల (కౌంటింగ్ వాయిదా), రేపల్లె (కుర్రా అవర్ణ-టీడీపీ)

18) ప్రకాశం జిల్లా- అద్దంకి (కాకాని అశోక్-టీడీపీ), చీమకుర్తి (సుధాకర్ శిద్దా-టీడీపీ), దర్శి (దారం సుబ్బారావు-జనసేన పార్టీ)

19) మార్కాపురం జిల్లా- గిద్దలూరు (జాడి వెంకటనారాయణ-బీజేపీ), కనిగిరి (అచ్చాల తిరుపతమ్మ-టీడీపీ), మార్కాపురం (ఎ వా ఎ మల్లికార్జునరావు-టీడీపీ)

20) నెల్లూరు జిల్లా- ఆత్మకూరు (డాక్టర్ బొమ్మిరెడ్డి షకీలా-టీడీపీ), బుచ్చిరెడ్డి పాలెం (దొడ్ల విజయలక్ష్మి-టీడీపీ)

21) తిరుపతి జిల్లా- నాయుడుపేట (తంబిరెడ్డి రాజేశ్వరమ్మ-వైసీపీ), పుత్తూరు (డి.ఎన్.ఏలుమలై-జనసేన పార్టీ), సూళ్లూరుపేట (పిట్ల సుహాసిని-టీడీపీ), వెంకటగిరి (దొంతు శారద-టీడీపీ)

22) చిత్తూరు జిల్లా- కుప్పం (ఎస్ రాజ్‌కుమార్-టీడీపీ), నగరి (ఇ.ఎన్.శ్రీనివాసన్-టీడీపీ), పలమనేరు (రాజ్యలక్ష్మి-టీడీపీ)

23) అన్నమయ్య జిల్లా- మదనపల్లె (గుండ్లపల్లి శ్రీరామ్ చినబాబు-టీడీపీ), పుంగనూరు (నయీం తాజ్-టీడీపీ), రాయచోటి (షేక్ ఖాదర్ వలీ-టీడీపీ)

24) కడప జిల్లా- బద్వేల్ (డాక్టర్ సోమేసుల దివ్యతేజ-టీడీపీ), జమ్మలమడుగు (చదిపిరాళ్ల జ్యోతి-టీడీపీ), కమలాపురం (జి. స్వప్న దివాకర్‌రెడ్డి-టీడీపీ), మైదుకూరు (ధనపాల జగన్‌మోహన్-టీడీపీ), ప్రొద్దుటూరు (నంద్యాల రాఘవరెడ్డి-టీడీపీ), పులివెందుల (టి.గీతాకుమారి-టీడీపీ), రాజంపేట (డాక్టర్ దొంతం గాయత్రి-టీడీపీ), యర్రగుంట్ల (గోర్ల మధులత-బీజేపీ)

25) అనంతపురం జిల్లా- గుంతకల్లు (యశోద-టీడీపీ), కళ్యాణదుర్గం (బుట్నా లక్ష్మి-టీడీపీ), గుత్తి (తమిళ సెల్వి-టీడీపీ), రాయదుర్గం (టంకశాల హనుమంతు-టీడీపీ), తాడిపత్రి (ఎర్రగుడి రేష్మా పర్వీన్-టీడీపీ)

26) శ్రీ సత్యసాయి జిల్లా- ధర్మవరం (పరిసే సుధాకర్-టీడీపీ), మడకశిర (గుండుమల శారద-జనసేన పార్టీ), పెనుకొండ (ఎ.త్రివేంద్రమూర్తి-టీడీపీ), పుట్టపర్తి (ఎం.ఈశ్వర్-జనసేన పార్టీ), హిందూపురం (పి.ఎస్.మంజునాథ్-టీడీపీ) కదిరి (షేక్ ఆర్షియాభాను-టీడీపీ)

27) కర్నూలు జిల్లా- ఆదోని (స్వప్న నాయకర్-జనసేన పార్టీ రెబల్), గూడూరు (డామం సునీతాబాయి-బీజేపీ), ఎమ్మిగనూరు (మాచాని సునీత-టీడీపీ)

28) నంద్యాల జిల్లా- ఆళ్లగడ్డ (ఎస్.అనీషా-టీడీపీ), ఆత్మకూరు (ఆవుల గోవిందరాజులు-టీడీపీ), బేతంచెర్ల (దూదేకుల దస్తగిరి-వైసీపీ), డోన్ (కోట్ల సుజాతమ్మ-టీడీపీ), నందికొట్కూరు (ఎస్.ఫాతిమా బీ-వైసీపీ), నంద్యాల (పోతుగంటి బాబన్-టీడీపీ)

ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన..

- **సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**
- **ఇద్దరు పిల్లల నిబంధనపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**
- **సంతానోత్పత్తి రేటు 2.1 కంటే దిగువకు తగ్గినట్లు గుర్తుచేసిన కోర్టు**
- **వృద్ధుల జనాభా పెరుగుదలపై కోర్టు ఆందోళన**
- **మూడో సంతానంతో అనర్హతకు గురైన మాజీ సర్పంచ్‌కు ఊరట**




న్యూఢిల్లీ : ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఇద్దరు పిల్లలకు మించి ఉండకూడదనే నిబంధన ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతవరకు సమంజసమని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దేశంలో సంతానోత్పత్తి రేటు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో ఇద్దరికి మించి పిల్లలున్నవారిని స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హులుగా ప్రకటించే చట్టాలను పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. గత రెండు దశాబ్దాల్లో దేశ జనాభా పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని బుధవారం విచారణ సందర్భంగా ధర్మాసనం పేర్కొంది. ప్రస్తుతం భారతదేశ మొత్తం సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) 2.1 అనే ప్రత్యామ్నాయ స్థాయి కంటే దిగువకు పడిపోయిందని గుర్తుచేసింది. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే దశాబ్దాల్లో వృద్ధుల జనాభా పెరిగే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఇద్దరికి మించి పిల్లలున్నవారు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించడం ఇప్పటికీ అవసరమా? అని ప్రశ్నించింది. మహారాష్ట్రలోని కాకోడా గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ మంగళ భీమ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. మూడో సంతానం జన్మించడంతో ఆమెను ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హురాలిగా ప్రకటించారు. ఆమె అప్పీల్‌ను అనుమతించిన సుప్రీంకోర్టు, అనర్హత నిర్ణయాన్ని రద్దు చేసింది. ఇదే అంశంపై 2003లో వెలువడిన జావేద్ వర్సెస్ హర్యానా రాష్ట్రం తీర్పును కూడా సుప్రీంకోర్టు పునఃపరిశీలనకు స్వీకరించింది. ఆ తీర్పును విస్తృత ధర్మాసనానికి నివేదించింది. హర్యానా పంచాయతీరాజ్ చట్టం-1994 ప్రకారం ఇద్దరికి మించి పిల్లలున్నవారు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులని అప్పట్లో ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం సమర్థించింది. 2003లో ఆ తీర్పు వెలువడినప్పుడు దేశంలో ఒక్కో మహిళకు సగటున ముగ్గురు పిల్లలు ఉండేవారని, జనాభా నియంత్రణ ప్రధాన విధానపరమైన అంశంగా ఉండేదని ప్రస్తుత ధర్మాసనం గుర్తుచేసింది. ఇప్పుడు పరిస్థితులు మారినందున ఈ నిబంధనలు రాజ్యాంగబద్ధంగా కొనసాగాలా? లేదా? అన్నది విస్తృత ధర్మాసనం తేల్చనుంది. అయితే, ఇద్దరు పిల్లల నిబంధనను దేశవ్యాప్తంగా రద్దు చేసినట్లు సుప్రీంకోర్టు ప్రకటించలేదు.

రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు సజావుగా నిర్వహించలేదు

- అంబటి రాంబాబు

హైదరాబాద్ : మాజీ మంత్రి, వైకాపా నేత అంబటి రాంబాబు బుధవారం హైదరాబాద్ ఈడీ అధికారులముందు హజరయ్యారు. తరువాత మీడియాతో మాట్లాడారు. ఏపీ లిక్కర్ రవాణా కేసులు ఈడి నన్ను విచారించింది. నా నియోజకవర్గ అనుచరులు మర్రి సుబ్బారెడ్డి, రాయపాటి పురుషోత్తం కు సబ్ కాంట్రాక్టులు, వాసుదేవరెడ్డి తో మాట్లాడి ఇప్పించానని



అన్నారు. తనకు ఈ లిక్కర్ స్కాం కు ఎలాంటి సంబంధం లేదు. ఈడి అధికారులకు ఆధార్ పాన్ కార్డ్ వ్యక్తిగత వివరాలను అందజేశాను. ఈడి ఎప్పుడు విచారణకు ఆదేశించిన నేను విచారణకు సహకరిస్తాను. ఏపీలో పులివెందులలో ఎలక్షన్ జరుగుకుండా కూటమి కుట్ర చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు సజావుగా నిర్వహించలేదు. పోలీసులు సమక్షంలోని వైసిపి నాయకుల పై దాడులు చేశారు. గతంలో మేము కూడా దాడులు చేశామని చెప్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో మాకు 11 సీట్లు వచ్చాయి. కూటమికి కూడా మా లాంటి పరిస్థితే భవిష్యత్తులో రాబోతుందని అన్నారు.

ఔట్ సోర్సింగ్ టీచర్ల ఆందోళన


హైదరాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ వొకేషనల్ టీచర్లు తమ పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ లకడీకాపూల్‌లోని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. గత పది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 వేల మంది వొకేషనల్ టీచర్లుగా విధులు నిర్వహిస్తున్నామని, నెలల తరబడి జీతాలు అందక కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతోందని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, విద్యా సంవత్సరానికి 12 నెలల పాటు పూర్తి స్థాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏళ్లుగా విద్యార్థులకు వృత్తి విద్యలో శిక్షణ అందిస్తున్న తమ సేవలను ప్రభుత్వం గుర్తించి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమే స్పందించి పెండింగ్ వేతనాలను విడుదల చేయకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

చింతగూడెం వద్ద రైతుల అందోళన

మంచిర్యాల : కడెం ప్రాజెక్టు నుండి సాగునీటిని అధికారులు నిలిపివేయడంతో రైతులు రోడెక్కారు. జన్నారం మండలం చింతగూడెం వద్ద జాతీయ రహదారిపై ధర్నాకు రైతన్నలు దిగారు. వెంటనే నీటిని విడుదల చేసి వరి పంటను కాపాడాలని డిమాండ్ చేసారు. దాంతో ఇరువైపులా భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీటిని తాగునీటి కోసం వినియోగించాలని అధికారులు సాగునీటిని నిలిపివేసారు.

బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డికి 'టిడబ్ల్యూజెఎఫ్' నాయకుల మర్యాదపూర్వక సన్మానం



హైదరాబాద్, నవంబర్ 4 విజన్ ఆంధ్ర ప్రతినిధి : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) బాలానగర్ మండల నూతన కమిటీ ప్రతినిధులు మంగళవారం బాలానగర్ ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజెఎఫ్ బాలానగర్ మండల ముఖ్య సలహాదారు గోవర్ధన్ రెడ్డి, కన్వీనర్ నర్సింగ్ రావు కమిటీ నూతన సభ్యులను ఏసీపీకి పరిచయం చేశారు. అనంతరం యూనియన్ చేపడుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, జర్నలిస్టుల హక్కుల సాధనతో పాటు సమాజానికి జర్నలిజం ద్వారా అందిస్తున్న సేవలు, యూనియన్ ప్రధాన లక్ష్యాలను ఏసీపీకి వివరించారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పూర్తి సహకారం: గోవర్ధన్ రెడ్డి

ఈ సందర్భంగా టిడబ్ల్యూజెఎఫ్ ప్రతినిధులు మాట్లాడుతూ... బాలానగర్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు, పోలీసు శాఖ చేపడుతున్న ప్రజా ఉపయోగ కార్యక్రమాలకు పాత్రికేయుల తరఫున ఎల్లప్పుడూ పూర్తి సహకారం, మద్దతు అందిస్తామని హామీ ఇచ్చారు. ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి నూతనంగా ఎన్నికైన టిడబ్ల్యూజెఎఫ్ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో పోలీసు, మీడియా వ్యవస్థలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి, శాంతిభద్రతల రక్షణకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజెఎఫ్ ఈసీ సభ్యులు చైతన్య రెడ్డి, రవి కుమార్, ఆర్.కె. పటేల్, విష్ణు చారి, పవన్ కుమార్, పీటర్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కళలకు నిలయం ఇందూరు

- జిల్లా స్థాయి యువజనోత్సవంలో ఎమ్మెల్యే ధన్ పాల్...





నిజామాబాద్ నవంబర్04:(విజన్ ఆంధ్ర) కళలకు, క్రీడలకు నిలయంగా ఇందూరు నిలుస్తోందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. మేరా యువ భారత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం యువతను అనేక రకాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. ప్రధానంగా " మై భారత్ " పేరుతో యువతలో నాయకత్వ లక్షణాలు, సామాజిక సేవాభావం పెంపొందించేలా తీర్చిదిద్దుతుందన్నారు. యువతలో విద్యా, నైపుణ్యం, క్రీడా స్ఫూర్తి, సామాజిక బాధ్యత, దేశభక్తి వంటి లక్షణాలు ఉండాలన్నారు. ఇటువంటి పోటీల ద్వారా ఈ లక్షణాలు అలవడుతాయన్నారు. క్రీడాకారులకు యువ కళాకారులకు తన వంతు సహాయం తన ట్రస్టు ద్వారా ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఇందూరులో పెండింగ్లో ఉన్న కళాభారతి, క్రీడా స్టేడియాలను పూర్తి చేయడమే తన లక్ష్యమన్నారు. ఇప్పటికే అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. అలాగే జిల్లా స్థాయిలో గెలుపొందిన వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి ఇందూరు పేరును నిలబెట్టాలన్నారు. అలాగే యువత డ్రగ్స్ కి, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ కళల్లో రాణించాలన్నారు. అనంతరం ఆయా అంశాల్లో గెలుపొందిన యువతీ యువకులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి రమేష్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి పవన్ కుమార్, తెలంగాణ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ అపర్ణ, బాలభవన్ సూపరింటెండ్ ఉమాబాల, న్యాయ నిర్ణేతలు పుష్ప, శ్వేతా రెడ్డి, సిర్ప లింగం, కోకిల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కరవు కష్టాల నుంచి రైతన్నను గట్టెక్కించండి

రాయలసీమ, ఇతర ప్రాంతాలు ఎల్ నినో ప్రభావంతో తీవ్ర కరవు కోరల్లో చిక్కుకున్నాయి" అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది సాధారణం కంటే అత్యంత తక్కువ వర్షపాతం నమోదు కావడం వల్ల ఖరీఫ్ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని, సాగునీటితో పాటు తాగునీరు, పశుగ్రాసానికి కూడా తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. దేశంలోనే రెండో అత్యల్ప వర్షపాతం నమోదైన ప్రాంతంగా అనంతపురం జిల్లా నిలిచిన విషయాన్ని ఆయన బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 412 మండలాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించామని, పంట నష్టాలపై పూర్తిస్థాయి అంచనాలతో వారం రోజుల్లో కేంద్రానికి నివేదిక సమర్పిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

వ్యవసాయానికి అండగా కీలక పథకాల విస్తరణ


కరవు పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ఉపాధిని, వ్యవసాయాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి కొన్ని కీలక ప్రతిపాదనలు చేశారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి క్షేత్రస్థాయిలో మానవ వనరుల అవసరం ఎక్కువగా ఉంటుందని, ఈ నేపథ్యంలో 'వీబీ జీ రామ్ జీ' పథకం కింద పనిదినాలను 200 రోజులకు పెంచాలని కోరారు. ఈ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానించడం ద్వారా రైతులకు కూలీల కొరత తీరడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని సూచించారు. కరవు కారణంగా రైతుల ఆదాయం పూర్తిగా పడిపోయిందని, గతంలో తీవ్ర కరవు వచ్చినప్పుడు రాయలసీమలో పది ఎకరాల రైతులకు కూడా రేషన్ కార్డులు ఇచ్చి ఆదుకున్నామని గుర్తుచేశారు. అదే తరహాలో ప్రస్తుతం అర్హులైన కరవు బాధిత కుటుంబాలకు 'డ్రాట్ కార్డులు' జారీ చేసే అంశాన్ని పరిశీలించి, కేంద్ర సహకారంతో నిత్యావసరాలను సబ్సిడీపై అందించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు, రైతుల వ్యవసాయ రుణాలను రీషెడ్యూల్ చేసేందుకు కేంద్రం తోడ్పాటునందించాలని కోరారు.

జల్ జీవన్ మిషన్‌తో శాశ్వత పరిష్కారం

వర్షాభావంతో భూగర్భ జలమట్టాలు ప్రమాదకరంగా పడిపోయాయని, కొత్తగా ఎన్ని బోర్లు వేసినా నీళ్లు పడటం లేదని ముఖ్యమంత్రి తెలిపారు. కేవలం తాత్కాలిక నీటి సరఫరా చర్యలతో సరిపెట్టకుండా, శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఇందుకోసం 'జల్ జీవన్ మిషన్' (జేజేఎం) పథకాన్ని మరింత విస్తరించి, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి, అనుసంధానం వంటి పనులకు కేంద్రం మద్దతు ఇవ్వాలని కోరారు. పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పంటల బీమా పరిహారాన్ని త్వరగా అందించడం అత్యవసరమని అన్నారు. బీమా క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం లేకుండా, వీలైనంత త్వరగా పరిహారం రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా కేంద్రం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇది రైతులకు తదుపరి పంటకు పెట్టుబడిగా ఉపయోగపడుతుందని వివరించారు. ఈనెల 2, 3 తేదీల్లో కేంద్ర బృందం రెండు టీమ్‌లుగా విడిపోయి కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పర్యటించింది. క్షేత్రస్థాయిలో పంట నష్టాలను పరిశీలించి, రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ నివేదిక, తమ క్షేత్రస్థాయి పరిశీలనల ఆధారంగా 15 రోజుల్లో కేంద్రానికి సమగ్ర నివేదిక సమర్పిస్తామని ఐఎంసీటీ సభ్యులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అందించే సహాయంపై నిర్ణయం తీసుకోనుంది.

పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి


- లింగాల కనకయ్య ముదిరాజ్



కీసర, నవంబర్ 4, విజన్ ఆంధ్ర : పట్టభద్రులు ఓటర్లు గానమోదు చేసుకోవాలని దమ్మాయిగూడ మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు లింగాల కనకయ్య ముదిరాజ్ అన్నారు. యువకులు, మేధావులు, చదువుకున్న వారు ముందుకు వచ్చి ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో డివిజన్ పరిధిలోని పట్టభద్రుల ఓట్లను ఎన్రోల్ చేయించాలని పార్టీ నాయకులను కోరారు.

రంగన్న ఆత్మీయ సమ్మేళనం

- **ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి**
- **కార్యకర్తలకు భరోసానిచ్చిన ఎంపీ చామల, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**
- **పలుఅంశాలను నేతల ముందు ప్రస్తావించిన మండలస్థాయి నేతలు**
- **ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా చర్చిస్తామని చెప్పిన ఎంపీ, ఎమ్మెల్యే**
- **ప్రభుత్వ కార్యక్రమాలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన**
- **ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తం చేయాలని కార్యకర్తలకు ఎంపీ నిర్దేశం**
- **ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని శ్రేణులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి పిలుపు**





ఇబ్రహీంపట్నం, నవంబర్ 4 (విజన్ ఆంధ్ర) : ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి బుధవారం నిర్వహించిన 'రంగన్న ఆత్మీయ సమ్మేళనం' కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త జోష్ నింపింది. ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని బొంగ్లూర్ క్రాస్ రోడ్డు వద్ద ప్రమీదా గార్డెన్స్‌లో జరిగిన ఈ సమ్మేళనానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అభిషేక్‌రెడ్డితో పాటు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు వేలాదిగా తరలివచ్చారు. డప్పులు, డోళ్లతో ఈ సందర్భంగా మల్‌రెడ్డికి కార్యకర్తలు స్వాగతం పలికి, అభిమానాన్ని చాటుకున్నారు. ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ మండల, నియోజకవర్గస్థాయి నేతలు పలుఅంశాలను లేవనెత్తారు. మల్‌రెడ్డి రంగారెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను కొనియాడారు. మల్‌రెడ్డి గెలుపుతోనే ఇబ్రహీంపట్నం నియోజకవర్గ రూపురేఖలు మారిపోయాయని, కోట్లాది రూపాయల నిధులు గ్రామాలకు వస్తున్నట్లు చెప్పారు. నామినేటెడ్ పదవులు, పలు ఇతర అంశాలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఎంపీ, ఎమ్మెల్యేను ఈ సందర్భంగా వారు కోరారు. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... ఏ నాయకుడు కూడా తన కార్యకర్తల కోసం ఆలోచించని రీతిలో మల్‌రెడ్డి చేపట్టిన ఆత్మీయ సమ్మేళనాన్ని ఆయన అభినందించారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు, అవినీతితో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందని, ఈ పరిస్థితుల్లో పాలనాపగ్గాలు చేపట్టిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడిప్పుడే కుదురుకుంటుందని తెలిపారు. అవరోధాలున్నా ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చుతూ, అప్పుల భారం తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలోనే కార్యకర్తల్లో కొంతవరకు నైరాశ్యం ఉన్నట్లు పార్టీ గుర్తించినట్లు చెప్పారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పదవుల అంశంపై ఎమ్మెల్యే మల్‌రెడ్డితో కలిసి, సీఎంతో చర్చిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఎల్‌నినో ప్రభావం ఇంకా మొదలుకాలేదని, ఇప్పటి నుంచే ప్రజలను అప్రమత్తం చేయాలని కార్యకర్తలకు ఆయన సూచించారు.

కార్యకర్తలే నా బలం, బలగం : మల్‌రెడ్డి రంగారెడ్డి

కార్యకర్తలే నా బలం, బలగం అని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. కష్టమొస్తే ఎంత దూరమైనా వచ్చేందుకు సిద్ధమని చెప్పారు. ప్రాధాన్యత మేరకు ఒక్కో కార్యక్రమం చేపడుతూ వస్తున్నామని చెప్పిన ఆయన ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను క్షేత్రస్థాయిలో ఎక్కడికక్కడ ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రతీ కార్యకర్త సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండాలని చెప్పారు. పార్టీ గెలుపు కోసం ఐక్యంగా పనిచేయాలని, కష్టపడి పనిచేసిన వారందరికీ తప్పకుండా గుర్తింపు లభిస్తుందని భరోసానిచ్చారు. రంగన్న ఆత్మీయ సమ్మేళనానికి ఊహించని రీతిలో వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలతో ప్రమీదా గార్డెన్స్ పరిసరాలు కిటకిటలాడాయి. అభిమాన నేతలతో ఫోటోలు దిగుతూ, సన్మాన కార్యక్రమాలతో సాయంత్రందాకా వేదిక సందడిగా కనిపించింది. రంగన్న ఆత్మీయ సమ్మేళనంలో డీసీసీబీ ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, రాష్ట్ర మహిళా నాయకురాలు జయమ్మ, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ ఛైర్మన్ భాస్కరాచారి, సీనియర్ నాయకులు ఈసీ శేఖర్ గౌడ్, పాండురంగారెడ్డి, మహిపాల్, జైపాల్ రెడ్డి, సామ భీంరెడ్డి, దేవిడి వేణుగోపాల్ రెడ్డి, వివిధ మండలాల, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోటే శ్రీశైలం, ఎడ్మ నరేందర్ రెడ్డి, రావణమోని లింగం, కోశిక ఐలయ్య, చెనమోని రమేష్, పల్లె రజినీకాంత్ గౌడ్, గౌస్, దాసు గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రైతులను నిలువునా మోసం చేస్తున్న ఫేక్ మెసేజ్‌లు..

రైతుబంధు డబ్బులు పడ్డాయని నమ్మి బ్యాంకులకు పరుగులు!

మెసేజ్ వస్తే సంబరం..
బ్యాంకులో చూస్తే షాక్..
ఖాతాలో జీరో బ్యాలెన్స్!

- **ఆ ఒక్క లింక్ క్లిక్ చేస్తే మీ జీవిత కష్టార్జితం మాయం!**
- **మేము ఎలాంటి మెసేజ్‌లు పంపలేదు..**
- **రైతులు అప్రమత్తంగా ఉండాలి**
- **తెలంగాణ వ్యవసాయ శాఖ**
- **ఫేక్ మెసేజ్ వస్తే ఏం చేయాలి?**
- **పూర్తి వివరాలు ఇవే**

తెలంగాణ స్టేట్ బ్యూరో, నవంబర్ 04, విజన్ ఆంధ్ర: తెలంగాణ పల్లెల్లో ఇప్పుడు ఒకటే చర్చ. "మీకు రైతుబంధు డబ్బులు పడ్డాయా? మాకు మెసేజ్ వచ్చింది" అని రైతులు ఒకరినొకరు అడుగుతున్నారు. టీ కొట్ల దగ్గర, పొలం గట్ల మీద, బ్యాంకుల ముందు, ఏటీఎం సెంటర్ల దగ్గర ఇదే మాట వినిపిస్తోంది. రైతుబంధు కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్న రైతులకు మొబైల్‌లో మెసేజ్ రాగానే కళ్లలో ఆనందం, ముఖంలో చిరునవ్వు వచ్చింది. కానీ బ్యాంకుకు వెళ్లి పాస్‌బుక్ చూపించగానే ఆ ఆనందం ఆవిరైపోయింది. ఖాతాలో ఒక్క రూపాయి కూడా జమ కాలేదని తేలడంతో రైతులు తీవ్ర నిరాశకు, ఆగ్రహానికి గురవుతున్నారు. ఇది ప్రభుత్వం పంపిన మెసేజ్ కాదు. సైబర్ మోసగాళ్లు రైతుల అమాయకత్వాన్ని, రైతుబంధుపై ఉన్న ఆశను ఆసరాగా చేసుకుని వేస్తున్న కొత్త ఎత్తుగడ. దీనిపై వ్యవసాయ శాఖ ఇప్పటికే స్పష్టమైన హెచ్చరిక జారీ చేసింది. ప్రభుత్వం ఇంకా రైతుబంధు నిధులు విడుదల చేయలేదని, రైతులకు ఎలాంటి మెసేజ్‌లు పంపలేదని అధికారికంగా ప్రకటించింది.

అసలు ఏం జరుగుతోంది?


గత రెండు, మూడు రోజులుగా రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో రైతులకు ఇలాంటి మెసేజ్‌లు వస్తున్నట్లు సమాచారం అందుతోంది. "మీ రైతుబంధు అమౌంట్ రూ. 5,000 మీ ఖాతాలో జమ అయింది", "రూ. 10,000 క్రెడిట్ అయింది", "వివరాల కోసం ఈ లింక్‌పై క్లిక్ చేయండి" అంటూ ఆ మెసేజ్‌లు ఉంటున్నాయి. కొన్ని మెసేజ్‌లలో బ్యాంక్ పేరు, అకౌంట్ నంబర్ చివరి నాలుగు అంకెలు కూడా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. దీంతో అది నిజమైన బ్యాంక్ మెసేజే అని చాలా మంది రైతులు నమ్మేస్తున్నారు. మరికొన్ని మెసేజ్‌లలో "మీ రైతుబంధు పేమెంట్ పెండింగ్‌లో ఉంది, వెంటనే వెరిఫై చేయండి" అంటూ భయపెడుతూ లింక్ పంపుతున్నారు. రైతుబంధు కోసం ఎదురుచూస్తున్న రైతులు ఆ మెసేజ్‌ను చూసి వెంటనే బ్యాంకులకు, కస్టమర్ సర్వీస్ సెంటర్లకు వెళ్తున్నారు. అక్కడ ఖాతా చెక్ చేస్తే డబ్బులు రాలేదని తేలడంతో "ప్రభుత్వం మోసం చేస్తోందా? బ్యాంకు వాళ్లు డబ్బులు తినేశారా?" అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నిజానికి ఇది ప్రభుత్వ తప్పు కాదు, బ్యాంకు తప్పు కాదు. ఇది పూర్తిగా సైబర్ నేరగాళ్ల పని.

ప్రభుత్వం ఏం చెబుతోంది?

ఈ విషయం తమ దృష్టికి రావడంతో తెలంగాణ వ్యవసాయ శాఖ వెంటనే స్పందించింది. "రైతుల ఖాతాల్లో రైతుబంధు నిధులు జమ అయినట్టు వచ్చిన మెసేజ్‌లు తాము పంపలేదు. అలాంటి అనుమానాస్పద మెసేజ్‌లను నమ్మవద్దు" అని స్పష్టంగా ప్రకటించింది. ప్రభుత్వం రైతుబంధు నిధులు విడుదల చేసినప్పుడు అధికారికంగా ప్రకటన చేస్తుందని, జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారుల ద్వారా సమాచారం ఇస్తుందని అధికారులు తెలిపారు. నిధులు నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోనే జమ అవుతాయని, దాని కోసం ఎలాంటి లింక్ క్లిక్ చేయాల్సిన అవసరం లేదని, ఎలాంటి ఓటీపీ చెప్పాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రైతుబంధు నిధులు విడుదల కాకముందే ఇలాంటి ఫేక్ మెసేజ్‌లు రావడం పట్ల అధికారులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మోసాల వెనుక ఉన్న వారిని గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

ఆ లింక్ క్లిక్ చేస్తే ఏం జరుగుతుంది?
అసలు ప్రమాదం ఇక్కడే!

చాలా మంది రైతులు "లింక్ క్లిక్ చేస్తే ఏమవుతుంది, చూద్దాం" అని అనుకుంటారు. కానీ అదే అతిపెద్ద తప్పు అని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆ లింక్ క్లిక్ చేయగానే మీ ఫోన్‌లోకి ప్రమాదకరమైన యాప్ లేదా మాల్‌వేర్ ఇన్‌స్టాల్ అయ్యే అవకాశం ఉంది. ఆ తర్వాత మీరు బ్యాంక్ యాప్ ఓపెన్ చేసినా, ఓటీపీ వచ్చినా అది మోసగాళ్లకు చేరిపోతుంది. మీకు తెలియకుండానే మీ ఖాతాలోని డబ్బులు వేరే ఖాతాలకు బదిలీ అయిపోతాయి. అంతేకాదు, ఆ లింక్‌లో మీ ఆధార్ నంబర్, పట్టాదార్ పాస్‌బుక్ నంబర్, బ్యాంక్ అకౌంట్ నంబర్, ఫోన్ నంబర్ వంటి వివరాలు అడుగుతారు. వాటిని ఇస్తే మీ పేరుతో వేరే చోట లోన్లు తీసుకునే, మోసాలు చేసే ప్రమాదం కూడా ఉంది. ఒకసారి మీ వివరాలు వారి చేతికి వెళ్తే తిరిగి వెనక్కి తీసుకోవడం చాలా కష్టం. ఇప్పటికే దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఇలాంటి పథకాల పేరుతో మెసేజ్‌లు పంపి లక్షల రూపాయలు దోచుకున్న ఘటనలు జరిగాయి. ఇప్పుడు అదే తరహా మోసం తెలంగాణ రైతులపై జరుగుతోందని అధికారులు భావిస్తున్నారు.



గ్రామాల్లో గందరగోళం.. రైతుల ఆవేదన

రైతుబంధు డబ్బుల కోసం రైతులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చుల కోసం ఆ డబ్బులే ఆధారం. అలాంటి సమయంలో డబ్బులు పడ్డాయని మెసేజ్ వచ్చి, బ్యాంకులో లేవని తేలితే ఆ బాధ వర్ణనాతీతం. "అసలు ప్రభుత్వం డబ్బులు వేసిందా, లేదా? మెసేజ్ నిజమా, అబద్ధమా?" అని రైతులు గందరగోళానికి గురవుతున్నారు. కొందరు రైతులు మెసేజ్ చూసి బంధువులకు ఫోన్ చేసి "నీకు కూడా వచ్చిందా?" అని అడుగుతున్నారు. గ్రామాల్లో వాట్సాప్ గ్రూపుల్లో ఈ మెసేజ్‌ల స్క్రీన్‌షాట్లు వైరల్ అవుతున్నాయి. దీంతో గందరగోళం మరింత పెరుగుతోంది.


రైతులు తప్పకుండా గుర్తుంచుకోవాల్సిన 7 విషయాలు

1. రైతుబంధు డబ్బులు పడ్డాయని మెసేజ్ వస్తే ముందుగా బ్యాంక్ బ్యాలెన్స్‌ను అధికారిక యాప్‌లో లేదా బ్యాంకులోనే చెక్ చేసుకోండి. మెసేజ్‌ను మాత్రమే నమ్మకండి.
2. మెసేజ్‌లో వచ్చిన ఏ లింక్‌ను కూడా క్లిక్ చేయకండి. ప్రభుత్వం ఎప్పుడూ లింక్ ద్వారా డబ్బులు వేయదు.
3. ఎవరైనా ఫోన్ చేసి "నేను వ్యవసాయ శాఖ నుంచి మాట్లాడుతున్నా, మీ ఓటీపీ చెప్పండి, మీ బ్యాంక్ వివరాలు చెప్పండి" అని అడిగితే అస్సలు ఇవ్వకండి.
4. మీ ఆధార్ నంబర్, పట్టాదార్ పాస్‌బుక్ ఫోటో, బ్యాంక్ పాస్‌బుక్ ఫోటోలను వాట్సాప్‌లో ఎవరికీ పంపకండి.
5. అనుమానాస్పద మెసేజ్ వస్తే వెంటనే డిలీట్ చేయండి. స్థానిక వ్యవసాయ అధికారికి, గ్రామ వ్యవసాయ సహాయకుడికి తెలియజేయండి.
6. డబ్బులు పోయాయని అనిపిస్తే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 కు ఫోన్ చేయండి. ఆలస్యం చేస్తే డబ్బులు వెనక్కి రావడం కష్టం.
7. మీకు వచ్చిన ఫేక్ మెసేజ్ గురించి పక్క రైతులకు కూడా చెప్పండి. ఒక్కరిని కాపాడితే ఒక కుటుంబాన్ని కాపాడినట్లే.

ప్రభుత్వానికి రైతుల విజ్ఞప్తి

రైతుబంధు నిధులు ఎప్పుడు విడుదల చేస్తారో ప్రభుత్వం స్పష్టమైన తేదీతో ప్రకటించాలని రైతులు కోరుతున్నారు. అలా చేస్తే ఫేక్ మెసేజ్‌లను నమ్మే అవకాశం ఉండదని అంటున్నారు. అలాగే గ్రామాల్లో వ్యవసాయ అధికారుల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, మోసగాళ్లను పట్టుకుని కఠినంగా శిక్షించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రైతుబంధు నిధుల విడుదలపై ప్రభుత్వం త్వరలోనే అధికారిక ప్రకటన చేయనుందని, అప్పటివరకు రైతులు ఎవరి మాటలు నమ్మవద్దని, ఫేక్ మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు మరోసారి సూచిస్తున్నారు. చివరగా ఒక మాట : రైతన్నా, మీ ఫోన్‌కు వచ్చిన ప్రతి మెసేజ్ నిజం కాదు. డబ్బులు పడ్డాయని మెసేజ్ వస్తే సంబరపడకండి, ముందు బ్యాంకులో చెక్ చేసుకోండి. లింక్ క్లిక్ చేయకండి, ఓటీపీ చెప్పకండి. మీ కష్టార్జితాన్ని మీరే కాపాడుకోండి.

సీఈసీ పై కేరళ ప్రభుత్వ విచారణ



తిరువనంతపురం, నవంబర్ 4,: కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై అవినీతి ఆరోపణల నేపథ్యంలో కేరళం ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు అనుమతించింది. 2006లో కేరళం ప్రజాపనుల శాఖ (పీడబ్ల్యూడీ) కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ప్రభుత్వ కాంట్రాక్టు బిల్లులు క్లియర్ చేసేందుకు రూ.2 కోట్లు లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలపై ఈ నిర్ణయం తీసుకుంది.అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17(ఏ) కింద విచారణకు అనుమతించినట్లు రాష్ట్ర హోంమంత్రి రమేశ్ చెన్నితల బుధవారం వెల్లడించారు. ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ బ్యూరో (వీఏసీబీ) చట్ట ప్రకారం తదుపరి చర్యలు చేపడుతుందని చెప్పారు.మలేసియాకు చెందిన ఇంజినీర్ లీ సీ బిన్ నుంచి జ్ఞానేశ్‌కుమార్ రూ.2 కోట్లు డిమాండ్ చేశారంటూ కాంట్రాక్టర్ వీ.ఓ. సాజన్ గతంలో ఆరోపించారు. కేరళ స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్టు (కేఎస్‌టీపీ) పనులు చేపట్టిన పాథిబెల్ సంస్థకు లీ సీ బిన్ అనుబంధంగా పనిచేశారు. ఆ సంస్థకు సాజన్ సబ్ కాంట్రాక్టర్‌గా మెటీరియల్ సరఫరా చేసేవారు.పెండింగ్‌లో ఉన్న బిల్లులను జ్ఞానేశ్‌కుమార్ నిలిపివేసి, వాటిని విడుదల చేయడానికి రూ.2 కోట్లు అడిగారని సాజన్ మీడియాకు వెల్లడించారు. బిల్లులు చెల్లించకపోవడంతో లీ తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారని, ఈ విషయాన్ని తనతో చెప్పుకొన్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం లీ ఆత్మహత్య చేసుకుని మరణించారు.జ్ఞానేశ్‌కుమార్ ప్రస్తుతం సీఈసీగా ఉన్నప్పటికీ, గతంలో పీడబ్ల్యూడీ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఘటనపై విచారణకు ఎలాంటి అడ్డంకి లేదని చెన్నితల స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పులు కూడా విచారణకు ఆటంకం లేదని చెబుతున్నాయని అన్నారు. సీఈసీ పదవికి సంబంధించిన రక్షణ, గతంలో నిర్వహించిన ఇతర పదవుల్లో తీసుకున్న చర్యలకు వర్తించదని వివరించారు.గతంలో జరిగిన విజిలెన్స్ విచారణ జ్ఞానేశ్‌కుమార్‌కు క్లీన్‌చిట్ ఇచ్చేందుకే ఉద్దేశించినట్లు సాజన్ ఆరోపించారు. తాజా అనుమతితో ఈ వ్యవహారంపై మరోసారి విచారణకు మార్గం సుగమమైంది.

డంపింగ్ యార్డును సందర్శించిన కలెక్టర్

- బయో మైనింగ్ ను వేగవంతం చేయాలని ఆదేశం

- రోడ్లపై పశువులను వదిలితే.. కేసులు పెట్టండి

నిజామాబాద్, నవంబర్ 04 :(విజన్ ఆంధ్ర) ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరించే ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. నాగారం శివారులోని డంపింగ్ యార్డును కలెక్టర్ బుధవారం సందర్శించారు. నగర పాలక సంస్థ పరిధిలో రోజువారీగా ఇంటింటికి తిరిగి సేకరించే చెత్తను డంపింగ్ యార్డు వద్ద నిలువ చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెత్తను ఆయా విభాగాల వారీగా వేరు చేస్తూ, ఎరువులు, ఇతర అవసరాల వినియోగం కోసం యంత్రాల సహాయంతో శుద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సగటున ఎంత పరిమాణంలో చెత్తను శుద్ధి చేస్తున్నారు, ఎరువును ఎవరికి అందజేస్తున్నారు తదితర వివరాలను ఆరా తీశారు. ప్రతి రోజు సగటున 600 మెట్రిక్ టన్నుల చెత్తను బయో మైనింగ్ జరుపుతుండగా, దానిని వెయ్యి మెట్రిక్ టన్నులకు పెంచాలని కలెక్టర్ సూచించారు. డంపింగ్ యార్డు ప్రాంతంలో ఖాళీ స్థలాలను గుర్తించి విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, పచ్చదనం పెంపొందించాలని అన్నారు. డంపింగ్ యార్డు ప్రాంతం అంతా కవర్ అయ్యేలా సోలార్ ప్యానెల్స్ తో పని చేసే సీ.సీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, వ్యర్థాల శుద్ధి ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. డంపింగ్ యార్డు ప్రదేశంలోని రోడ్డుకు ఆనుకుని ఇరువైపులా వ్యర్థాలను పోగు చేయకుండా దూరంగా తరలించాలని అన్నారు.

రోడ్లపై పశువులను వదిలితే కేసులు నమోదు చేయండి

రోడ్లపై ఎక్కడబడితే అక్కడ పశువులు సంచరించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. డంపింగ్ యార్డు ప్రాంతంతో పాటు నగరంలోని ప్రధాన రహదారులపై ఆవులు, ఇతర పశువులు ఎక్కడబడితే అక్కడ సంచరిస్తుండడం గమనించిన కలెక్టర్ అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. రోడ్లపై పశువుల సంచారం వల్ల వాహన చోదకులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పశువులు రోడ్లపై సంచరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. రోడ్లపై పశువులను వదిలితే కేసులు నమోదు చేయాలని, జరిమానాలు విధించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

ఎల్బీస్టేడియంలో ఆధునీకరించిన టెన్నిస్ కాంప్లెక్స్ ప్రారంభం

హైదరాబాద్ నవంబర్ 2026 విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్) : హైదరాబాద్ నగరంలోని ప్రతిష్ఠాత్మక ఎల్బీస్టేడియంలో డిపార్ట్మెంట్ ఆఫ్ స్పోర్ట్స్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఆధునీకరించిన టెన్నిస్ కాంప్లెక్స్ ను బుధవారం సాయంత్రం మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్. లాంఛనంగా జ్యోతి ప్రకాశనం చేసి ప్రారంభించారు.ఈ ప్రారంభ కార్యక్రమంలో క్రీడా శాఖ మంత్రివాకిటి శ్రీహరి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని భారతదేశపు స్పోర్ట్స్ క్యాపిటల్ గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలియజేస్తూ, ఖేలో ఇండియా అంత సులభంగా రాలేదని, మన రాష్ట్రానికి తెప్పించే విధంగా ప్రభుత్వం కృషి చేసిందన్నారు. రూ.800 కోట్ల క్రీడల కోసం కేటాయించామని తెలిపారు. సౌత్ కోరియా లో కేవలం 32 ఎకరాల్లో క్రీడాల హబ్ ను ఏర్పాటు చేసారని, కానీ వారు పథకాల పంట పండిస్తున్నారని తెలియజేశారు. మన వద్ద వేలాది ఎకరాల భూమి ఉందిని, క్రీడల్లో రాణించే వారికి ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నాపు. ఉద్యోగాలు కూడా ఇస్తున్నామని తెలిపారు. క్రీడాకారులకు ఆట వల్ల అతర్జాతీయ గుర్తింపు వస్తుందని,



ఎవరి వద్ద నైపుణ్యం ఉంటుందో వాళ్ళు పతకాలు సాధిస్తారన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, తెలంగాణలో క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తోందని, ఖేలో ఇండియా నిర్వహణ బాధ్యతలు తెలంగాణకు రావడం గర్వకారణం అని అన్నారు. ఖేలో ఇండియా క్రీడలను విజయవంతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సిద్ధంగా ఉందని తెలిపారు. సీఎం కప్, పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీ స్థాయిలో క్రీడా పోటీల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.నిరుపయోగంగా ఉన్న స్టేడియాలను తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని తెలుపుతూ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ స్కూల్స్ ద్వారా తెలంగాణను దేశంలోనే స్పోర్ట్స్ హబ్గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. ఖేలో ఇండియా విజయవంతానికి హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా అన్ని శాఖల నుంచి పూర్తి సహకారం అందిస్తామన్నారు. క్రీడా పాఠశాలలు ఉన్న ప్రాంతాల్లోనూ ఖేలో ఇండియా ఈవెంట్లు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్ వంటి క్రీడా పాఠశాలలకు క్రీడా పోటీల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తెలియజేస్తూ, జిల్లా కేంద్రాలకే పరిమితం కాకుండా క్రీడాకారులకు అన్ని ప్రాంతాల్లో అవకాశాలు కల్పించాలని తెలిపారు. చదువుకుంటేనే ఉద్యోగాలు వస్తాయనే అపోహ నుంచి యువత బయటకు రావాలని, క్రీడల్లో ప్రతిభ చూపితే ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్యలో సీట్లు పొందే అవకాశాలు ఉన్నాయని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని, అలాగే క్రీడాకారుల విజయాల వెనుక క్రీడా ఉపాధ్యాయుల కృషి ఎంతో కీలకమని తెలిపారు. క్రీడా ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించి తెలంగాణకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని,ఖేలో ఇండియా నిర్వహణలో తెలంగాణ ఆతిథ్యాన్ని దేశం మొత్తం ప్రశంసించేలా సమష్టిగా కృషి చేద్దాంమని అన్నారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ క్రీడా సలహాదారు జితేందర్ రెడ్డి ,స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వాణి ప్రసాద్ , క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ సోనీ బాలదేవి, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల్ చారి, శంకర్ గీతా కార్పొరేషన్ చైర్మన్, జంగా రాఘవ రెడ్డి ,ఇతర ముఖ్య నేతలు,అధికారులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ ఇంచార్జి చైర్‌పర్సన్‌గా అదనపు కలెక్టర్ రాజాగౌడ్ బాధ్యతల స్వీకరణ

నిజామాబాద్, నవంబర్ 04 :(విజన్ ఆంధ్ర) నిజామాబాద్ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ఇంచార్జి చైర్‌పర్సన్‌గా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాజాగౌడ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. డీసీఎంఎస్ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, రైతులకు సహకార రంగం ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వారికి సూచించారు.

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి.నవంబర్ 4: (విజన్ ఆంధ్ర) : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జరిగిన రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాల రెవెన్యూ సమీక్షా సమావేశంలో శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఎంపీ ఈటెల రాజేందర్ ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి కాలే యాదయ్య శంకరయ్య మనోహర్ రెడ్డి లక్ష్మారెడ్డి మర్రి రాజశేఖర్ రెడ్డి రెవెన్యూ సెక్రెటరీ లోకేశ్ కుమార్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ మను చౌదరి వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మరియు ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులతో కలిసి పాల్గొన్న పిఏసి చైర్మన్ ఆరెక పూడి గాంధీ ఈ సందర్భంగా మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని , అదేవిధంగా మియాపూర్ సర్వే నంబర్ 100 భూములపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రశాంత్ నగర్ కాలనీ లో నివసిస్తున్న నివాసితులు తీవ్ర ఆందోళనకు గురి అవుతున్నారు అని ,మానవతా దృక్పథం తో వారి సమస్యను పరిష్కరించాలని మంత్రుల దృష్టికి పిఏసి చైర్మన్ గాంధీ తెలియచేశారు, ఎన్నో ఏండ్లుగా నివసిస్తున్నారు అని, న్యాయస్థానం తీర్పు ను గౌరవించాల్సిన బాధ్యత మన అందరి పై ఉందని, అమాయక



కుటుంబాలకు న్యాయం జరిగేలా ప్రశాంత్ నగర్ కాలనీ వాసుల సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడం జరిగినది అని పిఏసి చైర్మన్ తెలిపారు ఎల్లమ్మబండ లో గల స.నెం 336 ను సమగ్ర సర్వే చేసి ప్రభుత్వ భూమి ని పరిరక్షించాలని, త్వరితగతిన ఫెన్సింగ్ వేయాలని గౌరవ చైర్మన్ గాంధీ గారు తెలియచేశారు. అదేవిధంగా పేద విద్యార్థుల చదువు కొరకు ఎల్లమ్మబండ లో 4 ఎకరాలను కేటాయించడం జరిగినది అని, ఇప్పటి వరకు ఎటువంటి పనులు జరుగడం లేదు అని, కావున స్థలం కేటాయించి త్వరితగతిన పనులు పూర్తి చేసి పాఠశాల భవనం నిర్మాణం కు సహకరించాలని గౌరవ చైర్మన్ గాంధీ గారు తెలియచేశారు. Sy No 49 నానక్ రామ్ గూడ లో జరిగిన అక్రమ క్రమబద్ధీకరణ పై నిగ్గు తేల్చి అక్రమార్కులపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూమి ని పరిరక్షించాలని,స.నెం 262 గోపన్ పల్లి మరియు 24 సర్వే లో జరిగిన అక్రమ భూ లావాదేవీల పై సమగ్ర విచారణ జరిపి అక్రమార్కుల పై కఠిన చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమి ని పరిరక్షించి, సంక్షేమం మరియు అభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని గౌరవ మంత్రులు, కలెక్టరు ల దృష్టికి తీసుకువెళ్లడం జరిగినది అని గౌరవ చైర్మన్ గాంధీ గారు తెలియచేశారు. అదేవిధంగా 22 ఏ నిషేధిత జాబితాలో ఉన్న కాలనీలను తొలగించి ప్రజలకు ఉపశమనం కలిగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ఇండ్ల ను నిర్మించుకోవడానికి పర్మిషన్ ఇచ్చారు. అపుడే చీజ ఇచ్చారు ,కొన్ని రిజిస్ట్రేషన్లు చేయడం జరిగినది కానీ ఇప్పుడు 22 ఆ జాబితాలో చేర్చడం వలన కాలనీ వాసులు చాలా తీవ్ర ఇబ్బందులకు ,ఆందోళనకు గురి అవుతున్నారు అని , కావున 22 ఏ నుండి తొలగించి రిజిస్ట్రేషన్ లు జరిగేలా చూడాలని గౌరవ చైర్మన్ గాంధీ గారు తెలియచేశారు.

శేరిలింగంపల్లి మండలం పరిధిలోని కాలనీలు గోకుల్ ఫ్లాట్స్, ప్రజయ్ మెగా పోలీస్ అపార్ట్మెంట్స్, మహేంద్ర అశ్విత,సైప్రస్ ఫార్మ్స్ విల్లాస్ , అయ్యప్ప సొసైటీ, రాజరాజేశ్వరి, గోల్డెన్ తులిప్, ఖపీ= ఎస్టేట్,మాధవ హిల్స్,ఓ.యు ప్రొఫెసర్స్ కాలనీ, రాఘవేంద్ర కాలనీ, శ్రీరామ్ నగర్ ఛాదీజ బ్లాక్, ప్రశాంత్ నగర్, ఆనంద్ నగర్, హనుమాన్ నగర్, జూబ్లీ ఎన్క్లవ్ , శారదా నగర్, జయభేరి ఎన్క్లవ్, KSR ఎన్క్లవ్, శంకర్ నగర్, భవానీ పురం వికార్ సెక్షన్, ప్రశాంతి హిల్స్, సురభి కాలనీ మరియు కూకటపల్లి మండలం పరిధిలోని కాలనీలు ఆస్బెస్టాస్ కాలనీ, పాపిరెడ్డి నగర్, ఆల్విన్ కాలనీ, కమల ప్రసన్న నగర్,శంషిగూడ, ఇందిరా హిల్స్, ఎమీ శాతవాహన నగర్, రామ్ నరేష్ నగర్, మిత్ర హిల్స్ , అడ్డగుట్ట, భాగ్యనగర్ కాలనీలలో 22 ఆ సమస్యలు పరిష్కరించాలని గౌరవ మంత్రుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగినది అని గౌరవ చైర్మన్ గాంధీ గారు తెలియచేశారు. గౌరవ మంత్రులు శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు, శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు మాట్లాడుతూ PAC చైర్మన్ గాంధీ గారు తెలియచేసిన అంశాల పైశ సానుకూలంగా స్పందించడం జరిగినది. 22ఏ ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని, ప్రభుత్వ భూములను పరిరక్షిస్తామని, ప్రభుత్వ భూముల పై సమగ్ర విచారణ జరుపాలని కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వడం జరిగినది.

జంతు జనన నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

- జిల్లా వ్యాప్తంగా అన్ని సదుపాయాలు ఒకేచోట కల్పించాలి

- చెత్త వేరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలి

- డంపింగ్ యార్డులో పటిష్ట నిర్వహణ వ్యవస్థ అమలు చేయాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్





వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 4 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో వీధి కుక్కల నియంత్రణకు చేపట్టే జంతు జనన నియంత్రణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం అవసరమైన వైద్య, మౌలిక సదుపాయాలన్నింటినీ ఒకే చోట ఏర్పాటు చేయాలని సూచించారు. బుధవారం నాగవరం శివారులోని జంతు జనన నియంత్రణ కేంద్రం (ఏబీసీ), డంపింగ్ యార్డును ఆయన సందర్శించి అక్కడి నిర్వహణ తీరును పరిశీలించారు. తొలుత జంతు జనన నియంత్రణ కేంద్రంలో వీధి కుక్కలకు నిర్వహిస్తున్న శస్త్రచికిత్సలు, అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సదుపాయాలపై అధికారులను ఆరా తీశారు. ఈ కార్యక్రమాలను సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. అనంతరం డంపింగ్ యార్డును పరిశీలించి చెత్త వేరు చేసే ప్రక్రియ, వ్యర్థాల నిర్వహణ తీరును సమీక్షించారు. తడి, పొడి చెత్తను పద్ధతి ప్రకారం వేరు చేసి, వాటి నిర్వహణను వేగవంతం చేయాలని సూచించారు. డంపింగ్ యార్డులో క్రమబద్ధమైన నిర్వహణకు పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

అగ్నిప్రమాదాల నివారణకు చర్యలు

గతంలో డంపింగ్ యార్డులో జరిగిన అగ్నిప్రమాద ప్రాంతాన్ని కూడా అదనపు కలెక్టర్ పరిశీలించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యర్థాల నిల్వ, నిర్వహణలో భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. యార్డులో నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి సమగ్ర రీసర్వే

- రైతుల భాగస్వామ్యంతో పారదర్శకంగా సర్వే చేపట్టాలి

- పనులను వేగవంతం చేయాలి..

- క్షేత్రస్థాయిలో పరిశీలించిన అదనపు కలెక్టర్ వినోద్ కుమార్



వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 4 (విజన్ ఆంధ్ర) : భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు భూ సమగ్ర రీసర్వే కీలకమని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్ అన్నారు. బుధవారం వనపర్తి మండలం నాచహళ్లి, కొత్తకోట మండలంలోని నాంచారమ్మపేట, పుల్లారెడ్డికుంట గ్రామాల్లో జరుగుతున్న భూ సమగ్ర రీసర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే రికార్డులు, ఇప్పటివరకు పూర్తయిన పనుల పురోగతిని తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. రీసర్వే పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియలో రైతులు, గ్రామస్తులను భాగస్వాములను చేయాలని, ముందస్తు సమాచారం అందిస్తూ వారి సమక్షంలోనే భూముల కొలతలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా భూ యజమానులు తమ భూముల సర్వే సమయంలో క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా హాజరయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. భూ యజమానుల సమక్షంలో సర్వే నిర్వహించడం వల్ల భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా పారదర్శకమైన భూ రికార్డులు రూపొందించవచ్చని తెలిపారు. రీసర్వే పనుల్లో నాణ్యత, పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో వనపర్తి తహసీల్దార్ రమేష్ రెడ్డి, కొత్తకోట తహసీల్దార్ సుభాష్ నాయుడు, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు అక్షరజ్ఞానమే పునాది

- ప్రతి ఒక్కరికీ చదవడం, రాయడం రావాలన్నదే నా ఆకాంక్ష

- ఉదయం, సాయంత్రం గంట చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

- చదువు నేర్చుకునే మహిళకు రూ.5 వేల బహుమతి ప్రకటించిన మంత్రి జూపల్లి



వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 4 (విజన్ ఆంధ్ర) : మహిళలు అక్షరాస్యులైనప్పుడే ఆత్మవిశ్వాసంతో పాటు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మహిళలు విద్యావంతులైతే కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ చదవడం, రాయడం రావాలన్నదే తన ఆకాంక్ష అని తెలిపారు. బుధవారం కొల్లాపూర్ నియోజకవర్గం పానగల్ మండలం తెల్లరాళ్లపల్లి గ్రామంలో నిరక్షరాస్య మహిళలకు చదువు నేర్చుకునేందుకు మంత్రి పలకలు, బలపాలు పంపిణీ చేశారు. వీటి కొనుగోలుకు గతంలోనే తన వంతుగా రూ.10 వేల ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. అక్షరజ్ఞానం అందించే కార్యక్రమం మధ్యలోనే ఆగిపోకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని సూచించారు. ఇందులో భాగంగా గ్రామంలోని మహిళలకు ప్రతిరోజూ ఉదయం గంట, సాయంత్రం గంట చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సర్పంచ్ జంబలయ్యకు సూచించారు. ఉపాధ్యాయులను నియమించి మహిళలకు చదువు నేర్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం తన వంతు సహాయంగా మరో రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందించారు.

చదువుకు వయసుతో సంబంధం లేదు

చదువుకోవడానికి వయసుతో సంబంధం లేదని, ఆసక్తి, పట్టుదల ఉంటే ఎప్పుడైనా అక్షరజ్ఞానం పొందవచ్చని మంత్రి పేర్కొన్నారు. మహిళల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. గ్రామంలో ముందుగా చదవడం, రాయడం నేర్చుకునే మహిళకు రూ.5 వేల నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. మహిళల అక్షరాస్యతకు అందరూ సహకరించాలని మంత్రి కోరారు.

క్రైస్తవ మహిళలపై దాడి ఘటన..


ఇరువర్గాల ఆందోళన

'జై శ్రీరామ్', 'జై జీసస్' నినాదాలతో ఉద్రిక్తత..

లాఠీలతో ఆందోళనకారులను చెదరగొట్టిన పోలీసులు

హైదరాబాద్: బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప సమీపంలోని మారుతీనగర్‌లో ఇద్దరు క్రైస్తవ మహిళలపై దాడి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దాదాపు రెండు నెలల క్రితం బైబిల్ కరపత్రాలు పంపిణీ చేస్తున్న మహిళలపై కొందరు వ్యక్తులు దుర్భాషలాడుతూ దాడికి పాల్పడడంతో మీర్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఇరువర్గాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో మీర్ పేట్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. క్రైస్తవులకు సంబంధించిన వారు, హిందువులు పరస్పరం 'జై జీసస్', 'జై శ్రీరామ్' అంటూ నినాదాలు చేస్తూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఒక్కసారిగా భారీగా జనాలు గుమిగూడటంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మీర్ పేట్ పోలీసులు రంగంలోకి దిగి, లాఠీలతో ఆందోళనకారులను అక్కడి నుంచి చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాట్లను సమీక్షించిన సైబరాబాద్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డా. ఎం. రమేష్



శేరిలింగంపల్లి.అక్టోబర్ 4: (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిపాదిత పర్యటన నేపథ్యంలో, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ నేడు మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సున్నం చెరువు మరియు తమ్మిడికుంట చెరువులను స్వయంగా సందర్శించి పరిశీలించారు. ఈ పర్యటనలో కూకట్‌పల్లి జోన్ డి.సి.పి రితిరాజ్, ఐ.పి.ఎస్, మాదాపూర్ డివిజన్ ఏసిపి సిహెచ్. శ్రీధర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, పి. రమేష్ మరియు ఇతర ట్రాఫిక్ పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలను పరిశీలించిన ఉన్నతాధికారులు, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ మరియు ఇతర అవసరమైన ఏర్పాట్లను సమీక్షించారు. అన్ని శాఖల మధ్య సరైన సమన్వయం ఉండేలా చూసుకోవాలని, ముఖ్యమంత్రి పర్యటన సజావుగా మరియు సురక్షితంగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత పోలీసు సిబ్బందికి మరియు అధికారులకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ తగిన ఆదేశాలు జారీ చేశారు.

కొండగట్టు అంజన్నకు చందనోత్సవం..

- 60 ఏళ్ల తరువాత వేడుకలు

- 16 నుంచి అయిదు రోజుల పాటు ప్రత్యేక పూజలు

- అంజన్న దర్శనం నిలిపివేత.. 21 నుంచి నిజరూపదర్శనం

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

మల్యాల(కరీంనగర్): కొండగట్టు ఆంజనేయస్వామి చందనోత్సవాలకు దేవస్థా నం ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. 60 ఏళ్ల అనంతరం స్వామి వారి చందనోత్సవాన్ని వైభ వంగా నిర్వహించనున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ ఆంజనేయస్వామి రెండు తలలతో ఉంటారు. తూర్పువైపు నారసింహస్వామి, ఉత్తరం వైపు ఆంజ నేయస్వామిగా భక్తులకు దర్శనం ఇస్తుంటారు. విగ్రహంపై ఆరు అంగుళాల మేరకు సింధూరం: ఆంజనేయస్వామి వారికి ప్రతీ మంగళ, శనివారం ఆలయ అర్చకులు సింధూర లేపనం వేయడం ఆన వాయి తీగా వస్తోంది. 60 ఏళ్ల క్రితం కొండ గట్టు ఆంజనేయస్వామికి చందనోత్సవం నిర్వహించారని తెలుస్తోంది. ప్రస్తుతం స్వామి వారి మూలవి రాట్టుపై ఆరు అంగుళాల మేరకు సింధూరం ఏర్పడింది. స్వామి వారి నిజరూప దర్శనం భక్తులకు లభించడం లేదు. దీంతో దేవస్థానం ఆధ్వర్యంలో నవంబరు 16 నుంచి 20 వరకు చందనో త్సవం నిర్వ హించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మొద టి అయిదు రోజుల పాటు మూలవి రాట్టుపై గల సింధూరాన్ని ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తొలగిస్తారు. ఇందుకు చేపట్టే క్రతువుకు అర్చకులు పది రోజుల ముందు నుంచే దీక్షలు స్వీక రిస్తారు. రావి, జువ్వి, మర్రి, మేడి, దరిమి చెట్ల నుంచి కలప సేకరించి వాటితో సింధూరం తొలగి స్తారు. ఈ కార్యక్రమానికి ఇద్దరు పీఠాధిపతులు రానుండగా, యాగశాలలో 50 మంది రుత్వికులతో నిత్యం త్రికుండాత్మక యజ్ఞం నిర్వహిస్తారు. దీంతో పాటు ఆలయ రాజగోపురంపై సుదర్శన చక్రం, కళశ స్థాపనకు



ఏర్పాట్లు చేస్తున్నారు. సింధూరం తొలగిం చిన అనంతరం నవంబరు 21 నుంచి 41 రోజుల పాటు ఆంజనేయ స్వామి నిజరూప దర్శనం కల్పించనున్నారు. సింధూరం తొల గించే అయిదు రోజుల పాటు అంజన్న మూలవిరాట్టు దర్శనం ఉండదని, ఆలయంలోనే ప్రత్యేకంగా కర్ర ఉత్సవమూర్తి, వేంకటేశ్వరస్వామి, మహాలక్ష్మి అమ్మవారి దర్శనాలు మాత్రమే ఉండను న్నాయని దేవస్థానం అధికారులు తెలిపారు. ప్రతి పుష్కరకాలం కోసారి కొండగట్టు ఆంజనేయ స్వామి చందనోత్సవం నిర్వహించాలని భక్తులు కోరు తున్నారు. 60 ఏళ్లకు నిర్వహించడంతో భక్తులు మహా ద్భుత వేడుకను చూడలేకపోతున్నారని, 12 ఏళ్లకో సారి వచ్చే గోదావరి పుష్కరాల వేళ కొండగట్టులో చందనోత్సవం నిర్వహించాలని అంటున్నారు. దీనిపై దేవస్థానం అధికారులు, అర్చకులు ఆగమశాస్త్ర పండి తులతో చర్చలు జరిపి నిర్ణయం తీసుకోవాలని భక్తులు అంటున్నారు.ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం..అంజనారెడ్డి, ఈవో: చందనోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ వేడుకలకు 20 లక్షల రూపాయలు కేటాయించి ఏర్పాటు చేస్తున్నాం. నిజ రూపదర్శనం సమయంలో భక్తులు పోటెత్తే అవకశాలు ఉండడంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. వేడుకలకు పీఠాధిపతులు, ప్రముఖులు హాజరుకానున్నారు.

విజయవాడ కోసం పనిచేస్తా

విజయవాడ, నవంబర్ 4, : విజయవాడ కార్పొరేషన్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకుంది.. మేయర్ అభ్యర్థిగా జనసేన పార్టీ నుంచి పోటీచేసిన వంగవీటి రాధాకృష్ణ గెలిచారు. రాధాకి మొత్తం 2,65,888 ఓట్లు రాగా.. 1,30,872 మెజార్టీ లభించింది. వైఎస్సార్సీపీ అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మికి 1,35,016 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు కు 12,642 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఆయనకు సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీల మద్దతు కూడా తెలిపాయి.. కానీ డిపాజిట్ కూడా దక్కలేదు. తన ఓటమిపై ఏబీ వెంకటేశ్వరరావు స్పందించారు.తనకు ఓటు వేసిన 12,671 మందికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అన్నారు. డబ్బు, కులం, మతంతో సంబంధం లేకుండా నగరంలోని అన్ని ప్రాంతాల వారు ఓటేసి తనను ఆదరించినందుకు ఎప్పటికీ ఋణపడి ఉంటానన్నారు. అందరి ప్రతినిధిగా విజయవాడ ప్రజల సమస్యలను లేవనెత్తుతూ పరిష్కారాల కోసం ప్రయత్నిస్తూనే ఉంటానన్నారు. 'ఈ నా మొట్టమొదటి ఎన్నికల ప్రచారం మరపురాని అనుభూతిని, సాధారణ ప్రజలతో ఇంతకు ముందెప్పుడూ లేని బాంధవ్యాన్ని, ఎంతోమంది కొత్త మిత్రులను, సహచరులను ఇచ్చింది' అంటూ ఆనందం వ్యక్తం చేశారు.తన ఎన్నికల ప్రచారంలో స్వచ్ఛందంగా పాలు పంచుకున్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు ఏబీవీ. ఈ ప్రచారానికి ఆర్థిక సహాయం చేసిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలు స్వచ్ఛందంగా ఇచ్చిన విరాళం వృధా కాకుండా ఖర్చు చేసాము, చేస్తామని, ప్రజలకు పనికొచ్చే, ప్రజలకు అవసరమైన, రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేస్తున్నానన్నారు. మూస, కుమ్మక్కు రాజకీయాలకు భిన్నంగా పారదర్శక, అవినీతి లేని ఆధునిక వ్యవస్థలను నిర్మించడానికి ముందడుగు వేస్తామన్నారు. మన భావి తరాల కోసం, ఈ సుదీర్ఘ ప్రయాణంలో అందరూ కలసి రావాలని కోరుతున్నాను అంటూ ఆయన పోస్ట్ పెట్టారు. అలాగే విజయవాడ మేయర్‌గా ఘన విజయం సాధించిన వంగవీటి రాధాకృష్ణకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఏబీ వెంకటేశ్వరరావు తన పోస్ట్‌లో కొత్త పార్టీ పెడతానని మరోసారి స్పష్టం చేశారు. గతంలో కొత్త పార్టీ గురించి చెప్పిన మాటపై మరోసారి స్పష్టత ఇచ్చారు.



శేరిలింగంపల్లిలో కాంగ్రెస్‌కు భారీ షాక్!

హైదర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డితో సహా వందలాది మంది బీఆర్ఎస్‌లో చేరిక



తెలంగాణ స్టేట్ బ్యూరో విజన్ ఆంధ్ర,నవంబర్ 04, తెలంగాణ భవన్:

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. హైదర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి తన అనుచరులు, వందలాది మంది నాయకులు, కార్యకర్తలతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బుధవారం తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ చేరిక కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారందరికీ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్ వద్ద పండుగ వాతావరణం నెలకొంది. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు తరలివచ్చారు. బీఆర్ఎస్ నాయకులు వారిని ఘనంగా స్వాగతించారు. దామోదర్ రెడ్డి చేరికతో శేరిలింగంపల్లిలో బీఆర్ఎస్ మరింత బలపడినట్లయిందని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. రాబోయే రోజుల్లో ఇంకా పెద్ద సంఖ్యలో చేరికలు ఉంటాయని వారు ధీమా వ్యక్తం చేశారు.

కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు

చేరిక కార్యక్రమంలో మాట్లాడిన కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అడవులు నరికే వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిని చేస్తే ఎలా ఉంటుందో, భూములు అమ్మే బ్రోకర్ రేవంత్ రెడ్డిని సీఎం చేస్తే అలానే ఉందని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల భూములను అమ్మేయడమే ప్రస్తుత ప్రభుత్వం ప్రధాన ఎజెండాగా మారిందని ఆయన ఆరోపించారు. మియాపూర్ భూముల విషయాన్ని ప్రస్తావిస్తూ కేటీఆర్ కీలక విషయాలు వెల్లడించారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో మియాపూర్ భూములను కబ్జా పెడితే ప్రముఖ న్యాయవాదిని పెట్టి కేసు వాదించామని ఆయన గుర్తు చేశారు. ఆ భూములు ప్రభుత్వానివే అని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని చెప్పారు. తీర్పు వచ్చిన వెంటనే రేవంత్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టి ఆ భూములు అమ్మేస్తున్నానని చెబుతున్నారని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన ముఖ్యమంత్రే అమ్మకానికి పెట్టడం సిగ్గుచేటని ఆయన అన్నారు. మియాపూర్‌లో 550 ఎకరాల భూములు వస్తే అమ్మేస్తానని రేవంత్ రెడ్డి అంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. అయితే ఆ భూములను అమ్మకుండా ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలని ఆయన సూచించారు. ఆ 550 ఎకరాల్లో 200 ఎకరాలు పేదలకు ఇండ్లు కట్టించడానికి, 100 ఎకరాలు తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు, మరో 100 ఎకరాలు ఉద్యమకారులకు, మిగిలిన భూమిలో పిల్లల కోసం స్కూల్స్, కాలేజీలు కట్టించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అలా చేస్తే తాము గొప్పగా స్వాగతిస్తామని ఆయన స్పష్టం చేశారు. భూములను అమ్మి సొమ్ము చేసుకోవడం కాదు, పేదలకు పంచడమే నిజమైన పాలన అని ఆయన అన్నారు.

సంవత్సరం లోపల కేసీఆర్ రాబోతున్నాడు

రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం రావడం ఖాయమని కేటీఆర్ జోస్యం చెప్పారు. సంవత్సరం లోపల కేసీఆర్ రాబోతున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి వేసే ఎంగిలి మెతుకులకు ఆశపడి ఎవరైనా పారిశ్రామికవేత్తలు హిల్ట్ పీ స్కాంలో భూములు కొంటే తిరిగి అనుభవిస్తారని ఆయన హెచ్చరించారు. మళ్లీ రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ఇప్పుడు జరుగుతున్న భూదందాలన్నింటికీ చెక్ పెడతామని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న ప్రతి భూ లావాదేవీపై విచారణ జరుపుతామని కేటీఆర్ అన్నారు. పేదల భూములు, ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు కబ్జా చేసిన వారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను మరిచి, వారి పేరుతో రాజకీయాలు చేస్తూ భూములను అమ్ముకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

దామోదర్ రెడ్డి చేరికతో మారిన సమీకరణాలు

దామోదర్ రెడ్డి శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బలమైన నాయకుడిగా పేరుంది. హైదర్‌నగర్ డివిజన్‌లో ఆయనకు మంచి పట్టు ఉంది. కాంగ్రెస్ పార్టీలో ఆయన ఎన్నో ఏళ్లుగా పని చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం, కార్యకర్తలను పట్టించుకోకపోవడం, భూదందాలకు పాల్పడటం వల్లనే తాను బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు దామోదర్ రెడ్డి చెప్పారు. కేసీఆర్ నాయకత్వం, కేటీఆర్ పనితీరు నచ్చి బీఆర్ఎస్‌లో చేరుతున్నానని ఆయన తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం హైదరాబాద్‌లో అత్యంత కీలకమైన నియోజకవర్గాల్లో ఒకటి. ఐటీ కారిడార్, మియాపూర్, చందానగర్, హైదర్‌నగర్ వంటి ప్రాంతాలతో ఈ



నియోజకవర్గం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. గత ఎన్నికల్లో ఇక్కడ బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు జరిగింది. ఇప్పుడు కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడే బీఆర్ఎస్‌లో చేరడం కాంగ్రెస్‌కు పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. ఈ చేరికలు శేరిలింగంపల్లిలో రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చేస్తాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చేరిన నాయకులను కేటీఆర్ పేరు పేరునా పలకరించి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని వివరించాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఇప్పటికీ పూర్తిగా అమలు కాలేదని, రైతు భరోసా, రుణమాఫీ, నిరుద్యోగ భృతి వంటి హామీలు నీటి మూటలయ్యాయని కేటీఆర్ విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్ మోసాన్ని గ్రహించారని, అందుకే పెద్ద ఎత్తున బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని ఆయన అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

విద్యార్థుల అభిప్రాయాలు సేకరించండి

- యూనిఫాంల రంగు, డిజైన్లపై ప్రత్యేక దృష్టి

- యూనిఫాం.. కిట్ల పంపిణీకి ఎస్‌వోపీ రూపొందించండి - ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి





హైదరాబాద్: విద్యార్థులకు అందించిన యూనిఫాంలపై వారినుంచి అభిప్రాయాలు (ఫీడ్ బ్యాక్) సేకరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల పరిధిలోని ప్రభుత్వ వసతిగృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలు, కిట్ల పంపిణీపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. గతంతో పోలిస్తే ఎంతో నాణ్యమైన యూనిఫాంలు, ఆకర్షనీయమైన రంగులు, డిజైన్లతో అందజేశామన్నారు. అయితే, ఆయా రంగులు, డిజైన్లకు సంబంధించి విద్యార్థుల నుంచి అభిప్రాయాలు (ఫీడ్‌బ్యాక్) సేకరించాలన్నారు. అలా చేస్తే ఎక్కువ మంది విద్యార్థులు కోరుకునే రంగులు, డిజైన్లకు భవిష్యత్‌లో ప్రాధాన్యమివ్వచ్చని అన్నారు. యూనిఫాంలతో పాటు టైలు, బెల్టులు, ఐడీ కార్డులు, షూలు, సాక్సులు, ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, కార్పెట్లు, స్కూల్ బ్యాగుల పంపిణీ దాదాపు పూర్తయిందని అధికారులు సీఎంకు తెలియజేశారు. ఒకట్రెండు సంస్థల పరిధిలో కొన్ని వస్తువుల పంపిణీ 95 శాతం వరకు పూర్తయిందని చెప్పారు. ఆ వస్తువుల పంపిణీని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాదికి విద్యార్థులకు అందజేసే యూనిఫాంలు, ఇతర సామగ్రికి సంబంధించి విధి విధానాలను (ఎస్‌వోపీ) రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. విద్యార్థులకు అందజేసే వస్తువుల జాబితా రూపకల్పన, టెండర్లు , సరఫరా, అందజేత వరకు ప్రతిదీ నిర్దేశిత సమయంలో పూర్తవ్వాలని తెలిపారు. పాఠశాలలు తెరిచిన రోజునే మొత్తం వస్తువులు అందేలా ఇప్పటినుంచే కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, రాష్ట్ర గిరిజన, వెనుకబడిన తరగతుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, వివిధ శాఖల అధికారులు షఫీఉల్లా, బాలమాయాదేవి, విజయేందిర బోయి, దివ్య దేవరాజన్, జి.రవి, బి.సైదులు, బీఎం సంతోష్, నవీన్ నికొలస్, సీతా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ పోలీస్‌లో డబుల్ సందడి..

పదోన్నతులతో నూతనోత్సాహం, కన్విక్షన్ రేటు పెంపుపై కీలక సమావేశం!

- పదోన్నతి పొందిన ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐ చిహ్నాలు బహుకరించిన ఎస్పీ జానకి

- పోలీసులు - పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో పనిచేస్తేనే నేరస్తులకు శిక్షలు : ఎస్పీ





తెలంగాణ స్టేట్ బ్యూరో, నవంబర్ 04, విజన్ ఆంధ్ర:

మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం రెండు కీలక కార్యక్రమాలు జరిగాయి. ఒకవైపు పదోన్నతి పొందిన సిబ్బందికి సన్మానం, మరోవైపు నేరస్తులకు శిక్షలు పడే శాతం పెంచేందుకు పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. రెండు కార్యక్రమాల్లోనూ జిల్లా ఎస్పీ శ్రీమతి డి. జానకి, ఐపీఎస్ పాల్గొని కీలక సూచనలు చేశారు.

పదోన్నతితో సిబ్బంది జీవితాల్లో నూతన ఉత్సాహం


జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు ఏఎస్ఐలుగా పదోన్నతి పొందిన సందర్భంగా జిల్లా ఎస్పీ తన ఛాంబర్‌లో వారికి పదోన్నతి చిహ్నాలను బహుకరించారు. డీఎస్పీ కార్యాలయంలో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ 1540 విజయ్ కుమార్ ఏఎస్ఐగా పదోన్నతి పొంది వనపర్తి జిల్లాకు, మహిళా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఎం.ఏ. రషీద్ ఎజ 1613 ఏఎస్ఐగా పదోన్నతి పొంది నారాయణపేట జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో పదోన్నతి అనేది కేవలం హోదాలో మార్పు మాత్రమే కాకుండా, మరింత బాధ్యతతో ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణ, నిజాయితీతో పనిచేస్తూ పదోన్నతులు పొందడం అభినందనీయమని తెలిపారు. నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, బదిలీ అయిన జిల్లాల్లో కూడా మంచి పేరు సంపాదించుకుని పోలీస్ శాఖకు గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఇద్దరు అధికారులకు శుభాకాంక్షలు తెలియజేసి వారి భవిష్యత్ పోలీస్ సేవలు విజయవంతంగా సాగాలని కోరారు.

పోలీసులు - పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో పనిచేస్తేనే శిక్షలు

అదే రోజు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీస్ అధికారులతో ఎస్పీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేసుల దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జిషీట్ల దాఖలు, న్యాయస్థానాల్లో కేసుల విచారణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నేరస్తులకు న్యాయస్థానాల్లో శిక్షలు పడే శాతాన్ని (జశీఅజఅఖీఅశీఅ ఞీవ) పెంచడంలో పోలీస్ శాఖతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. కేసుల దర్యాప్తు దశ నుంచే పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సలహాలు, సూచనలు తీసుకోవడం ద్వారా సాంకేతికంగా, చట్టపరంగా ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా కేసులను సిద్ధం చేయవచ్చని పేర్కొన్నారు. పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పరస్పర సమాచార మార్పిడి చేసుకుంటూ, కేసుల వారీగా సమీక్షించుకుంటూ సమిష్టిగా పనిచేస్తే నేరస్తులకు శిక్షలు పడే అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులపై నేరాలు, పోక్సో కేసులు, తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, బాధితులకు న్యాయం జరిగేలా పకడ్బందీగా ఆధారాలు సమర్పించాలని సూచించారు. కోర్టు విచారణ సమయంలో సాక్షుల హాజరు, సాక్ష్యాధారాల సమర్పణ, కేసుల పురోగతిపై నిరంతరం సమన్వయం కొనసాగించాలని అధికారులకు సూచించారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సేవలను అభినందిస్తూ ఎస్పీ వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. పోలీస్ శాఖకు, ప్రాసిక్యూషన్ విభాగానికి మధ్య ఉన్న సమన్వయాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చీదీ రత్నం, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఱఘా వెంకటేశ్వర్లు, ఱజ=దీ ఱఘా రమణా రెడ్డి, వర్టికల్ ఱఘా బాలాజీ, ఇతర ఘా లు, ఘాఘా లు, ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

నేను శపిస్తే ఎవరూ ఆ శాపం నుంచి తప్పించుకోలేరు

- కేఏ పాల్, ప్రజాశాంతి పార్టీ



హైదరాబాద్ : అమెరికా మిడ్ టర్మ్ ఎన్నికల్లో ట్రంప్ ఓటమితో ప్రపంచానికి మేలు జరుగుతుంది. యుద్ధ పిపాసులుగా ఉండే నేతలకు ఓటమే ఎదురవుతుందని ప్రజాశాంతి పార్టీ అధినేత కెఏ పాల్ అన్నారు. ఇజ్రాయెల్లో నెతన్యాహూ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇరాన్ యుద్ధం ఆపకపోతే మాజీ స్పీకర్గా మారతావు అంటూ స్పీకర్ మైక్ జాస్సన్ను హెచ్చరించాను. కళ్లు నెత్తికెక్కిన రాజకీయ నేతలు ఎవరికైనా ఇదే పరిస్థితి ఎదురవుతుందని అన్నారు. నేటి ప్రపంచంలో ట్రంప్ కంటే పవర్ఫుల్ నేత ఎవరూ లేరు. ఎన్ని బెదిరింపు కాల్స్ వచ్చినా నేను ట్రంప్ తీరును వ్యతిరేకిస్తూ వచ్చాను. ఇది మన దేశంలో ముఖ్యమంత్రులు, నేతలకు కూడా హెచ్చరికే. మతం పేరుతో గొడవలు పెట్టేవారికి ఇదే నా హెచ్చరిక. బైబిల్ పంచినందుకు మహిళలపై దాడి చేస్తే.. వారిని ఇప్పటికీ అరెస్ట్ చేయలేదు. నేను భారత్ కి తిరిగి వస్తా ఒక్కొక్కరి తాట తీస్తా. నేను శపిస్తే ఎవరూ ఆ శాపం నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు.

మురసు తుపాను ప్రభావంతో పల్నాడు జిల్లాలో భారీ వర్షాలు

- చిలకలూరిపేటలో జాతీయ రహదారిపైకి చేరిన వరద నీరు

- విజయవాడలో 10 గంటలుగా కురుస్తున్న వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం

- బుడమేరుకు మళ్లీ వరద వస్తుందని ప్రజల్లో భయాందోళనలు

చిలకలూరిపేట : పట్టణంలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. జాతీయ రహదారిని వరద ముంచెత్తడంతో పాటు, పలుచోట్ల విద్యుత్ తీగలు తెగివడ్డాయి. అయితే, అధికారులు ముందుజాగ్రత్త చర్యగా విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు మరోవైపు, విజయవాడ నగరాన్ని కూడా వర్షం ముంచెత్తింది. గత 10 గంటలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానతో నగరంలోని అనేక కాలనీలు, బస్తీలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. గత అనుభవాల నేపథ్యంలో, బుడమేరు వాగుకు మళ్లీ వరద పోటెత్తుతుందేమోనని స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికార యంత్రాంగం సహాయక చర్యలపై దృష్టి సారించింది.

అమెరికా మధ్యంతర ఎన్నికలు.. సత్తా చాటుతున్న భారత సంతతి అభ్యర్థులు

- అమెరికాలో కాంగ్రెస్‌పై పట్టు కోసం మధ్యంతర ఎన్నికలు

- కీలక పదవుల కోసం బరిలో నిలిచిన అనేకమంది భారత సంతతి నేతలు

- వర్జీనియా నుంచి ప్రతినిధుల సభకు సుహాస్ సుబ్రమణ్యం తిరిగి ఎన్నిక

- ఒహాయో గవర్నర్ రేసులో వెనుకంజలో వివేక్ రామస్వామి

- ఫ్లోరిడాలో పియా దండియా ఆధిక్యం.. పలుచోట్ల ఫలితాలపై ఉత్కంఠ



ఫ్లోరిడా : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవీకాలంలోని చివరి రెండేళ్లలో కాంగ్రెస్‌పై ఎవరికి పట్టు ఉంటుందో తేల్చే మధ్యంతర ఎన్నికల పోలింగ్ మంగళవారం ముగిసింది. దేశవ్యాప్తంగా ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలకు, 100 మంది సభ్యులున్న సెనెట్‌లోని 37 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటితో పాటు 36 రాష్ట్రాల్లో గవర్నర్ పదవులకు కూడా ఓటింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో భారత సంతతికి చెందిన అభ్యర్థులు కీలక పదవుల కోసం పోటీ పడుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఎన్నికల్లో భారత సంతతికి చెందిన డెమోక్రటిక్ నేత సుహాస్ సుబ్రమణ్యం ఘన విజయం సాధించారు. వర్జీనియాలోని 10వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి పోటీ చేసిన ఆయన, 61 శాతానికి పైగా ఓట్లు సాధించి ప్రతినిధుల సభకు తిరిగి ఎన్నికయ్యారు. ఆయన ప్రత్యర్థి, రిపబ్లికన్ అభ్యర్థి డేవ్ బెకెవిత్‌కు 36 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. గతంలో బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు వైట్‌హౌస్‌లో టెక్నాలజీ పాలసీ సలహాదారుగా సుహాస్ పనిచేశారు. అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న ఒహాయో గవర్నర్ పదవికి రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ పడుతున్న భారత సంతతి వ్యాపారవేత్త వివేక్ రామస్వామి ప్రస్తుతం వెనుకంజలో ఉన్నారు. కేరళ మూలాలున్న వివేక్‌కు అధ్యక్షుడు ట్రంప్ మద్దతు ప్రకటించారు. తాజా సమాచారం ప్రకారం, ఆయన తన ప్రత్యర్థి, డెమోక్రటిక్ అభ్యర్థి అమీ యాక్టన్ కంటే దాదాపు 2,00,000 ఓట్ల వెనుకంజలో ఉన్నారు. మరోవైపు ఫ్లోరిడా 22వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి డెమోక్రటిక్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పియా దండియా ఆధిక్యంలో కొనసాగుతున్నారు. మాజీ హైస్కూల్ ప్రిన్సిపాల్ అయిన ఆమె, రిపబ్లికన్ అభ్యర్థి కేసీ అస్కర్‌పై దాదాపు 11,000 ఓట్ల ఆధిక్యంతో ముందంజలో ఉన్నారు. సిలికాన్ వ్యాలీలోని కొన్ని ప్రాంతాలున్న కాలిఫోర్నియా 17వ డిస్ట్రిక్ట్‌లో ఇద్దరు భారత సంతతి నేతల మధ్య ఆసక్తికర పోరు నెలకొంది. ఇక్కడ డెమోక్రటిక్ కాంగ్రెస్ సభ్యుడు రో ఖన్నాపై రిపబ్లికన్ నేత రితేష్ టాండన్ పోటీ చేస్తున్నారు. అలాగే వాషింగ్టన్‌లోని 7వ డిస్ట్రిక్ట్‌లో సిట్టింగ్ కాంగ్రెస్ సభ్యురాలు ప్రమీలా జయపాల్‌పై మరో భారత సంతతికి చెందిన రిపబ్లికన్ నేత నీరవ్ సేథ్ బరిలో ఉన్నారు. ఈ రెండు చోట్ల ఫలితాలు ఇంకా వెలువడలేదు. వీరితో పాటు సిట్టింగ్ కాంగ్రెస్ సభ్యుడు అమీ బేరా (కాలిఫోర్నియా), అమిష్ షా (అరిజోనా), పూజా సేథి (టెక్సాస్), సందీప్ శ్రీవాస్తవ (టెక్సాస్) వంటి అనేకమంది భారత సంతతి అభ్యర్థులు వివిధ స్థానాల నుంచి పోటీ పడుతున్నారు. లాస్ ఏంజిల్స్ నగర మేయర్ పదవికి నిత్యా రామన్ పోటీ చేస్తున్నారు. ఆమె గెలిస్తే, అమెరికాలోని రెండు అతిపెద్ద నగరాలైన న్యూయార్క్, లాస్ ఏంజిల్స్‌కు భారత సంతతికి చెందినవారే మేయర్లుగా ఉంటారు. కొన్ని చోట్ల ఫలితాలు వెలువడినప్పటికీ, పలువురు కీలక భారత సంతతి అభ్యర్థుల భవితవ్యం తేలాల్సి ఉండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.